వేద గ్రంథాలయం
PDF BOOKS 9666122140
vedhagrandhalayam@gmail.com

శ్రీరస్తు.

శ్రీరామచంద్రపరబ్రహ్మణేనమః.

# హనుమజ్జీవితము.

---

ఇది

శిష్ట్లా వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రిచేరచియింపఁబడినది

చంద్రికా ముద్రాక్షరశాలయందు ముద్రింపించి

ప్రకటింపఁబడెను.

గుంటూరు.

1918.

*All Rights Reserved.*

# కృతి.

శా॥ శ్రీరామా! గుణధామ! నీదుప్రియయౌ సీతం గనుంగొన్న స
మీరిన్దెల్పు చరిత్రమిందలరుట న్మేలైన విద్యార్థులే
నేరన్జాలని నాదు గ్రంథరచన న్నిర్విఘ్నముంజేయు పె
న్భారం బూనుదువంచు నమ్మికను నిన్ధ్యానించెదన్భక్తితోన్

సీ॥ తనరెఁ గౌండిన్య గోత్రమునందు శిష్టాన్వ
యమున శ్రీ వేంకటరమణయజ్వ
యయ్యార్యునకుఁ బుట్టినవధాని శ్రీనర
సింహనామకుఁడైన శిష్టమూర్తి
యాయనకును బర్వతాత్మజ కన్నింట
నగు సాటియను పార్వతమ్మసతికి
నాది వేంకటశబ్ద మమరు సుబ్రహ్మణ్య
మను పేర బుట్టినయతఁడ నేను

తే॥ గీ॥ రామ నీకృప నీభృత్యరాజుచరిత
మెటులొ తోచిన గతి వ్రాసి హెచ్చుభక్తి
నిచ్చితిని నీకుఁ గాన్కగా నిది సమగ్ర
యశముఁ గనుఁగొనఁ జేయ నీయదె భరంబు॥

---

శ్రీరస్తు.

శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః.

# హనుమజ్జీవితము.

11 JUN 1919 MADRAS

## మొదటి ప్రకరణము.

పూర్వకాలమునం దయోధ్య రాజధానిగాఁ గోసలదేశము నేలిన ధరారమణపుంగవులలో దశరథుఁడను ధారుణీకాంతుఁ డఱువది వేల యబ్దంబులు రాజ్యము నేలియు సంతానంబుఁ గానక ఋష్యశృంగుఁడను మునికులసార్వభౌముని సాహాయ్యంబునఁ బుత్రకామేష్టిం గావించి, తన యగ్రమహిషియగు కౌసల్యవలన శ్రీరాముని, కైకేయియను ద్వితీయకళత్రంబువలన భరతుని, సుమిత్రయను కడపటిభార్యవలన లక్ష్మణశత్రుఘ్నులను, గని, యానందించుచు, యుక్తకాలమగుడు రామున కవనీభారము మోప ముహూర్తం బేర్పఱుపఁగా మున్ను దేవాసురసంగ్రామంబునం దోడ్పడిన కేకయరాజపుత్రికొసఁగిన వరద్వయంబునం దొకటి చతుర్దశాబ్దంబులు రాముఁ డరణ్యావాసము చేయునట్లును, రెండవది తత్కాలంబునఁ దనతనయుండగు భరతుఁడు పట్టభద్రుఁడగునట్లును, గోరిన కైక వాక్యంబుల నెడసేయంజాలక పరితపించుచుండం బితృవాక్యపరిపాలనార్థము

సీతాలక్ష్మణసహితుండును వల్కలాజినధరుండునై దండకారణ్యంబునం ద్రిమ్మరు రామచంద్రునిసతినపహరించిన రావణుని జయింపందోడ్పడిన శాఖామృగశేఖరులలో నగ్రగణ్యుండగు హనుమంతుఁడు సదాశివువీర్యంబున వాయుదేవునియనుగ్రహముచేఁ గేసరికి క్షేత్రజుఁడై యంజనయను నంగనామణికి జనియించిన మహనీయునియుదంతం బతిశ్లాఘాపాత్రంబును, నత్యుత్సాహజనకంబును, నీతిదాయకంబును, బుణ్యప్రదంబును, శ్రేయోవిధాయకమును నగు గాత.

~ అంజనాకేసరులవృత్తాంతము. ~

పూర్వమరణ్యములలో సంచరించుచు, భూరుహశాఖలపైనివసించుచు, ఫలమూలాదుల నాహారంబుగాఁగొనుచు నుండు వికృతాకారులగు నల్లనిజాతివారలకు, నప్పటియార్యులు వనచరులనియు, వానరులనియు, శాఖామృగములనియు నామములువాడుచుండిరి. వారిలోఁగుంజరుండను వానరకుంజరుండు తనకుఁ బ్రియభాగినేయుండును మహావీరుండును నగు కేసరిం దనకుజామాతగా సైతమంగీకరింపందలఁచి, తనప్రియపుత్రిక నతిలావణ్య సౌకుమార్య సుగుణఖని యగు నంజన నిచ్చి పరిణయంబొనరించె. అంతనాయంజనాకేసరు లత్యంతదీర్ఘకాలము సంసార సుఖంబనుభవించుచు ననేకపుణ్యవ్రతము లొనరించియు, సంతతింబడయఁజాలరైరి. అంతం గేసరియనుజ్ఞ నంజనాదేవి, నిరాహారయై యత్యుగ్రంబగుతపంబున వాయుదేవునారాధింప నతఁడుకడుసంతుష్టుండై తనయందిమిడియున్న సదాశివువీర్యం బాపతివ్రతాతిలకంబునకొసంగ నాయువ



తియుఁ దానింధరియించి, యంతర్వత్నియై, సంవత్సరాంతంబున నొక్కసుముహూర్తంబున నొక్కపుత్రుంగనియె. అప్పుడమరులు సుమములుగురిపించిరి. అప్సరసలాడిరి. గంధర్వులు పాడిరి. మానులానందించిరి. దేవవాక్యములు దిశలనావరించె. అయ్యవసరంబున.

◆ హనుమంతుడు పుట్టిసూర్యాఁగుల మ్రింగఁబోవుట.
ఇంద్రుని వజ్రముచే మూర్ఛిల్లుట ◆

సీ॥ లలితసౌదామినీ తులితదేహమువాని
నరుణారుణాంబుజాస్యములవాని
రత్నకుండలభాసుర కపోలములవాని
రంగత్పిశంగ నేత్రములవాని
నాజానుదీర్ఘబాహాదండములవాని
ధవళయజ్ఞోపవీతములవాని
హారప్రభామనోహారి వక్షమువానిఁ
గమనీయకర కంకణములవాని
తే॥ మంజురుచిపుంజిఁగను హొన్నుముంజివానిఁ
బసిమిఁగనుపట్టునునుపట్టుపంచెవాని
వాసవధ్వజ నిజవాలవల్లివాని
సత్కుమారునిఁగని తల్లియాత్మనలరె॥ 1

ఇట్లంజనయుఁ దనతనయునియుదయంబున కత్యంతముదంబునొంది యాఁకటివెల్లున రోదనంబొనరించు ముద్దుపట్టిం జూచి "నీవారగింప ఫలంబులఁగొనితెత్తు; వాపోవకుము". అని

యూరడించి పరిసరారణ్యంబునకరిగె, అప్పట్టున నుదయగిరి శిఖరినలంకరించిన బాలభాస్కరబింబం బవలోకించి యది ఫలం బనుభ్రాంతిం బాల్యచాపల్యంబున నాంజనేయుండుదయాద్రికెగసి, భానుం గబళింపనుంకింప నది వెచ్చనై ముట్టరాకుండె. ఆనాఁడు పర్వమగుటం జేసి భానుంగబళింప స్వర్భానుండచ్చోటికే తేర నసితఫలభ్రాంతిచే రాహుం బట్టఁబోవ, నతఁడదరిపడి యందుండఁజాలక, తివ్వనం బాఱి, యమరావతియం దత్యంత కౌతూహలంబున సురమునిగణపరివృతుండై పేరోలగంబున్న వాసవున కత్తెఱంగెఱింగింపనతఁడత్యాశ్చర్యనిమగ్నతఁ బాంచాలిక గతి నిశ్చేష్టితుండై, క్రిమ్మఱఁ దెలివొంది రాహువుం గనికరంబునంగని, వజ్రాయుధహస్తుండునై రావతారూఢుండునయి యపరకలధౌతాచలంబుభాతి నాంజనేయునికడ కతిసత్వంబునంజనుదేర, నాంజనేయుండు నతిక్షుధాప్రేరితుండై "అరుణఫలమగ్ని కరణిం బట్ట ననువుగాదయ్యె! నీలఫలం బందదయ్యె! ఇదె శ్వేతఫలంబు! దీనిం బొదివిపట్టి మెసవెదం గాక" యని యింద్రునిపైకుఱికె పాకశాసనుండునుం దన యమరత్వంబునుమఱచి, యాశ్చర్యభయంబులు పెనఁగొన నందుండ వెఱచి, వాహనంబును దిగవిడిచి, పరాఙ్ముఖుండై పఱుగిడె. పావనియు నాతని వెనుదగిలి పాఱుచుండె. వాసవుం డతనినీక్షింపఁ జడిసి, యలసి, తనవజ్రంబుఁ గేలంగీలించి వెనుకకు విసరె. అది యాంజనేయుని వామహనువుం జీల్పఁ జేష్టలుడిగి పూర్వాద్రిపయింబడె. వాయుదేవుం డది యెఱింగి దురంతచింతాక్రాంతమనస్కుండై పుత్రుం జేపట్టి పూర్వాద్రి



గహ్వరంబుం బ్రవేశించి తనయాత్మమాత్రిక నుపసంహరించె. అప్పుడు

సీ॥ యాజకుల్వహ్నిహవ్యములు వేల్వఁగఁ జాఁచు
హస్తముల్సాచిన యట్టులుండె
దివిజులు ప్రేరేపదివికెగిరిన దేవ
యానంబు లెగిరినయటులనుండె
మునులునదీతోయములఁ దోఁగముంచిన
యంగముల్ముంచినయటులనుండె
బహుమృగనరముఖప్రాణులుర్విని బెట్టు
నడుగులు పెట్టిన యటులనుండె
తే॥ భానుమండలమెక్కఁ జోఁబాదుకొనియెఁ
గాలగతిదప్పె సత్క్రియల్గడచె వేద
పాఠముడివోయి బాహ్యమభ్యంతరంబు
గాడ్పుబంధించి చనినయక్కాలమునను 2

త్రిలోకంబులం గల సకలప్రాణులకును ప్రాణమైన పవనుని యాగ్రహంబునకోడిన సకలజీవులకు నుదరభారంబతిశయించె. కాళ్లుతేళ్లయ్యె. ఊపిరియాడదయ్యె. మాట రాదయ్యె. మేనులులావయ్యె.

— బ్రహ్మేంద్రాదులు హనుమంతుని బ్రతికించి వరంబులొసంగుట —

ఇట్టి తమయవస్థంగడతేర్ప నేర్పరియగు ప్రజాపతికడకేగుటకయినను కాళ్ళురాని సురమునిగణంబు లెట్టకేలకు నిక్కపులోకంబునకరిగి, నిండుకొలువున్న పరమేష్ఠింగని, "కాలకింకరపాశబద్ధ జీవుని చందంబున మాటలుతడఁబడఁ

దమయాపన్నత నాతనికిని వేదించి, లోకరక్షణోపాయ మర
యుట కిది యదనని నుడువు దేవమునులంజూచి, కమలాసనుం
డంతర్దృష్టి నంతయు నెఱింగి, మునుల కెఱుకపఱిచి, సురముని
గణపరివేష్టితుండై పవనుం దనియింపం బూర్వాద్రికడ కే
తెంచి, యనిలునూరార్చి, తనపాదకమలంబులం బెట్టిన యాతని
పట్టిం బ్రదికించి, వాత్సల్యంబు రెట్టించి యిట్లనియె.

"పుత్త్రా! నే నీత్రిలోకంబులనిర్మించి సమస్తప్రాణు
లసృష్టించి, వానికిం బ్రాణాధారంబుగాఁ బుట్టించిన నీ కీ
దేవేంద్రుండజ్ఞానంబున నపకృతిఁగావించె. దానంజేసి నీవొన
రించిన ప్రత్యాఖ్యానమును దోసంబుగాదు. నీపట్టిజీవించె.
లోకసంతాపంబుడిగింపుము"ని యానతిచ్చిన సమీరుం డత్యం
తసంతుష్టాంతరంగుండై గాడ్పుజగంబుల కుత్సాహంబుగ
నెసంగి తనజగత్ప్రాణాభిధానంబు సార్థకపఱిచె. ప్రాణులు
సంతసిల్లె.

చతురాననుం డాయెడ నందలి వేల్పులందిలకించి యాం
జనేయుంజూపి "ఈ మారుతాత్మజుం డికమీఁదఁ గొంతకా
లంబున కసురులనుక్కడంచి లోకహితంబును మనకుఁ బ్రియం
బును జేయవలంతియైనవాఁడు. అదికారణంబుగా నీతనికత్యం
తబలపరాక్రమధైర్యస్థైర్యంబులు గలుగునట్లు మీరందఱు
నొక్కొక్కవరమీయుఁడు" అనివాక్రుచ్చె.

తే॥ అనినసురలెల్ల మేలని రపుడువజ్రి
తనశతారంబుదాకియు హనువువెలయ



కతనహనుమంతుఁడనుపేరుఁ గాంచునితఁడు
వజ్రహతినెవ్వడిఁకనని వరమొసంగె." 3

బ్రహ్మదండ బ్రహ్మాస్త్రముల హానినందని దీర్ఘాయు
వజుఁడొసంగె. శూల రౌద్ర పాశుపతా ద్యస్త్రసమితిచేఁ
జెడని ప్రభావంబు శివుఁడొసంగె. కాలదండ కాలపాశ
మృత్యువు లీ యనిలజు నొంచలేవనియు నిరామయుఁ డగునని
యు యముఁడనియె. "నా తేజంబున నీతనికి శతాంశమిచ్చితి;
ఇతఁడు విద్యాభ్యాసార్హప్రాయుఁడగునప్పు డితని సమస్తవి
ద్యలంబరిపూర్ణుఁ జేసెద" నని భాస్కరుండు పలికె. పాశోద
కంబులఁ బాధనొందఁడని పశ్చిమదిగీశుండు పరమానందంబున
ననుగ్రహించె. వీతిహోత్రుండు దనచేత నశియింపఁడనియె.
గదాయుధంబునఁ గంటుఁబడఁడని కుబేరుండు ప్రసాదించె.
ఆయుధంబులేవియు నితనిం జెఱుపఁజాలవని విశ్వకర్మ వాక్రు
చ్చె. తక్కుంగల దేవతలందఱు నొక్కొక్క వరం బొసంగిరి.
అంతం దేవతలందఱు విన సురజ్యేష్ఠుం డనిలునితో "నీకుమా
రుఁ డనన్యసామాన్య విక్రమంబున. రావణాది దనుజులంబరి
మార్చుట కర్కవంశాంబుధి సోముండగు రామునకుం జేదో
డయ్యెడు; ఈతని కసాధ్యమెద్దియు నేలోకంబున గోచరంబు
కాదు" అని యాశీర్వదించి సురసేవితుండై సత్యలోకంబున
కరిగె.

* హనుమంతుని బాల్యచేష్టలు, ఋషులశాపము, సూర్యునొద్ద జదువుట. *

అంజనయుఁ దనయపత్యము నట్టడవిం దిగవిడిచి,
కాఱుకాననంబునంబునం దిమ్మరి ఫలంబులంగొని, నిజనివా

సంబునకేతేరఁ దన యర్భకుండగోచరుండగుట కత్యంత
చింతాభరస్వాంతయై బిడ్డఁ డేవన్యమృగములవాతఁబడెనో
యని వాపోవుచుండె. పవనుండును పట్టిం బట్టుకొని పాదచా
రియై ప్రసూతిక కడకేతేర నాయమ పెన్నిధిఁగన్న పేదపగిది
నశ్రుధార లానందబాష్పములుగాఁ బరిణమింప, వాయుదేవు
నకెఱఁగి కరకమలంబుల ముకుళించి నిలిచియుండెను. పవమా
నుం డాయమనీక్షించిడింభకుంజూపియాతనియుదంతంబంతయు
నామెకు శ్రవణానందంబుగ నుడివి, పుత్రుకుడించి యథే
చ్ఛంజనియె. అంతంబావని నెలబాలుని చందంబున దినదిన
ప్రవర్ధమానుండై యాడాడఁగ్రుమ్మరుచు బాల్యచాపల్యంబునం
దనకు దేవతలొసంగిన దీవెనలగర్వంబున నాయాపరిసరంబు
లఁ దపంబొనరించు మహామునులయాశ్రమంబులకరిగి, వారి
ఫలమూలంబులఁ దస్కరించి దిగమ్రింగి వారింగని కిలారించు
చు, వల్కలాజినము లపహరించుచు వేళాకోళముఁ జేయు
చుండెను. మునీశ్వరు లీతనిదాడి కోర్వనోపక కినిసి "మృత్పిం
డాశనివైన మహారోగంబునకు బలె నీ నిజబలపరాక్రమంబు
లు నీకగోచరమ్మైయుండు; పొమ్ము" అని శపియించిరి. దానినె
ఱింగి పితామహుండచ్చోటికేతెంచి ఋషులంజూచి "రుద్రతే
జంబున ననిలునకౌరసుండై లోకహితార్థంబుగ మర్త్యలో
కంబున నంజనకుం జనియించిన యపారసత్త్వుండగు నీపావని
నీగతిఁ దిట్టంజనునే? శాపమోక్షంబుం బ్రసాదింపుఁడు" అనిన
పరమేష్ఠిపలుకులాలించి యాయగ్రజన్ములు వీనింబొగడినను



దాఁకినను వీనికి తనబలపరాక్రమంబులు స్మృతికివచ్చు" నని
శాపంబును మఱలించిరి.

కొంతకాలంబున కనిలజుఁడు విద్యాప్రౌఢిమంగను
కౌతూహలంబునఁ దిననాథుంజేరి సాష్టాంగదండప్రణామంబుఁ
జేసి నిలిచిన నరుణకిరణభాసురుండిట్లనియె. "వత్సా! విద్యా
వాంఛం జనుదెంచిన నీ వెట్లు నాకడనిలువఁగలవు? నేనొక్క
చో నిలుచువాఁడంగాను. నాతో బఱువెత్తిన నీకఖిలాగమా
దు లెట్టులలవడును?" అనిన భాస్కరుపలుకులాలించి
మహోన్నతకాయుఁడై యుదయాస్తాచలంబులం దనపాదయు
గళంబుం బెట్టి నిలిచె.

క॥ మునుహరి త్రివిక్రమాకృతిఁ
గనిపించినయటులనూర్ధ్వకర్పరమెల్లన్
దనుమయముగనుండినసి
హనుమత్కపిఁజూచి వెఱచె నఖిలజగంబుల్॥ 4

శా॥ భానుండద్భుతమందె నంత నిజరూపంబూని యావానరుం
డానీరేరుహబంధుఁ జేరి కెమరై యాకాశమార్గంబునన్
దానెంతేవడిఁ బోవుచున్ శ్రుతులు శాస్త్రంబుల్బఠించెన్ బతి
జ్ఞానగ్రాహకతావిశేషములకుంజండాంశుఁ డుప్పొంగఁగన్॥

తే॥ కుడిచిచల్లని నీడలఁగూరుచుండి
గురువుచెప్పినఁజదువరీ ధరవడుగులు
నిరశనుండయి పఱచుచు నింగిగఱకు
లెండకుసహించి చదివెనీతండు ఘనుఁడు 6

ఇత్తెఱంగున సూత్రవృత్త్యర్థపదములతోడ ఛందోవ్యాకరణాది శాస్త్రజాలం బనవద్యంబుగ నభ్యసించిన పావనికి సుమధురవాక్పటుత్వమునంగాని, సమస్తవేదశాస్త్రములం గాసి శతధృతి కవిబృహస్పతు లయిననీడురారు. అంతియ గాక యీశాఖామృగశేఖరుఁడు, వైరాగ్యమునకు నివాసము వినయంబున కునికిపట్టు. శమదమోన్నతుల కాధారుఁడు, దాక్షిణ్యమునకు చోటు. సౌశీల్యమునకు బిడారు, పరోపకారంబున కిక్క, విక్రమస్ఫురణకు తావు. గాంభీర్యమునకుఁ బ్రాపు. బ్రహ్మవిద్యకుఁ బట్టుగొమ్మ. ఘనతపోధనమునకు నిధానము. ధైర్యమున కిమ్ము. రామునియందుండు భక్తికి నెలవు. మఱియు భూగోళ మొక్కసారి ముంపఁగలిగినట్టి పారావారమునకంటెను మించిన గాంభీర్యముఁగలవాఁడు. చతుర్దశభువనంబులను నల్పకాలంబున భస్మీకరింపఁజాలిన వీతిహోత్రునతిక్రమించిన ప్రతాపవంతుఁడు పర్వతారణ్యంబుల నణుమాత్రంబున నణువుగా దోలఁజాలిన వాయుదేవున పహసించు వేగవంతుఁడు. బ్రహ్మాండ భాండంబుం బట్టి బ్రద్దలు సేయఁజాలిన విలయభైరవు నతిశయించిన రౌద్రవంతుఁడు.

ఇట్టిమారుతాత్మజుండు; వానరులం బరిపాలించుచుఁ *కిష్కింధానగరంబుననున్న వాలి సుగ్రీవులను సోదరులంగొలుచుచుండఁగాఁ గొండొకకాలంబున కాయనుజన్ములకమిత్రత వాటిల్లిన నందగ్రజునకునోడి, రాజ్యకళత్రంబుల వీడి, నలనీలాదిసహచరులం గూడి, మతంగాద్రినివసించుచుండిన సుగ్రీవుం జేరి యతండు గొలుచుచుండె.

* బళ్ళారిమండలములోని హంపీక్షేత్రమే (The ruins of Humpee) కొంతకాలము కర్ణాటరాజ్యధురంధరులగు కృష్ణదేవరాయాది మహారాజులచేఁ బరిపాలితంబైన విజయనగర పురాధిష్ఠితమైయుండుటయకాక వాలిసుగ్రీవనివాసితంబైన కిష్కింధాపట్టణస్థానంబుగాఁ గూడఁ బ్రాచీన కాలమునఁ బ్రసిద్ధిచెందియుండెనని చరిత్రకారులయాశయము.



## రెండవ ప్రకరణము.

పంపాతీరముననున్న రామలక్ష్మణులజూచి సుగ్రీవుఁడు భయపడుట. హనుమంతుఁడు ధైర్యముచెప్పి భిక్షుకరూపముతో రామలక్ష్మణుల కడకేగి తోడ్కొనివచ్చి సుగ్రీవునితో స్నేహముచేయుట.

సాకేతనగరనాయకుండగు దశరథుని యగ్రపుత్రుండగు రామచంద్రుండు తన సవతితల్లియగు కైక వరంబునం బితృవాక్యపరిపాలనార్థము సోదరకళత్రసహితుండై జటావల్కలంబులు ధరియించి దండకారణ్యంబునఁ బంచవటిం బర్ణశాలనిర్మించుకొని వసియించుతఱి, లంకాధినాథుండగు రావణుచేఁగోల్పోయిన తనయర్ధాంగియగు జనకజనన్వేషించుచు, సోదరుండగు సౌమిత్రిద్వితీయుండై పంపాసరోవరతీరంబున నాసీనుఁడై యున్న దాశరథింజూచి, 'వాలిపంపునఁ దన్నుఁ బొరిగొననేతెంచిన మాయామానుసులని కొంచతనంబునం బెగడొంది గంతులిడు సుగ్రీవుంగని యంజలిఘటించి మారుతాత్మజుఁడు "భానునందనా! నీవెవ్వరినవలోకించి వాలిపంపున నరుగుదెంచినవారని నీకపిత్వముసార్థకపడ బెగడుచుంటివి? వారు వాలియనుమతిం జనుదెంచినవారని నమ్ముటెట్లు?

వాలియు నీయందిప్పట్టున నింతటిగోసంబెంచునని యెంచుట కనువగుకారణమగోచరము. అదియునుంగాక,

క॥ బుద్ధింగార్యముదలఁపని
బుద్ధివిహీనులను భూతములె శాసించున్
సిద్ధింపదారయన స
ద్బుద్ధులకును రాచకార్యభూతులు గలుగన్॥ 7

అనినమారుతి నవలోకించి తపనతనయుండు "వాయునందనా! చూచితివా? పంపాసరోవరసమీపంబున ఘోరశస్త్రపాణులై ప్రచ్ఛన్నవేషంబున నున్న మహావీరులను అట్టివారలం జారులవలన నెఱుంగుట రాజధర్మము.

క॥ నమ్మఁజనదెదిరిఁదమ్మును
నమ్మినవారిమదిలోన నమ్మకపరుపైఁ
గ్రమ్మఱఁదప్పిడిచెఱుతురు
నమ్మన్నే వారినిపుడు నా హితమూరన్॥ 8

నీవేగి వారలనరసిరమ్ము" అనిన భానునందనుపలుకుల కలరి వాయునందనుండు భిక్షుకరూపధరుండై రామలక్ష్మణుల కడకేతెంచి నమస్కరించి మస్తకన్యస్తహస్తుండై నిలిచి

"క॥ సింహప్రేక్షణులాతత
సింహపరాక్రములుభూరి సింహస్కంధుల్
సింహసమానబలాఢ్యులు
సింహకృశోదరులు పురుషసింహులు వీరల్॥ 9



వల్కలాజినములధరియించిన మీర లిందోపేంద్రతుల్యులు. ప్రభాకర తేజస్కులు. ధీరోదారులు. భూరివక్షులు. విశాలాక్షులు. ఇట్టిమీరలీఘోరకాంతారంబున కరుగుదెంచుటకుఁ గతమెయ్యది?" అనిన విని రాఘవానుమతంబున లక్ష్మణుండనిల నందను నవలోకించి "అయ్యా! కోసలదేశంబును బరిపాలించిన దశరథుని యగ్రనందనుండగు రామచంద్రుండను నీమహానీయుని యర్ధాంగి యగు పుడమినందన నేదురాత్ముండో తస్కరించె. ఆమహాదేవి నెమకుచు మే మీ ప్రాంతంబుల సంచరించుచుంటిమి. పరివ్రాజకరూపధరుండవగు నీ వెవ్వఁడవు? యిచ్చటికేలవచ్చితివి? నిన్నుంజూడఁజూడ నీయందేలకో ప్రేమస్ఫురించుచున్నది. నీయుదంతంబు మఱుఁగుసేయక శ్రుతిగోచరంబుఁజేయుము" అనినలక్ష్మణుపలుకులకలరి పావని వారలకెఱిఁగి నేను మారుతాత్మజుఁడ. సుగ్రీవునిసచివుఁడ. కామరూపుఁడ. అత్యంతశుభాకారులై జటిలవేషధారులగు మిమ్ము నవలోకించి భానునందనుండు భయపడి స్నేహభావంబున మీకడకనుప దూతకార్యార్థము కృత్రిమపరివ్రాజకుండనై జనుదెంచితి. సూర్యసుతుండగు సుగ్రీవుండు సమీకంబున సుత్రామసూనునకోడి, రాజ్యకళత్రంబులం గోల్పోయి సుఖంబులకుదూరుఁడై దుఃఖంబులకునికిపట్టయి ఋశ్యమూకంబునఁ బలవరించుచున్నవాఁడు. అతనికి మీ సాహాయ్యంబును మీ కాతని సాహాయ్యంబు నత్యంతావశ్యకంబులు. మఱియు నతఁడర్కనందనుఁడు. మీరర్కవంశజులరు. కావున మీకుఁ బరస్పర మైత్రివాటిల్లుటయు సుకరంబ ఆతఁడు ధర్మ

శీలి. ప్రతాపశీలి. కావున మీరలన్యోన్యమైత్రినుండినఁ జతు
ర్దశభువనంబుల నెక్కుపెట్టసాధింప సమర్థులరు". అను ధైర్య
వచనంబుల కత్యంతముదంబు నొందియు నంతరంగంబున
రాఘవుండు జానకిందలఁచి " అంజనీనందనా! నాయట్టి యదృ
ష్టహీనుఁ డీచతుర్దశభువనంబుల నెందైన నవతరించెనని
యెన్నఁడయిన నాకర్ణించితివే? భానుకులంబునం బరమపవి
త్రుండగు రఘువంశంబునఁ జనియించి దశరథునకుఁ దనయుం
డనై, జనకునిఁబోలి జనలోకంబుఁగాపాడు జనకునకు జామాత
నైన నేనీ చందంబున నాముద్దులగుమ్మ నాబంగారుబొమ్మ
నాయానందవార్ధి నాయనుంగురాణి నాయర్ధాంగి నాప్రాణ
నాయికం గోల్పోయి నిద్రాహారవిదూరుండనై పలవింపఁ
బాలుపడుట కేజన్మంబున నెంతదుష్కృతమగు దోసంబుగావిం
చితినో? సుగ్రీవుండు నన్నుం దనహితునిఁగాఁ గైకొని నాబ
న్నంబుఁ బాపఁ దోడ్పడునా? నేని చింతాసాగరతీరంబుఁ
గనఁగలనా? నాప్రాణదాయిని నాయెట్టయెదుట నిలిచి
యెన్నఁడు నేత్రపర్వంబుగావించు? ఎన్నఁడు నా కీవియోగతా
పంబు దీరు?" నని హోరుహోరున విలపించు రామచంద్రు
నవలోకించి యాంజనేయుండు "స్వామీ! తామేలచింతిల్లె
దరు? తమ శోకావసానసమయ మత్యంత సమీపంబున
నున్నట్టు లీపంపాసరోవర మత్యంత శుభసూచనలం జూపట్టు
చున్నది. ఎట్టులన, భానునందనప్రేరితంబులై వనచరబలం
బులు తండోపతండంబులుగఁ దమపాదకమలసేవ కరుదెంచి
నిలుచు ననుకరణి, నీ తరంగపరంపర లేతెంచి, తీరంబుఁ జేరి



యాగుచున్నయవి. తమయమోఘాస్త్రములీమాడ్కి రక్క
సులం గబళించు ననురీతి నీకొలని కొక్కెరలనేక శకులసంతా
నంబుల దిగమ్రింగుచున్నవి. పిమ్మట రాక్షసాంగనలవదనంబు
లీతీరున ముకుళించుననుభాతి, నీకాసారాంతర కైరవంబులు
ముకుళీకృతంబులై చూపట్టుచున్నవి. జయానంతర మిత్తెఱం
గునఁ దమవదనాంబుజంబు వికసించుననుపగిది, నీతటాకాం
తర్గత పద్మసముదాయము వికసించియున్నది". అని యివ్విధంబు
ననాంజనేయుండు రామచంద్రు నూరార్చి రామలక్ష్మణులం
దోడ్కొని ఋశ్యమూకంబున కేతెంచి, సుగ్రీవునికడ కేగి,
యాతని భయంబుడిపి, కాష్ఠంబుల నగ్నిమథించి రామసుగ్రీ
వుల కగ్నిసాక్షికంబుగా సఖ్యంబు నెఱపె.

అంత రామచంద్రుండును సుగ్రీవహితంబుగా వాలిం
దునిమి, సుగ్రీవు వానరరాజ్యపట్టభద్రుంగావించి, శారదా
గమనంబు దండయాత్రికనువగు నదనని యూహించి, యంత
దనుక రాజ్యకళత్రభోగంబులం దనియ భానునందనుఁ గిష్కిం
ధకనిచి, తనకుంబురప్రవేశార్హత లేమిం జేసి సౌమిత్రిద్వితీ
యుండై ఋశ్యమూకంబున నిలిచె

వర్షాకాలమతిక్రమించిన యనంతరంబ యాంజనేయ
ప్రేరితుండై భాస్కరసూనుం డపరిమిత వనచరసేనా సమే
తుండై ఋశ్యమూకంబున కేతెంచి కృతజ్ఞతమెఱయ దాశ
రథులకుం గృతాంజలియై రాఘవానుమతంబున సకలవానరుల
నానాముఖంబుల సీతాన్వేషణంబునకుఁ బుచ్చి, నల నీల గజ
గవయ గవాక్ష గంధమాదన మైంద ద్వివిదాంగద జాంబ

వత్ప్రముఖులఁదోడిచ్చి యాంజనేయుని యామ్యదిశాన్వేషణంబుఁజేయ నాజ్ఞాపింప, వాయునందనుఁ జేరఁబిలిచి రాఘవుండిట్లనియె.

"క॥ జానకి వెదకఁగఁ జనికని
యానందముతోడవచ్చి యాదట రఘు సం
తానము నా ప్రాణంబులు
మానముగలుగంగఁజేయుమారుతపుత్రా॥ 10

క॥ మానుగనీముద్రికఁగని
మానసమున సంతసించి మారుతసుత ని
న్నేనటబుత్తెంచితినని
జానకి సత్కృతులు నీకు సమ్మతిఁజేయున్"॥ 11

అని తన నిజ నామాంకితమగు కాంచనముద్రికఁ జేతికిచ్చిన

క॥ శిరమున ముద్రికఁదాలిచి
నరపతిపదములకు మ్రొక్కి నలువుగ గంతుల్
పొరిఁబొరి వైచుచుఁ బావని
తరుచరసైనికుల నడుమఁదద్దయు వెలసెన్॥ 12

—♦ హనుమంతుఁడంగదాదుల సహాయముతో సీతాన్వేషణార్థము దక్షిణదిక్కున కరుగుట ♦—

వాయునందనుండు నిజసహచరసమేతుండై యామ్య దిగ్భాగంబునకరిగి, తరు గిరి వన వల్మీక నద నదీపరిసరంబులం జనకనందన నన్వేషించి, యెందునుంగానక వగలం బొగులు వనచరుల నుత్సాహకరంబులగు వాక్యంబుల



ధైర్యావలంబులఁజేసి, వనచరులంగూడి * స్వయంప్రభా గుహం జేరి యచ్చటి మహాత్మ్యంబులకచ్చెరువంది, సీతంగానక ప్రాయోపవిష్టుండై † సంపాతివలన వైదేహీవృత్తాంతం బరసి,

---

* హనుమదాదులు సీతను వెదకుచు వింధ్యాద్రి కేఁగిరి. ఆఁకలి దప్పులనలసిరి. ఆకొండగుహనుండి తడిఱెక్కలతో కొన్ని పక్షులు బయటికి వచ్చుచుండె. ఆంజనేయుండదిగని ఆగుహయందు నీరుండునని వానరులతో నాగుహం బ్రవేశించె. అక్కడ సూర్యచంద్రాగ్నికాంతులులేక దేదీప్యమానంబుగఁ బ్రకాశించుచుండె. అది గృహములు, ఫలవృక్షములు, పూలచెట్లు, సరస్సులు, పక్షులు మొదలైనవి గలిగి మిక్కిలి రమణీయముగానుండె. వానరులచ్చటికేఁగ క్షుత్పిపాసలునశించె. అచ్చటమిగుల సొగసైన మందిరమొకటియుండె. అందుమున్ను మయుఁడు హేమయను నచ్చరలేమతో చిరకాలము సుఖించె. పిమ్మట హేమ సురలోకంబునకరిగె. హేమావిహీనమగు నచ్చోటనుండుటకు మనస్కరించక మయుండును వేఱొకచోటికిఁ జనె. హేమచెలికత్తెయగు స్వయంప్రభ స్నేహవాత్సల్యంబున హేమాధామంబువీడఁజాలక నచ్చట నేయుండె. వానరులారమణింగని సంతసిల్లిరి. అచ్చటికెవరును బోఁజాలరు. ఒకవేళపోయినను జీవంబులతో మరలిరారు. ఈవానరులు లోకోపకారులు, రామదూతలు నగుటవలన కనికరించి, స్వయంప్రభ వారిని గుహవెడలించె.

† సంపాతి, రావణుఁడు సీతను గొనిపోవునప్పుడు వానితో పోరి, పిమ్మట రామానుగ్రహంబున బరమపదమలంకరించిన జటాయువున కగ్రజుఁడు. వీరిరువురు నొక సమయంబున సూర్యుని ముందుచేర పంతంబులాడి పఱచిరి. అట్లుపోవ సూర్యుని వేడిమినోపక జటాయువు జనస్థానంబున బడియె. ఈ సంపాతి ఱెక్కలు కమలి వింధ్యాద్రిపయిం బడె. వానరులు సీతం గానక చింతించుచు ప్రాయోపవేశంబుఁ జేయఁబూని వింధ్య

లంకాభిముఖుఁడై మహేంద్రాద్రి కరిగి లవణోదధిలంఘించు నుపాయం బరయుచుండెను.

‡ అప్పుడంగదుండు తరుచరులనవలోకించి కార్యానుకూల్యగతి కరంబు మెఱయు వచోధోరణి నిట్లనియె. "కపివరేణ్యులారా! మీరెల్లరు నత్యంతజవసత్త్వసంపన్నులరు. స్వామిభక్తి పరాయణులరు. రామకార్య దురంధరులరు. ఒక్కొక్క రెంతెంతపనికయిన నోపుదురు శతయోజన విస్తీర్ణంబగు శరనిధిలంఘించి సీతంజూడక రామసుగ్రీవుల కడ కరుగరాదు. మీ రెవ్వరెవ్వ రెంతెంత దాఁట సమర్థులరు?" అని యడిగిన యువరాజుం జూచి, గజుఁడు దశయోజనములును, గవాక్షుఁ డిరువది యోజనములును, శరభుఁడు త్రింశద్యోజనములును, వృషభుఁడు యోజనమండలంబును, గంధమాదనుఁ డేబది యోజనములును, మైందుఁ డఱువది యోజనములును, ద్వివిదుండు డెబ్బది యోజనములును, సుషేణుఁ డెనుబది యోజనములును, దాఁట సమర్థులమని నుడివిరి.

---

పయిం బవళించిరి. సంపాతి వారింగని వారివలన జటాయువు వృత్తాంతం బెఱింగి, వారికి సీత లంకయందున్నదని యోగదృష్టి నెఱింగించె. అప్పుణ్యావశంబునఁ దొల్లి నిశాకరుఁడను మునీశ్వరుని వచనానుసారంబుగ సంపాతి ఱెక్కలు యథాస్థితి యయ్యె. సంపాతి వానరులకు లంక కరుగుమార్గంబు నెఱింగించె.

‡ వానరుల బలపరాక్రమంబులు వివరించుట యనవసరమైనను, ఆంజనేయుఁడు తన సహచరులకంటె నధికుఁడని తెలియుట కొఱకిచ్చట వివరింపఁబడినవి.



మారుత సమవేగుండు నతిప్రాజ్ఞుండును శతవృద్ధుండునైన జాంబవంతుఁడు శాఖామృగశేఖరుల నాలోకించి, వైనతేయుని జననంబును, అమృతాపేక్షం దేవాసురు లంబుధి మథించుటయు, దేవాసురసంగ్రామంబును, సమగ్రంబుగ మదీయనేత్రపర్వంబుగ నాలోకించితి. అప్పటి బలరాక్రమంబు లిప్పు డుగ్గడించుట యత్యంత హాస్యాస్పదంబై యుండు. ఐనం జెప్పెద నాలకింపుఁడు. బలిదైత్యేంద్రుని యజ్ఞకాలంబున వామనుఁడై విజృంభించిన త్రివిక్రమ దేవునకుఁ బ్రదక్షిణత్రయం బే నెక్కరుండఁ గావించి, యక్షణంబ సుషేణుం గూడి యేకవింశతిప్రదక్షిణంబులం జేసితి. అమరులం బ్రార్థించి యమృతంబుం గ్రోలితిని. నా యౌవనకాలంబున నుదయాస్తమయ పర్వతంబుల కొక్కదినంబున ననేకపర్యాయము లవలీలంజనుచుంటి. అక్కాలంబున నన్యుతేరును నాకీడు లేరు. సుషేణుంగూడి పర్వతంబులం జేపట్టి కందుకక్రీడఁ గావింప, సుషేణ ముక్తాద్రి కందుక మస్మజ్జానుఘాతమునం బగలించితి. అది కంటకంబుపగిది మోకాల నాటియుండెను. అది కారణంబుగా గమనంబున నించుక గుంటనైతిని. ఐనం దొంబది యోజనము లిప్పుడైన నశ్రమంబునఁ దాఁటంజాలుదు నటుపైన సందేహము. అనిన నలుండు నంతకు నోపుదు ననియె.

వాలి తనూజుండును యువరాజు నగు నంగదుండు తనలావుందలపోసి "శతయోజనసంద్రంబు శరవేగంబునఁ గడువం జాలుదు. మగిడి రాగలనో లేనో యను సందేహం

బుఁ గలదు." అనిన జాంబవంతుఁడు, తారాసుతా! వాలి సహస్రయోజనము లతిశీఘ్రంబున నిర్గమింపఁగల సమర్థుఁడు. సుగ్రీవుండునట్టిఁడ. నీవును వాలిసత్త్వంబున కొంకించుకయుం దీసిపోవువాఁడవు కావు. నీవు రాజవు. మాకెల్లరకుం బ్రభుఁడవు. మేము పరిచారకులము. మమ్ముం బురస్కరించుకొని సకలకార్యంబుల సాధింపుము. నీవు తరుమూలంబు పగిదిం బ్రకాశించుచుండ మేము శాఖాపల్లవంబుల చందంబు నొందుదుము. మూలరహితంబగు శాఖాపల్లవంబు లేగతిం బ్రభాతంబు నొందఁ గలవు? కావున మేము నిన్నుఁ బాసిజాలము. నీ వేగిన మాకొడయఁడెవ్వఁడు? మేము జీవించుటెట్లు?" అనిన భల్లూకనాయకు నవలోకించి యంగదుండు "మనము జనకజం జూడక జనితిమేని మార్తాండనందనుం డత్యుగ్రత మనలం బొరిగొను. రాముండువగంగుందు. నీవు మాకెల్లరకుం బెద్దవు. ప్రాజ్ఞుఁడవు. ఆలోచనాశీలుఁడవు. పారావారంబు గడువంగల పరాక్రమశాలి యెవ్వఁడు?" అని యడిగిన తారాతనయు పలుకు లాలకించి "మనవచ్చినకార్యంబు సాఫల్యంబు నొందించు మహావీరు నెఱిఁగింతునుండు" డని పవమానసూనుం జూపి జాంబవంతుండు వానరుల కిట్లనియె. పుంజికస్థల యను నప్సరోవనిత శాపవశంబునఁ గీశ కాంతయై యంజన యను నామంబునఁ గామరూపిణియై మర్త్యంబున నవతరించి, కేసరికిం బ్రియురాలై, యనిలుని యనుగ్రహంబునం బడసిన మన యాంజనేయుండు గలుగ మన కధైర్యమేల? వైనతేయుని పక్షంబులనపహసించు బాహుబలంబు గల నీ మహామహుఁడు



వాసవాత్మజు నతిక్రమించు జవసత్త్వసంపన్నుఁడు. జననకాలంబున నంతరిక్షంబున కెగసి, లోకంబులు భీతిల్ల లోకనేత్రుం గదిసి కబళింపనుంకించిన జవశాలి. ఇట్టి కేసరీతనయుండు గల్గ మన కేమికొఱంత? ఈతని జనకుండు జగత్ప్రాణుండై యుండ నీతఁడు మనప్రాణంబులఁ గాపాడు టెంతటిపని?

### — జాంబవంతుఁడు హనుమంతునిఁ బొగడుట. —

పవమాననందనా! ఈ వానరానీకంబున నిన్నుం బోలిన వీరుఁడు లేఁడనుట యాథార్థ్యమే కాకున్నచో సీతాన్వేషణార్థము యామ్యదిగ్భాగంబున కనుపఁబడిన నస్మదాదులనెల్ల నెడఁజేసి, సాకేతనాయకుఁ డంగుళీయకము నీకొసంగు టేల? స్వామిభక్తిపరాయణుఁడ వన్న నీవే. సముద్రమువలీలం దాఁట సమర్థుఁడవీవే. లంకం జొచ్చి జానకినవలోకించి రాఘవునామోదము నొందించు నుత్సాహవంతుఁడ వీవే. సుగ్రీవుని కోపానలంబున కాహుతిగాకుండ నస్మదాదులయుసురులఁ గాపాడఁజాలిన ప్రాణదాతవీవే. అట్టి నీకృత్యము నెఱుఁగనివానిచందంబున మాపైఁ బెట్టి వేడుకఁ జూచెదవేల? నీ సామర్థ్యేక్షణ కుతూహలంబున నున్న వానరవీరులకు నేత్రోత్సవంబుఁ జేయుము లెమ్ము.

క॥ క్షోణిజఁగనివచ్చి జగ
త్ప్రాణజరఘువంశకులుల ప్రాణంబులుమా
ప్రాణంబులు సుగ్రీవుని
ప్రాణమురక్షింపునీవ ప్రాణముమాకున్॥

అని యగ్గింప నంజనానందనుం డత్యుత్సాహంబునఁ బర్వపాదోధిపగిది నుప్పొంగిఁ బాహువు లప్పళించి, తన బల పరాక్రమంబు లుగ్గడింపందలంచి, వానరవీరుల నీక్షించి "మార్తాండుం డుదయాద్రింబొడమి యపరశైలంబునకుం జనునంతలో నీదూరంబున నే వేమారులు జనఁగల. గరుడుండు భూమినుండి యాకసంబున కొక్కతూరి పఱువుకాలంబునఁ బెక్కుసారు లే నేగఁగల. జవసత్త్వంబుల నాకధికుండు లేఁడు. మీకు భయమేల ?

మ॥ అరుదారంబది వేలయోజనములుద్యచ్ఛక్తిమైదాఁటెదన్
ధరణీపుష్కర చక్రముందిరిగెదన్ దంభోళివీర్యత్వరం
గరయుగ్మంబున ఋశ్యమూకమునులంకాద్వీపముంబట్టి స
త్వరభంగింగొనివచ్చి యిచ్చటనెసీతారాములం గూర్చెదన్॥

క॥ శరనిధినున్న భుజంగము
నిరువుగఁబక్షములనడుమనిడుకొని గరుడుం
డురుగతిఁదెచ్చువిధంబున
నురువడిఁదెచ్చెదను లంకనున్న మహీజన్॥ 15

పశ్చిమపాథోధిచెంతఁ బ్రభాసంబను పుణ్యతీర్థంబునం దపంబొనరించు మహర్షులయాశ్రమంబులం జొచ్చి వారిం బాధించు శంఖ శబల నామంబులంబరగు మదద్విపము లొక్కదివసంబున భరద్వాజునాశ్రమంబుం బ్రవేశించి బాధించుతఱి, మజ్జనకుం డత్యుగ్రత నామదద్విరదంబుల నుక్కడంచిన, మోదంబునొంది, యక్కడి ఋషులు భరద్వాజప్రేరితులై కుంజ



రసూదనుండగు మజ్జనకునకుం గేసరియను నన్వర్థాభిధానం బొసంగి, యాతని యభీష్టానుసారంబుగ వానరరూపుండు నత్యధికసత్త్వుండు నగ్నితేజుండు ననిలసమవేగజయశాలి, సామ్యుండు నధికుండగు గామరూపుండు నగు పుత్త్రుం డుద్భవింప ననుగ్రహించిన వరప్రసాదంబునం గేసరికి క్షేత్రజుండనై పవనున కౌరసుండనై యంజనకుంజనియించితి. కావున వేగంబున నాకన్న మిన్నలు గలరనుట శశవిషాణసమంబు, శతయోజనవిస్తీర్ణంబగు శరనిధి నతిక్రమించి లంకంజొచ్చి సీతంజూచి మగిడి చెచ్చెఱ నరుదెంచెద"నని వాక్రుచ్చె.

## మూఁడవ ప్రకరణము.

పావని తనసహచరవర్గంబుంగూడి మహేంద్రాద్రి నధిష్ఠించి, వారియాశీర్వాదంబులం గైకొని, సూర్యచంద్రాగ్నిపవనాది వేల్పుల కంతరంగంబునఁ బ్రణమిల్లి, విజృంభించి,

### హనుమంతుఁడు సురసను నిర్జించి సముద్రము దాఁటుట.

బాహువు లప్పళించి, దక్షిణాభిముఖుండై, కుప్పించి, వియద్వీథిం జను వానరవీరు నీక్షించి పాథోధిప్రేరితుండై మైనాకుం డంబుధిఁగడచి, పావని గతి కవరోధంబు గల్పించి, దివ్యరూపంబున "మారుతాత్మజా! భానువంశప్రభాకరుఁడగు సగరునివలననైన పారావారంబు సాగరంబనుపేరం బ్రసిద్ధినొందె. ఆ సగరుని వంగడంబున వన్నెకెక్కిన దశరథాత్మజునాజ్ఞం జను నీకాశ్రయుఁడనై శరనిధిపంపున మార్గావరోధంబుఁ

గల్పించితి. నాయందించుక శ్రమవాయఁ గొంతదడవు విశ్రమించి మఱిచనుము. రామకార్య ధురంధరుఁడవైన నీకుపకృతి యొసర్పం జనుదెంచితి"నని ప్రార్థించిన మైనాకుంగని "నీ యుపకారబుద్ధి కలరితి. నీచేయుసపర్యలు నాకుఁ జేరె. కాఁగల కార్యము ముందిడుకొని తడయుట ధర్మంబు గాదు, మగుడం జనుదెంచుతఱి నీయందు విశ్రమించి నీయీప్సిత మీడేర్చెద"నని వీడ్కొనిన యాంజనేయుని పరాక్రమంబుఁ బరిశీలింపఁ బర్వతకందరంబు నాఁ జనువదనగహ్వరంబుతో రాక్షసాకృతి నమరప్రేరితయై చనుదెంచిన నాగమాతయగు సురస సమీరసూనుసమీపించి, భయంకరారావంబున "మర్కటాధమా! నన్నతిక్రమించి జన నమరులకైన నలవిగాదన్న వనచరమాత్రుఁడ వీ వెంత? అతిక్షుధాపీడితనై యాహారార్థ మిట కేతెంచిన నాకాహారముఁగమ్ము." అని బెదరించిన రక్కసి నవలోకించి 'ఓసి సెత్రీ! నారాయణాంశ సంభూతుండగు కౌసలేయుని కార్యార్థమై యతి సత్వరగతిం జనునాకే మార్గావరోధంబు సేయఁ గడంగితివా? నన్నుఁ గరుణించి విడిచితివేని, లంకఁ జేరి, మైథిలింగని మగుడ నేతెంచుతఱి నీయాఁకలిఁ దీర్చెద" ననిన సమీరిం జూచి "మర్కటకులపాంసనా! మేఘంబు నాసించి మడుఁగుఁగొమ్మం ద్రెంచు వాందమతు లేరైనంగలరే? సకల జంతుసంతానంబునకుం బ్రిదుకు సుఖకరంబును జావు దుఃఖకరంబునుగాదె? ఇత్తఱిఁ బోనిచ్చిన జావున కెడగలుగఁ జనక మగుడ నీపథవర్తినయ్యెదవే? నిన్ను నమ్ము టెట్లు? నాయాఁకలి దీరు టెట్లు? ప్రాణోపద్రవావస



రంబునఁ బరమేశ్వరుఁడయిన నసత్యంబున కోడఁడన శాఖామృగమాత్రుఁడవగు నీవన నెంత? క్షుద్బాధం బ్రుటియైనఁ దడయఁజాల. చూడుము. నిన్నుం గబళించి నాయాఁకలిఁ దీర్చుకొందు"నని దశయోజనపరిమితిగ వదనంబుఁ దెఱచె. రామదూతయు నంత దేహంబుఁ బెంచె సురస వింశతియోజనముల వెడల్పున వక్త్రంబుఁ దెఱచె. అనిలజుండు నంత కాయంబుం బెనిచె. ఉరగజనని త్రింశద్యోజనాయితముగ నోరుం దెఱచె. సమీరియు నంతకు దీసిపోని దేహంబునఁ బ్రకాశించె. ఇత్తెఱంగున నాగమాత యెంతనోరు దెఱచిన ననిలజుఁ డంత దేహంబుం బెనిచి, కడపట నంగుష్ఠమాత్రకాయుండై దాని గర్భగోళంబుం బ్రవేశించి, వెలికిం జనుదెంచి, నగుచు, దానివీక్షించి "కార్యావసరంబున మగుడంజనుదెంచెద నన్ను మానవైతివి. నీయాఁకలిదీరెనా? యని పరిహసించె. అంతం బన్నగజనని ముదంబంది నిజరూపంబున నిలిచి తన్నెఱింగించి "అసహాయంబున నేకాకివై జను నీపరాక్రమం బరయ నమరప్రేరితనై యేతెంచిన నాయందుఁ గరుణింపుము. నీకసాధ్య మెద్దియునుండదు. రామకార్యంబు నిర్విఘ్నంబుగ దీర్పంగలశూరుండవు. నీకు శుభంబయ్యెడు. పొమ్ము" అని సురస సురలోకంబున కరిగె.

* హనుమంతుఁడు లంకం బ్రవేశించుట. లంకాధిదేవతవృత్తాంతము. *

ఆంజనేయుండు నశ్రమంబున శరనిధిలంఘించి, సువేలాద్రి నారోహించి, లంకానగరంబుంగని "విశ్వకర్మ నిర్మితంబైన లంకాపట్టణ మతి శ్లాఘాపాత్రము. సప్తప్రాకారముల

నొప్పుచున్నది. ఏవీథినీక్షించినను కనకకుడ్యంబులును, రత్నవేదికలును గలిగి మౌక్తిక తోరణంబుల మెఱయుచున్నది. ఏవాడ నాలోకించిన నది యంతకంతకు మిన్నయై యొప్పుచున్నది. ఏయింటం జూచిన వేదఘోషలు వినంబడుచున్నవి. సముద్రమునకుంగల రత్నాకరనామ మీపట్టణంబున కిడిన సార్థకమగు. ఏసౌధము నవలోకించిన నది వియత్పథమున కేగుచున్నట్లు చూపట్టుచున్నది సౌధోపరితలంబున మెఱయు రత్నదీపములం గని వియద్గంగాభ్రాంతిచే దుమికి మొగంబులమోదుకొనిన వారిజాసనువారువంబు లెంత తల్లడిల్లుచున్నవి! వానిం జూచియైన నూరకుండక, సహజచాపల్యంబున మరకతశుకంబుల నొడిసిన మార్జాలంబులు దంతభగ్నంబులై యేగతిం దల్లడిల్లుచున్నవి! ద్వారంబులం బాలకుల చందంబునం జిత్రించిన పంచాస్యంబుల భీకరాకృతినవలోకించి పచ్చికబయళ్లం దనిసి పురప్రవేశంబుం జేయు పశుగణంబు వాలంబులెత్తి, యదరి బెదరి మార్గంబున గ్రీడించు దారకులంబడం ద్రోయుచు నెట్లు పఱుగులిడుచున్నవి. కాంచనమయంబగు నిప్పురవరంబు మేరుపర్వత శకల నిర్మితంబై యుండనోపు. అంతియ కాక బాహ్యోద్యానవనంబులం గిలకిలారావంబులొనరించు ఖగములకూజితము లెంత శ్రావ్యత నొసంగుచున్నవి! ఎన్ని క్రీడాచలములు! ఎన్ని సరోవరములు! ఇట్టి పట్టణంబు లోకభయదుండగు రావణుండు పాలించు. ఎచ్చోటం జూచిన లెక్కకు మిక్కిలి యగు రక్కసులాయుధపాణులై యహర్నిశము లెడ తెగక యనిమిషులై నిలిచి కాచుచుండిరి.



ఇత్తెఱంగున నమరాదిసురక్షితంబు దురాసదంబునైన యిప్పురవరంబుం జొర నమరులకైన నసాధ్యంబై యుండ నరవానరు లెంతవారలు? ఇట్టి లంకం జొచ్చి జానకినన్వేషించుతఱి దానవావరోధుండనై రాజాస్థానంబున కనుపంబడిన నాయుద్యమంబున కంతరాయంబు గలుగుంగదా. ఏమి! ఇట్లు తలంచుచుంటిని! ఇదియన నెంత? త్రుటిమాత్రంబున దీని నంబుధి ముంపంజాలనా? రామదూతనగు నాకు రావణులును గీవణులు నసాధ్యులా? అయిన నిట్టిమహోగ్రాకారంబున లంకం జొరజెల్లదు, అంతియగాక పగటివేళ నిప్పట్టణంబుం జొరరాదు." అని డెందంబునందలపోయు మారుతాత్మజుని కోరికనీడేర్పం దలపెట్టెనో యన వాడిమయూఖుండు వరుణదిశాద్రిం గ్రుంకె. పక్షుల కలకలము లెక్కుడయ్యె. గాఢాంధకారంబు గ్రమ్మె. ఆకసంబునం జుక్కలు లెక్కకు మిక్కిలియయ్యె.

పవమాననందనుండు తనదేహంబు సంకుచితంబుం జేసి, యణుమాత్రగాత్రుండై, సువేలాద్రిం గడచి, లంకోత్తరద్వారంబు కడకరిగి లోం జొరం బ్రయత్నించుసమయంబున లంకాధిదేవతయగు లంకయను నొక్కరక్కసి మారుతిం జూచి "మర్కటాధమా! నీ వెవ్వండవు? ఇచ్చటికేతెంచుటకుం గతమెయ్యది? నిజంబెఱింగించిన మీందట నిన్నుం బొరిగొందు" అనిన నిశాటిం జూచి హనుమంతుండు సామంబున "రక్కసీ! నీ వెవ్వతెవు? ఇచ్చటనుండం గారణమేమి? నన్నేటికి వెఱపింప నుంకించెదవు?" అని యడిగెను. అంతనారక్కసి "నేను రావణునానతి నిందుండి లంకం జేరు తస్కరులం బొరిగొన

నున్న లంక యనునాతిని. ఇఁక నీయుదంతం బెఱిఁగింపుము." అనిన, లంకం గని

"క॥ ఈపురిఁగల గృహతోరణ
గోపుర ఘనసాల సౌధ కూట ప్రాసా
దాపణవనోపవనజన
వాపీ కూపములుఁ జూడవచ్చితి వేడ్కన్"॥ 16

అను పవనతనయు నుపలక్షించి "మర్కటాధమా! నాకారింబడి యెంతేఁగఁగలవు?" అని, భయంకరహుంకృతిఁ జేసి పావనివక్షంబుం బిడికిటఁ బొడువం గమకింప నాతఁ డయ్యువతిహస్తంబు నొడిసిపట్టి, నిజముష్టి నా నాతియురంబు మోద, హాహారవంబున నేలం గూలి, వదనగహ్వరంబుం దెఱచి "కపివరేణ్యా! శరణు శరణు. రక్షింపుము. నన్ను మున్ను వనజాసనుండీ నగరాధిదేవతగా నియమించుతఱి నాతనిచే నే మున్నాలించిన వృత్తాంత మొక్కటి నివేదింతు. వినుము. నీ వీ లంకం బహుకాలంబు గాపాడుచుండఁ గొండొక నాఁడు జనకతనయాన్వేషణార్థియై యేతెంచిన వనచరునిచే నెన్నఁడు నిర్జింపఁబడుదువో, అప్పటినుండియు లంకావినాశన ముద్యమించి గ్రమక్రమంబునఁ గొలఁదికాలంబునఁ బుత్రమిత్రాదులతో రావణుండు నశించు, నని చతురాననుండు నా కెఱింగించె. నీ వమితబలుఁడవు. ఏరికయిన నసాధ్యుఁడవు. నీకు శుభంబగు. పొమ్ము." అనిన నిశాటి నతిక్రమించి లంకం జొచ్చి పెందెరల నేగుసమయంబున, జనకతనయాన్వేషణార్థియై జనుచున్న మారుతాత్మజున కక్షిగోచరమున కవరో



ధంబుఁ గలిగించుచున్న మహాతిమిరంబు నడఁపఁ బృందారకు లెత్తిన దివ్వెయై వడి నాకసంబున రే వెలుంగు దోఁచె.

—* హనుమంతుఁడు లంకలో సీతను వెదకుట. *—

ఆంజనేయుండు కాంచనరత్నశోభితములైన సింహాసనార్ధాసన రత్నవేదికాలంకృతంబై మంత్రి సామంత సేనానాయక పరివేష్టితంబై వెలయు రావణునాస్థానంబున కరిగి యచ్చట నవనిజ నరసి, మఱియు నాపణంబులు, మంటపంబులు, హస్త్యశ్వరథశాలలు, రచ్చకొట్టములు, కోటలు, గోపురములు, మేడలు, వేశ్మపంక్తులు, కేళీగృహంబులు, ప్రాసాదంబులు, యక్ష కిన్నర గంధర్వాది బృందారకాంగనల కారాగారంబులు, విభీషణ కుంభకర్ణ మేఘనాదాదులయొక్కయు, అతికాయ మహాకాయ కుంభ నికుంభ సర్పరోమ వృశ్చికరోమ ప్రభృతులయొక్కయు, కాలనేమి ప్రహస్త కంప నాకంపన మకరాక్షాదులయొక్కయు, తక్కుంగల యాతుధానులయొక్కయు గృహంబులు, లీలోద్యానంబులు, క్రీడాచలంబులుఁ గలయం బరికించి మహీనందనం గానక చనిచని, ముందట మహాహేమధామంబుం బొడగని యందు దిగంబరులై యొండొరులం గౌఁగిలించుకొని యొడలు మఱచి నిద్రించుచున్న యతివల మర్మావయవము లవలోకించి "బ్రహ్మచారినై యుండియు నన్యకాంతల గాత్రమర్మంబులఁ గనుఁగొంటి. దానం జేసి ధర్మవిహీనుండ నైతి. నాకిఁక పుణ్యలోకావాస మెట్లు చేకూరు?" అని చింతాక్రాంతహృదయుండు నిమీలితనేత్రయుగ్ముండు నయి, మానసంబున మనుకులశశాంకునకుం బ్రణ

విల్లితజ్ఞుఁడై "తరుణులఁ దరుణులలోఁగాక మృగములలో వెదకుదురా? కారణాంతరముచేత నీరి సర్వావయవము లంబకగోచరము లయ్యెం గాని మదనవికారయుక్తుండనై యాలోకించితినా? అంతియకాక పుణ్యశ్లోకుండగు రాముకార్యార్థమే తెంచిన నాకు నన్నియు శుభంబగుం గాని దోసఁ గొఱ్ఱటియుం బొసఁగునా?" అని ధైర్యావలంబుండై చని విశ్వకర్మనిర్మితంబు జతురాననదత్తంబు నగు కుబేరపుష్పకమవలోకించి "దీనిని దశకంధరుండు యక్షేశుండగు ధననాథునోడించి కొనితెచ్చె"నని యందునిద్రించు వేవు రంగనలం గని యందు జానకింగానక, ముందఱఁ జని యందందు జనకజ నన్వేషించి యవరోధరహితంబుగ రావణావరోధంబుఁ జొచ్చి యందు మణిమయకాంచనపర్యంకంబున దుకూలాంబరశోభితుండై సుఖసుప్తిం జెందు రావణుసన్నిధిని మేచకాభ్రంబునఁ దటిల్లతకైవడి సకలభూషణాంబర విరాజితయగు మందోదరి నీక్షించి కౌసలేయుని యర్ధాంగిగా భ్రమించి, సంతసించి, మగుడం దెలివొంది, త్రిలోకసుందరియుఁ బతివ్రతామతల్లియు నగు జనకరాజనందన పతివిరహవేదనాపరవశయు ధూళిధూసరితాంబరయు నై సర్వసుఖంబుల రోసి యుండుం గాని, సర్వభూషణాలంకృతగాత్రయై మధుపానంబున మత్తిల్లి కాపురుషపర్యంకంబున సుఖసుప్తిం జెందునా? కావున నిది జానకి కాఁజాలదు. రావణు కాంతయై యుండనోపు. ఎంత మందమతినైతి? త్రిలోకవంద్యయగు ధారుణీనందన యందత్యంత జ్ఞానశూన్యుఁడనై యెట్టినింద నారోపించితి" నని



చింతించుచు నచ్చోటు వాసి, మద్యమాంసాది లేహ్యపదార్థంబులఁ బరిపూర్ణంబయిన పానశాలకరిగి, యందును మహీనందన యుండు జాడంగానక, యత్యంత చింతాకులాంతరంగుఁడై యొక్కెడ నిశ్చేష్టితుండై నిలిచి, యంతరంగంబున భూపుత్రిం దలఁచి, రథ తురగ మాతంగ శాలలందును, అంతఃపురములందును, రచ్చకొట్టములందును, వీథులందును, కొలఁకులందును, నర్తనశాలలందును, ఉపవనంబులందును, సుర గరుడోరగాది కాంతల కారాగారంబులందును, పానశాలలందును, మఱియుం దక్కుంగల యెల్లెడలను, ధారుణీకాంతు నాతి నన్వేషించి వేసరితిని. ఎచ్చోటను గోచరింపదయ్యె.

—* హనుమంతుఁడు సీతంగానక దుఃఖించుట. *—

మ॥ సతినాకెక్కడఁ గానరాదలిగి రక్షస్త్రీలు భక్షించిరో
పతిభావించుచుఁ బ్రాణముల్విడిచెనో పౌలస్త్యుచేఁ దప్పియు
ద్ధతినంభోనిధిఁ గూలెనో దశముఖోద్యద్బాహుసంపీడనా
న్వితయై స్రుగ్గెనొ పంక్తికంఠుఁడెడ గావేరొండుచో డాఁచెనో॥

క॥ వనధిఁగని హృదయ మవిసెనొ
తనుఁగైకొనకున్నఁగనలి దశకంఠుఁడు ద్రిం
గెనొ వికృతఘోరరాక్షస
జన ఘనరూపములు సూచి సమసెనొ భీతిన్॥ 18

సీతంగానక రామచంద్రుమ్రోల కరిగితినేని యాక్షణంబ నాతం డుజ్ఝితజీవుండగు. ఆతనికై వాపోయి సౌమిత్రియు, వీరల మరణవార్త నాలించి సౌభ్రాత్రనిధులగు భరతశత్రుఘ్నులును ప్రాణంబులు వాయుదురు. పుత్రశోకంబు భరింపఁ

జాలక కౌసల్యాది మాతలు మరణించెదరు. ఇత్తెఱంగున నిన
వంశమెల్ల నశియించు. ఈ ఘోరము నవలోకించి కృతజ్ఞతాకా
ర్యనిర్వహణాభావుండై సుగ్రీవుండు చచ్చు. పతి మరణవేద
నావృతయై యాతనితరుణియు నశించు. తమకొడయండు
లేమింజేసి తరుచరానీకంబు తపననందనాలయంబుఁ జేరుదురు.
ఇందఱ నాశనంబున కాకరంబునైన నే నచ్చటి కేగనేల? వాన
ప్రస్థుండనయ్యెద. లేదేని కడలింగలిసెద. కాయంబు ఖగకు
లంబున కాహారంబుగ నొసఁగెద. నా బ్రతుకేల? నారాకం బ్ర
తీక్షించు జాంబవదాదుల దరికేగతెఁజనఁగలను? పోయి జానకి
లేదని చెప్పుదునా? అని చింతించి మగుడ ధైర్యం బవలంబించి,
తన్నుద్దేశించి, సీతం గనివచ్చెదనని రామాంగుళీయకముం గొని
పంతంబులు పలికిన పవమాననందనుండు పరిహాసపాత్రుండ
గునా? పర్వతారణ్యయుక్తంబుగఁ బుడమిం బెకలించి పృథివీ
కాంతు నెదుటఁ బెట్టుదు. సత్యలోకంబున కేగి సరస్వతీకాం
తుం బట్టి బంధించి సీతం గాన్పింపుమని వెంటనంటి సాధించెద.
లోకవిద్రావణుండగు పంక్తికంధరు పెడ ఱెక్కలు విఱిచి కట్టి
పుడమినందన నెందుంచితివని పాథోధిం బొఱలించెద.

ఇంత వేగపడనేల? అదె ముందొక యారామం బక్షి
గోచర మగుచున్నయది. సీతాన్వేషణంబున కదియొక్కటియ
యవశిష్టము. జానకి యందుండనోపు, అచ్చటి కేగెద. నని
యత్యుత్సాహంబునఁ ద్రిమూర్తులను, దిక్పాలురను మహర్షు
లను, శశిదివాకరులను, గణపతిని, దాశరథులను, త్రిలోకపా
వనియగు సీతను మనంబున ధ్యానించి, వందనములర్పించి యు



ద్యానవనాభిముఖుండై చనుచుండ, వాయువు తనగంధవ
హ నామము సార్థకపరచుచు పుత్రవాత్సల్యంబున నతిశీఘ్రమ
నార్ప నిటు రమ్మనెనో యనుచందంబున పిల్లతెమ్మెర లల్లన
నాంజనేయున కభిముఖములయ్యె.

### ఆంజనేయుఁ డశోకవనంబున కేగుట.

ముందు చన పనస కపిత్థ కదళ్యామ్రాతక ఖర్జూర
నారికేర రసాల మాతులుంగ భల్లాతాద్యనేక ఫలవృక్షశోభి
తంబును, మల్లికా మతల్లికా మాఖ్య పున్నాగ చంపక కేతకీ
జాతీ ప్రముఖ కుసుమలతా భూరుహ బృంద విరాజితంబును,
నింబాశ్వత్థ గోరంటాశోక సాల సింధువారాది వృక్షేతర
తరురాజమండనంబును, వల్లులచే నల్లిబిల్లిగ నల్లుకొని సొంపారు
నికుంజపుంజములచే నలంకృతంబును, బకక్రౌంచాద్యనేక జల
పక్షివిరాజితంబై పద్మకైరవశోభితంబై యొప్పు సరోవరసము
దాయంబును, కలకంఠ శుక శారికా పారావత కేకి కలహం
సాద్యనేక పక్షిసంతానావృతంబును, గదా ఖడ్గ పరశు
తోమర ముద్గర భిండివాల పరిఘ పట్టిస ముసలాద్యనేకాయు
ధధరులగు వనపాలకులచే సురక్షితంబును అగు అశోకవనం
బుం బ్రవేశించి, చనుచుండ, శిరంబులపైని కట్టిన మేలుకట్ల
చందంబున నడ్డముగా వ్యాపించిన భూరుహశాఖలం దొలఁగఁ
ద్రోసికొనుచు, మైథిలీశోక నివారణకారకుం డితండను నానం
దంబున నాదితేయులు గుఱిపించినమాడ్కి- మందమారుతంబు
నం దనపైరాలు కుసుమముల సువాసన నాఘ్రాణించుచు,
"ఇదె సీతం జూపెద మిటురం"డని నమ్రతఁ జూపుపగిది ఫలభా

రవినమ్రములగు తరుశాఖల వీక్షించుచు దరుమూలంబులం గుడుంగంబులం గోలంకులం దరిం ధరణీనందన నన్వేషించుచుం జనుచుండ నత్తఱి "ఇదెచూడు మిచ్చోటమహీనందనం బొడగాంచెదవు. ఇటు రమ్ము" అను క్రియను బోధించునట్లు తూర్పున వేగుంజుక్క పొడచె. "ప్రాగ్దిశాతరుణి కట్టిన పట్టుపుట్టంబు భాతి" దూర్పు మేఘంబు లరుణంబులయ్యె. "ఎవరికృత్యంబుల వారలత్యంత జాగరూకులగుట కదనయ్యె" నని ప్రబోధించు క్రియం గుక్కుటకోలాహలము లతిశయించె. "మనమిచ్చో నాలసింపం జనదు. ఆహారార్థ మెటకైన నేగుదము లెండు" అని పిలిచినరీతిం బక్షుల కలకలము లధికమయ్యె. తన ప్రియశిష్యుం డగు మారుతాత్మజున కుపకారియై మహీనందనం గానుపింపం జేయుటకో యన భాస్కరుండు ప్రాగ్దిశ నలంకరించె.

### ఆంజనేయుం డశోకవనంబున సీతం జూచుట.

పవమాననందనుండు ప్రాగ్దిశాభిముఖుండై చని యొక్కెడం గల కాంచన శింశుపావృక్షంబు నారోహించి నలుదెసలం బరికించి రెండవ గంధమాదనంబు పగిది రత్న స్వర్ణ సౌధ ప్రాకార సోపాన వేదికా భాసురంబగు చైత్యప్రాసాదంబుం బొడంగని, దాని యందంబున కరుదందుచు, నందొక తరురాజంబునీడ, బాలచంద్ర రేఖచందంబునను వానలేనివల్లికపగిదిని శుష్కీభూతంబగు శరీరంబుం గలిగి, నిందాగ్రస్తయగు యశోరాశిచందంబునను ధూమావృతయగు వైశ్వానరశిఖకరణిని జీమూతావృతయగు చంద్రికవలెను కర్దమమిశ్రితంబగు గంగ పోలికను మలినాంగియై, చెక్కిటం జేయమర్చి కన్నీరు మున్నీరుగతిం బ్రవహింపం బలవించుచు, శశిరహిత నిశాచందంబునను జక్రవాకవిహీనయగు చక్రవాకిగతిం దినకరహీనయగు దినలక్ష్మిం బోలి యేకాకినియై యాసీనయై యున్న మహీనందనం గని, పరమానందభరితహృదయుండై, "యీసాధ్వియ జనకనందన గానోపు" నని తలంచి తన యంతరంగంబున నిట్లని వితర్కించె.



సీతామహాదేవియంగంబున నే యే యాభరణంబులున్నవని రామచంద్రుండు నుడివెనో యవియే యీయమయందున్నయవి. ఆ నాడు గగనగతి నరుగుచు భూషణంబులముడిచి మతంగాద్రిం జాఱవిడిచిన చేలంబు నీయమ ధరియించియున్న యంబరంబు నొక్కటియ. అంతియ కాక నాడు మాయొద్దం బడవేసిన యంగదంబులు నీతరుణి ధరించియున్న తొడవులు నేకమై చూపట్టుచున్నవి. రామచంద్రుండు నాకెఱింగించిన యవయవసౌష్టవం బీమె యందెంతయు నొప్పియున్నయది. ఈ కాంత రామభూకాంతుని కాంత కాదేని రాముని దలంచి యేల వాపోవుచుండును? కావున నీయమయే సీత. సందియంబున కాస్పదంబు గాన్పింపదు.

క॥ ఆ రామునకీ సతి దగు
నీ రామకు నానరేంద్రుం డెనగాం దగునీ
చారిత్రం బీసుగుణం
బీరూపము నీసతీత్వ మెంతయు నొప్పున్॥ 19

క॥ ఈ రామమనం బెప్పుడు
నా రాముని యందయుండు నా రాము మనం

శ్రీరామ యందయుండును
ఘోరవ్యసనము లిరువురకుసమానంబుల్॥ 20

రాముండు హరధనుర్భంగముం జేయుటయు, విరాధుని వధించుటయు, ఖరదూషణాదులఖండించుటయు, మారీచుం బరిమార్చుటయు, మర్కటులతో మైత్రి నెఱపి వాలిం దునిమి వనచరరాజ్యాధిపత్య మర్కనందనున కొసంగుటయుఁ, దరుచరవీరులంబురిగొల్పి నానాముఖంబులకనుచుటయు, నీ సాధ్వీమతల్లి నిమిత్తమేకదా. కనకసౌధాంతరాళంబులం బరిచారికాబృంద పరివేష్టితయై సౌఖ్యాంబుధినోలలాడుచుండుటకు మిన్నయను నాసం దననాయకుంగూడి వల్కలాజినధారిణియై సాంద్రారణ్యంబులకేతెంచిన యీపతివ్రతాతిలకమున కీవేదనఁ గలిగించిన ప్రజాపతి యెంతయు నిందార్హుఁడు.

“పట్టపగలగుటం జేసి యీమెకు నన్నెఱింగించి భాషించుట కిది యదనుకాదు. రాత్రియగువరకు నీభూరుహశాఖలం దాఁగియుండెద” నని యాతరుశాఖలం బర్ణాంతరంబుల నణుమాత్రగాత్రుండై యన్యులకగోచరుండై యుండె. అంతం గ్రమంబునఁ దపనుఁ డస్త్రాద్రినలంకరించె. ధరణిజాంజనేయుల సల్లాపంబున కంతరాయమునొందింపఁజాలక తమకలకలంబుఁ బాసెనో యను రీతిం బక్షులు తమకులాయంబులం జేరి సుషుప్తిం జెందె. తిమిరంబతిశయించె. తారలు తారాపథంబునమించె. పావని పుడమినందనం జేరి భాషించుతఱి నెంశౌరులరూపంబులు నారు చక్కఁగా గుర్తించుట కనువగుట



కో యనుచందంబున చంద్రుం డుదయించి తనచంద్రికనెల్లెడలం బాఱఁజల్లె.

అయ్యవసరంబున దశవదనుం డవనిజం దలఁచి, జలకం బాడి, సమస్తభూషణాంబరధరశరీరుండై, పరిచారికానివహపరివేష్టితుండై, యశోకవనమధ్యంబున రాఘవుందలఁచి వాపోవు రామమహీకాంతుకాంతం దఱిఁజేరి, తన్నుంబరిగ్రహించి లంకారాణివగుమని సవినయంబుగఁ బలుదెఱఁగులఁ బ్రార్థించె. జానకియు నత్యంతనిందార్హవాక్యంబుల నప్పౌలస్త్యుం దూరె. పంక్తికంధరుండు పటురోషంబున నప్పరమపతివ్రతం బెదరించి, మాసద్వయావధి నొసంగి, యీగడువులోనఁ దన్ను వరింప నాశింపదేని భక్షింపుఁడని కావలియున్న దైతేయాంగనల కనుమతి నొసంగి చని తననగరుం జేరనరిగె. కావలియున్న దైతేయాంగనలలోఁ గొందఱిండ్లకేగిరి, కొందఱు నిద్రించిరి. ప్రాణేశుం దలంచి పలవించులోకపావని దఱిం జేరి, త్రిజట రావణనాశకరంబును రాఘవామోదకరంబును, సీతామనోవేదనాపరిహారకరంబును నగు తన స్వప్నవృత్తాంతమును నివేదించి జానకి నూరార్చి నిద్రించె.

### ~ హనుమంతుఁడు సీతతో భాషించుట. ~

సమీరనందనుండు సర్వంబునవలోకించి, సీతనుసమీపించుట కిదియ సరియగు సమయమని, వృక్షావతరణంబొనర్చి మ్రొక్కులిడుచు, భయ భక్తి వినయంబులం గనబఱచుచుఁ దఱిఁజేర నోడి కొంతదవ్వున నిలిచి కరపద్మంబులుమూర్ధంబునం జేర్చి సీతంగనుంగొని.

మ॥ "హరకోదండవిఖండనుండు జనకక్ష్మాధీశుజామాతభా
స్కరవంశాగ్రణి జానకీప్రియుఁడు విశ్వామిత్రయాగాహితా
సురసంహారి విరాధకాలుఁడు ఖరానుధ్వంసి మారీచసం
హరుఁ డన్యప్రమదాపరాఙ్ముఖుఁ డయోధ్యానాయకుం డా
దటన్" ॥21

అని పలికిన వాక్యంబు లాలించి, జానకి విభ్రమవిలోచనంబుల నగచరవరు నాలోకించుచు ఱిచ్చవడియున్న భూనందనం గని, నిజవృత్తాంతంబు సవిశేషంబుగా నెఱింగింపఁదలంచి "అమ్మా! సరయూపరిసరంబున సకలైశ్వర్యసంపన్నంబయిన సాకేతపురి రాజధానిగాఁ గోసలదేశం బేలు దశరథధరణీకాంతున కగ్రతనయుండగు రామచంద్రుండు హరకోదండఖండనం బొనరించి, పుడమిజం బరిణయంబై, పరశురాము నోడించి, యయోధ్యం జేరి, కైకవరంబునఁ బితృవాక్యపరిపాలనార్థ మవనీనందనానుజులం గూడి ఘోరారణ్యంబులం గ్రుమ్మరుచుఁ బంచవటిం బ్రవేశించి యచ్చట నివసించుచు, మాయాకురంగంబుం బట్టం జని, రావణుచేత నాలిం గోల్పడి, లక్ష్మణసహితుండై, గిరి గహన దుర్గమాదులం బరిశోధించుచు, జటాయువు వలనం గొంతవృత్తాంతం బెఱింగి, ఋశ్యమూకంబున కేతెంచి, సుగ్రీవునితో సఖ్యం బాచరించి, వాలిం దునిమి, సుగ్రీవునిఁ గిష్కింధాపతిం జేసి, యనేకవానరవీరుల నవనిజాన్వేషణంబున కఖిలదిశలకుం బనుప, నేను సంపాతివచనంబున శరనిధి నవలీలం గడచి, లంక నిశ్శంకం జొచ్చి, పురంబెల్లఁ గలయ నన్వేషించి, నాభాగ్యవశంబున నిచ్చట



మిమ్ముం బొడగని, కృతార్థుండనైతి." నని నయంబార సవినయంబుగా మఱల నిట్లనియె

తల్లీ! నీవు మలినాంబరధారిణివై కన్నీరు కాల్వలై పాఱఁ బరితపించెద వేల? నీవమరకాంతవా? యక్షయువతివా? కిన్నరతరుణివా? విద్యాధరప్రమదవా? నాగాంగనవా? అదియునుంగాక రేవెలుంగు నెడఁ బాసి మహీతలంబున కవతరించిన రోహిణివా? వశిష్ఠుం బాసిన యరుంధతివా? పరమేశ్వరుఁ డెడఁగలుగఁ జనుదెంచిన పార్వతివా? నీ సౌభాగ్య చిహ్నంబులాలోకించిన నుత్తమక్షత్రియాంగనాకారము లగపడుచున్నయవి. వంచనచే దశవదనుం డపహరించిన రామచంద్రుని దేవేరి వగు జానకివా? తెలుపుము." అని యడిగెను.

సీత "వనచరవరేణ్యా! నేను, విదేహదేశాధీశుండై జనులను జనకునిపగిదిం జూచు జనకుని తనయను. దశరథుని కోడలను. రామచంద్రుని భార్యను. సీతయని పిలువఁబడు దానను." అని యెఱింగించియు నంతరంగంబున "రావణుండు మాయావనచరుండై నన్ను మోసగించుట కేతెంచి యిక్కరణిం బలుకుచుండెనో" యను సంశయంబున మారుతాత్మజు నవలోకించి "కపికులోత్తమా! నీవు రాఘవామోదకరణదీక్షాపరుండవై రామకార్యార్థమేతెంచుట దబ్బరగాదేని,

"ఉ॥ ఎట్టిఁడు నా నిజేశుఁడు శుభేక్షణ మెట్టిది సద్గుణోత్కరం
బెట్టిది రూపురేఖలవి యెట్టివి యంగవిశేష సౌష్ఠవం
బెట్టిది వర్ణలక్షణము లెట్టివి లక్ష్మణుఁ డెట్టివాఁడు నా
కిట్టని పోలఁ జెప్పినఁ గపీశ్వర యుండెద నమ్మి నెమ్మదిన్ ॥"22

అనిన విని యాయమ సందేహనివృత్తికై పావని జానకి వీక్షించి సవినయంబున

"ఉ॥ రవిరోచిష్ణుఁడు భూసహిష్ణుఁడు రణప్రస్ఫారనానాజయో
త్సవవర్థిష్ణుఁడు సచ్చరిత్రుఁడు నురక్షాకేళివిష్ణుండు నా
హవవీరాది నిరాకరిష్ణుఁడును సత్యాలంకరిష్ణుండు ప్రా
భవలక్ష్మీప్రభవిష్ణుఁడున్గుణగణభ్రాజిష్ణుఁడున్ జిష్ణుఁడున్॥"

అనివిన్నవించి, సుమిత్రానందనుండు సువర్ణగాత్రుండను భేదమొక్కటిదక్కఁ దక్కిన యన్నిలక్షణంబులం దన యగ్రజునకుఁ దుల్యుండు. తల్లీ! నీవు రావణాపహృతవై యంబరవీథింజను నవసరంబున భవదంబరాగ్రంబున ముడిచి జారవిడిచిన యాభరణంబులను రవితనూజుండు రామచంద్రునకొసంగ, చింతాపరవశత్వంబున మూర్ఛిల్లి, కొంతతడవునకుం దెప్పిరిలి, బహుభంగులం బలవింపఁ భానునందనాదులచే నోదార్పఁబడెను. అమ్మా! రామచంద్రుండు సీవియోగదుఃఖంబున నాహారాభిరుచి నెఱుంగఁడయ్యె. తేనె నైనం గ్రోలుటమానె. నిద్రించినట్లు నేనెన్నఁడును జూడలేదు. ఒకానొకతఱి నిమీలితనేత్రయుగ్మండైనను "హాసీతా" యని కలవరించుచుఁ దెప్పిరిలి వాపోవుచుండును. 'సీతా' యను నారావంబునకు విరామమొకప్పుడైన గోచరంబుకాదు. నాకంటె నత్యంతపరాక్రమశీలురగు శాఖామృగశేఖరు లచ్చోట లెక్కకు మిక్కిలియై కౌసలేయునాజ్ఞ శిరసావహించుచున్నవారు. నేనేగి నీకుశలవార్త విన్నవించిన యాక్షణం బఖిలవానరులంగూడి పయనంబై యేతెంచి, లంకంజుట్టుముట్టి, ససై



న్యంబుగ దశవదనుం దెగటార్చి నిన్నుం గొనిచన సన్నద్ధుండై యున్నవాఁడు. వారిధి కావలిదరి నంగదాది మదీయ సహచర వానర వీరాగ్రేసరులు వానరానీకంబుతో నా రాకం బ్రతీక్షించుచున్నవారు. నే నిటఁదడయఁ దగదు. నే నంజనీతనయుండ. వాయుపుత్రుండ. సుగ్రీవు సచివుండ. రామచంద్రుని నిక్కపుదూతను. నామాట నమ్ముము. నమ్ముము. ఇదిగో రామమూర్తి నీకానవాలిచ్చిన భద్రముద్రిక. అవధరింపుము? అని చేతికిచ్చిన సీత దాని నత్యంతామోదంబునఁ గైకొని, కన్నుల నద్ది, ముద్దిడుకొని నేత్రయుగ్మంబున నానందాశ్రువు లేతేర నంగుళీయకము నవలోకించి,

"క॥ వరపతికి నాకుఁ బరిణయ
మిరవారఁగ నాఁడు చేసి తిప్పుడు దేశాం
తరమున జిక్కిన నన్నును
పరినింగూర్పంగ నీవవచ్చితి కరుణన్॥" 24

క॥ భాతిగనిడఁ గ్రైవేయక
మైత్రో చెదునాకు నాదు ప్రాణేశునకున్
జేతం బెట్టఁగఁ గంకణ
మైత్రో కేయూరమైత్రో యక్కట జెపుమా॥" 25

కీశపుంగవా! నీవత్యంతజవశాలివి. రామచంద్రుని కుశలవార్తాకథనముచే నాకు శ్రోత్రపర్వంబు గావించితివి. ఘోరాసురులచే నాపడుబన్నంబులు కొంతవట్టు నీవుంజూచితివిగదా. నా కీబన్నంబుల కవధి యెప్పటికి? రాఘవుఁడె

ప్పుడు వచ్చును? రావణు నేనాఁడు దెగటార్చును? న న్నెన్నఁడు గొనిచను? నారామమూర్తి ముఖాంబుజేక్షణా కౌతూహలము నాకెన్నఁడు లభించును?" అనిన పావని జానకిం గని "అమ్మా! త్వరపడనేల? నీ కుశలవార్త రామచంద్రున కెప్పుడువిన్నవింతునో యాక్షణంబ నీనాథుండు మహావానర సైన్యసమేతుండయి చనుదెంచి, లంకంజుట్టుముట్టి, పుత్రమిత్రాదులతో రావణుంబరిమార్చి, నిన్నుంగొనిచను. కష్టంబులు గట్టెక్కఁ బోవుచున్నవి. సౌఖ్యంబులు సామీప్యంబులగుచున్నవి. ఓతల్లీ! నీ వందాఁక నోర్చియుండఁ జాలవేని

"క॥ నీవెక్కుఁ రమ్ము లంకా
* ద్వీపంబవలీలఁగడచి దేవి నిను నే
నేపునఁగొనిపోనోపుదు
నీపతికడకబ్ధిదాఁటి నిమిషములోనన్॥

అనిన నప్పరమపావని యమితాశ్చర్యంబునం బావనిం దిలకించి "అయ్యా! నిన్నుం జూడ బహుసూక్ష్మగాత్రుఁడవుగాఁ గనఁబడుచున్నాఁడవు. ఇంతటిపని కేగతినోపఁగలవు?" అనినం దదుచరవీరుం డత్యుత్సాహంబునఁ, దొల్లి వామనుఁడు విజృంభించినరీతిం దన యాకారంబును జలనిధులు జానుజంఘంబులుగనుఁ, గులగిరులు గుజ్జుపొదవ్రలుగను, తారలు తలపువ్వులుగను బొడసూపం బెనిచి, మైథిలిం గని "అమ్మా! నాకై చూడుము. బెదరకుము. లంకాద్వీపమంతయుఁ బెకలించి, సురాసురుల కజేయుండనై, నిమిషమాత్రంబున రామ

* ద్వీపముతోఁగూడనైన అని పాఠాంతరము.



భూకాంతు ప్రమోలంబెట్టెదను." అని పలికెను. జనకనందన యరుదంది యాతని నీక్షింపఁ జడిసి నీ వెంతకైనం దగినసమర్థుండవే. ఈభీమాకృతి నుపసంహరింపుము. మాంధాత్రాది మహావీరు లవతరించిన భాస్కరాన్వయ సంజాతుండగు రామచంద్రునికళత్రి మన్యులచేఁ జెఱవిముక్తినొందుట యాతనికొక కళంకముకాదా? కావున వేవేగ నీవేగి సైన్యయుక్తంబుగ రామ లక్ష్మణ సుగ్రీవులందోడి తెమ్ము. ఎట్లయిన రెండునెలలగువరకు ప్రాణంబులఁ బిగబట్టియుంచెద"నను ధరణీనందన కెఱఁగి పవనజుండు "అమ్మా! నాకేదైన నానవాలిమ్ము" అని ప్రార్థించె. అంత మహీనందన తొల్లి యరణ్యంబున జరిగిన కాకాసురవృత్తాంతం బాద్యంతము నాంజనేయునకెఱుకపరచి, తనయుత్తరీయపుఁ జెఱఁగున గట్టియున్న చూడామణి నొసంగి యాతని కనుమతి నొసంగెను.

## నాల్గవ ప్రకరణము.

హనుమంతుఁ డశోకవనము నాశనముచేయుట, రాక్షసుల జంపుట, ఇంద్రజిత్తుచే పట్టుబడుట.

పవననందనుండు జనకనందన కెడగలుగఁ జని తనమనంబున "దూతయగువాఁడు స్వామికార్యంబు సఫలంబు నొందింపఁజాలనిచో దూబ యని యనఁజను. సఫలమునొందించెనేని మధ్యముండగు. అంతం దనివిసనక నధికంబగు కార్యంబునొనరించెనేని యట్టి వాఁ డుత్తముండునాఁబరగు. నేను రామసుగ్రీవుల యాజ్ఞం బరిపూర్ణంబుగ నెరవేర్చి సఫలీకృత

మనోరథుండనైతి. ఇంతటితోఁ దనివొందితినేని యుత్తమదూత
నెట్లగుదు? కావున నూఱక మఱలి చనుటకంటెఁ గొంతయై
నం బౌరుషంబుఁగనఁబఱచి చనుటమేలు" అని తలఁచి విజృం
భించి, వనంబునకెగఁబడి, ఫలములురాలిచి, కొమ్మలువిఱిచి,
మూలంబులు పెఱికి, పొదరిండ్లంద్రెంచి, పూఁదోటలనూడ్చి,
కొలఁకులఁగలంచి, దిక్కులు మాఱ్మ్రోయ సింహనాదంబులు
సేయుచు దారుణవిహారంబుసలిపి, తన్ను మార్కొనిన వన
పాలకులం జంపి, తోరణస్తంభం బధిరోహించి యుండెను.
అంతం దదుపాలకశేషం బసురకులపాలకుకడకరిగి మ్రొక్కి
"దేవా! తరుచరుఁడొక్కఁడు ధరణీనందనం జేరి ముచ్చ
టించి, తరుల కెగఁబడి మహీజకాశ్రయంబైన యొక్క మహీ
జంబుతక్కఁ దక్కిన వనంబెల్ల నిర్మూలంబుఁగావించి వనపాల
కుల నక్కనందనునగరంబునకనిచె. అశోకవనంబు బట్టబయ
లయ్యె"నని విన్నవించిన నదరిపడి "యక్కపికుంజరుండు సీత
న్వేషణార్థ మవనిజాజాని పుత్తెంచిన దూతగానుండనోపు"
నని నిశ్చయించి, వానింగడతేర్ప, గదా ఖడ్గ ముసల ముద్గర
భిండివాలా ద్యాయుధపాణులగు శూరాగ్రేసరుల నెనుబదివే
వురు రక్కసుల నాంజనేయునిపయికిం బనుప, వారును సిం
హనాదంబులు సెలంగ, శూన్యంబగు వనంబుం బ్రవేశించి,
తోరణస్తంభంబున మార్తాండ ప్రభాభాసమానుండగు
మారుతాత్మజుంగదిసి, బాణవర్షంబు గురిపించిన, నాతం
డును మహారోషంబున, శలభ సంచయంబున కగ్నిహోత్రుని
చందంబున, వారలశాశ్వతంబుగసంయమనీనగరవాసులం జేసె.



హతశేషు లిత్తెఱంగు రావణునకెఱింగింప నతఁ డతి
రౌద్రావేశంబునఁ జతురాననసంజాతుండగు జంబుమాలి
యను దానవవీరుని సైన్యయుక్తంబుగ సమీర కుమారుపై
కిం బనుప, నాతండును, వివిధాయుధ ధాళధళ్యంబులు దిశ
లువెలుంగ సంగ్రామ రంగంబునకేతెంచి, తోరణ స్తంభా
సీనుండై యున్న రామదూతంగదిసి, పరిఘంబున మోదినఁ
దప్పఁజని, యనిలనందనుం డదియొడిసి, కేలంగొని మోదిన,
జంబుమాలి రథరథ్యాదులతో స్వరూపనాశనుం డయ్యె.
అది తెలిసి రావణుం డమితరోషంబున మంత్రిసుతసప్తకంబు
ననిచిన, వారును హనుమంతునితో సమీకంబొనరించి,
యమసదనంబునకుం జనిరి. అది విని పంక్తిగ్రీవుం డత్యా
శ్చర్యధుర్యుండై, సభ నలుఁగడలం దిలకించి, యూపాక్ష
విరూపాక్ష దుర్ధర ప్రఘస భాసకర్ణు లను సేనానాయక
పంచకంబు నవలోకించి "ఈ వానరుండు, దేవేంద్రుండు
నాకెగ్గుందలపెట్టి తపంబురెట్టించి పుట్టించి పుత్తెంచిన మహా
భూతంబుగాఁ దోఁచుచున్నది. అట్లు గాదేని గరుడ గంధర్వ
కిన్నర కింపురుషాదు లొక్కపెట్టున పుట్టించి పుత్తెంచిన
మహాకృత్తి మర్కటాకారంబునం జనుదెంచి యుండనోపు.
అట్లుగాదేని శాఖామృగమాత్రుల కీబలశౌర్యంబు లెక్కడివి?
వాలి సుగ్రీవ జాంబవ ద్వివిదాదులగు వనచరవీరుల నేనెఱుఁ
గనా? వారల కీ సత్వసంపన్నంబుగలదా? మీరత్యంత
జవసత్వంబులఁ ద్రిపురాంతకునైన నోడింపసమర్థులరు. వాన
రుఁడననెంత? మీరు చతురంగబలసమేతులరై వనచరుని

పయింజని, సామాన్య శాఖామృగమాత్రుఁడని నిర్లక్ష్యముఁ జేయక, జాగరూకులరై పోరి, వానిం బట్టితెండు. అటుగాదేని చంపుఁడు" అనిన రావణునానతి దానవు లతిభక్తిని శిరంబులవహించి యాస్థానంబు వెడలి సంగ్రామరంగంబున కరుదెంచిరి. ఉదయాద్రినలంకరించిన ప్రచండమార్తాండుంబోలి తోరణస్తంభంబు నధిష్ఠించి యున్న యాంజనేయుండు రాక్షసవీరుల నవలోకించి, రణోన్ముఖుండై పోరి సైన్యయుక్తంబుగ నక్తంచరులనెల్లఁ బరిమార్చి, మఱలి మకరతోరణంబలంకరించె. అందులకుఁ గనలి దశవదనుండాంజనేయునిఁబోలియుంప, సుకుమారగాత్రుండును, మహాశూరుండును, వివిధాస్త్రప్రయోగోపసంహారదక్షుండును, బాలుండును, నిజతనయుండును నగు నక్షయకుమారుం బనుప, వాఁడును సమస్తభూషణాలంకృతకాయుండై, వియత్పథసంచారనైపుణంబును, వివిధాస్త్రశస్త్రపూరితంబు నగు కాంచనస్యందన మారోహించి రణరంగబున కరుదెంచి, తోరణస్తంభంబున నున్న పవనతనూజుంగదిసి, నారాచపరంపరలునిగుడించిన నంజనాసూనుండును వానినెల్ల నవలీలం దోలఁగఁద్రోచికొనుచు, బాలుండగు పంక్తిగ్రీవసూనుని పరాక్రమంబున కచ్చెరువందుచు, నొక్క పాషాణప్రహారణంబున నాతని రథ రథ్యంబుల నుగ్గుజేయ, ఖడ్గహస్తుండై యాకసంబునకుద్గమించిన రాక్షసబాలుని పాదంబులు కేలంబూని, గిరగిరంద్రిప్పి, భూమింగొట్టి, పరలోకంబునకనిచె. అక్షునిపాటును రావణుండు విని, చింతాకులత్వంబున మూర్ఛిల్లి, దెప్పిఱిలి, తన యగ్రతనూజుండైన యింద్రజి



త్తుంగని, యత్యంతజాగరూకత్వంబున ననిలజుం బట్టి తెమ్మని నియోగించిన, నింద్రజిత్తుండును ప్రదక్షిణపూర్వంబుగా జనకునివీడ్కొని, చతురంగబలంబులుగొలువ నెంతయుఁ బరిభవవశంబున నశోకవనంబున కేతెంచి, రణభేరిమ్రోగించిన నాకర్ణించి, సమరోత్సుకుండై సింహనాదంబులొనరించు పావని పై బాణవర్షంబుఁగుఱిపించిన, నశ్రమంబున వానిం దప్పించుకొని పరిహసించు పవననందను పరాక్రమంబున కాశ్చర్యధుర్యుండై, రావణి సమంత్రపురస్సరంబుగా నేసిన బ్రహ్మాస్త్రంబు దాక నేలంబడి నిశ్చేష్టుఁడై, యుత్తర క్షణంబునం దెలివొంది, బంధంబు బ్రహ్మాస్త్రబంధమగుట యెఱింగి, బ్రహ్మవాక్యంబులం దలంచి, మైమఱచినవాఁడ పోలె దశకంధరదర్శనోత్సుకంబున దానవపాశబంధితుండై రావణు నాస్థానంబునకుం గొంపోఁబడి, తన యంతన బంధవిముక్తినొందించుకొని యున్న పవనజుం జురచురఁ జూచుచున్న రావణు ననుమతిఁ బ్రహస్తుండిట్లనియె. మర్కటాధమా! ని న్నీ పురంబునకు దూతగాఁబంపినవారెవరు? నీపేరేమి? ఏలవచ్చితివి? వననిర్మూలన మేలకావించితివి? భయమందక నిజంబెఱిఁగించితేని నిన్ననతికాలంబున నిచ్చోటు వాయ ననుమతి నొసంగెద. అనిన రావణమాతులుం గని యాంజనేయుండు,

### హనుమంతుఁడు రావణునకు బుద్ధులు గఱపుట.

"క॥ హనుమన్నాముఁడ మారుత
తనయుఁడ రఘురాముదూతఁ దపనప్రియనం

దనునకు సచివుఁడ నిక్కపు
వనచరుఁడ న్సీత వెదకవచ్చితి నిటకున్॥ 27

క॥ దివిజారి దర్శనంబ
న్యవిధముల న్నాకు దొరుకదని వనభంగం
బు వడిం జేసితిఁ జేసితి
బవరము నారక్షకోటికి బలములతోడన్॥ 28

దశకంధరదర్శనాభిలాష వేరొండుగతిం గడతేరు వెరవుఁ గానక దనుజాధముల పాశబంధముల కోడఁబడి కొనితేఁబడితింగాని, విరించివరబలంబుఁ గల నన్నుంబట్ట సురాసురాదులకలవియగునే?" అని చెప్పి బాలిశుండగు పంక్తికంధరుం జూచి "రామసుగ్రీవులు నీకుశలంబరసి నీతుల బోధింపుమని నా కానతినొసంగిరి. చెప్పెదను వినుము. లోకంబున కాధారులు కాంతామతల్లులు. అందుం బుణ్యాంగన లత్యుత్కృష్టలు. పడతుల పాతివ్రత్యంబునన నివ్వసుంధర వర్ధిల్లుచున్నయది. పతివ్రతల ప్రభావంబమితంబు. అరుంధత్యనసూయాది పతివ్రతామతల్లుల పరమోత్కృష్ట ప్రభావంబు నీ వాకర్ణించినదికాదా? వారికిం దీసిపోని వసుమతీనందనం గొనితెచ్చి వనటం బొందనున్నాఁడవు. పురుషులకు పరదారం గోరుట, పరమపాతకము. అంతియకాక యాయుర్దాయము గ్రశించు, నిరయంబునకు నిలయము. ఇంతకుమున్న నేక కులకాంతలం గొనితెచ్చి, పండువంటి కాపురంబులఁ బాడుచేసి పాపపర్వతంబులఁ బెంపొందించుకొనుచుంటివి. పురుషునకుఁ గల జననిపంచకమునందును రాజుదేవియు నొక్కతియ. రామచంద్రుండు రాజు. ఆతని యనుంగురాణియు నీకు జననియ. ఉపాధ్యాయునకు దశగుణంబులు జనకుండును, ఆతనికిఁ బదంతలు జననియుఁ, బురుషునకధికులు. ప్రభాతంబునఁ దొల్దొల్త జననిం దర్శించి నమస్కరించిన వాని దోసంబులు నిర్మూలంబులగు. అట్టిజననిం జెఱనుంచిన దురాత్ముండ వీ వొక్కఁడవ కాక వెదకిచూచినను వేరొకండు గానరాఁడు. పరమపావనుండగు రామచంద్రు దేవిం బరకాంతం బతివ్రతాతిలకమని యైనం భావించక చోరత్వంబున వంచనచే నపహరించి, పాపంబునొడిఁగట్టి నాశమునొందనున్నావు.



నీవును గృహస్థుఁడవు. పలువురు భార్యలం గలిగి గృహస్థసౌఖ్యంబుల నందుచున్నాఁడవు. పుత్రవంతుండవగు నీ విట్టి వ్యభిచారదుర్వ్యసనమునం దగులుకొని యుండినచో నీ పుత్రులు నీతిమంతులగుట యెట్లు? ఇందున నీవేకాక నీ తనయులు నైతము దురాచారపాశ బంధితులై చెడుదురు.

నీవు తృతీయప్రజాపతియగు విశ్రవోబ్రహ్మకుఁ దనయుండవై చతుర్థ చతురాననాభిధానంబున నెగడందగువాఁడవు. వేదవేదాంగపరుఁడవు. అత్యుగ్రంబగు తపంబునం బ్రజాపతిని మెప్పించి పలుఁగోర్కులం బడసియుంటివి. నిరంతర శివపూజాధురంధరుండవు. ఇట్టి మహానీయుండవగు నీవీ దురాచార పిశాచపీడితుండవగుట కసురయోని జనితుండవగుటయె కారణము.

మఱియు సురాసురులకజేయుండవై దుర్భేద్యప్రాకారంబున లంకనిశ్శంకం బరిపాలించుచుంటివి. ప్రాజ్ఞుండగు

శూరుండు తన శేముషీప్రావీణ్యంబు మెఱయఁ బరిపంథిబలపరాక్రమంబులును దనసామర్థ్యంబునుం బరికించి చతురుపాయంబులం దగునది యుపయోగించు. నీవు బాలిశుండవగు కతంబున రామచంద్రునితో నిష్కారణవైరమూని మున్ముందు చతుర్థోపాయం బుపయోగింపఁ గడంగుచుంటివి.

రాముండు సామాన్యమానవమాత్రుండని తలంపకుము. రాక్షససంహారార్థము విష్ణుండు దశరథున కగ్రనందనుండై జనియించె. రమాకాంతయు నయోనిజయై జనకునింటం బెఱిగె. అట్టి మహాలక్ష్మిం బట్టి పరిభవింపంగడంగుట పరలోకంబున కరుగఁ బాట నెమకి సిద్ధంబుగనున్నట్లని నమ్ముము. అంతియకాక జనకనందనం గొని తెచ్చి నీ యింటఁ బెట్టుకొనుట చేలాంచలంబున నగ్నిం బదిలపరిచి యుంచినట్లని తలంపుము. అది యట్లుండనిమ్ము. రామలక్ష్మణుల బలపరాక్రమంబులించుకవివరించెద. వినుము.

సీ॥ చరణాగ్రమున నీ భుజాదర్పమడఁచిన
ధూర్జటివిలు లీలఁ దుంచివైచె
వాలపాశంబున వడినిన్ను గట్టిన
వాలి నొక్కమ్మునఁ గూలనేసె
ననినిన్నుఁ జెఱఁగొన్న నర్జునుబోరిగొన్న
పరశురాముని నాజి భంగపఱిచె
గడిమిమైనొక్కడ ఖరదూషణాదుల
బదునాల్గువేవుర బారిసమరె



తే॥ నమ్మహాధనుర్ధరున కెగ్గాచరించి
హరిహరబ్రహ్మ శక్రాదులయిన నతని
భయదనిర్ఘాత సంఘాతవాతశాత
బాణఘాతహతులుగాక బ్రతుకగలరె.॥ 29

శా॥ శ్రేణీభూతములై దిగంతము లధిక్షేపించు సౌమిత్రిదో
స్స్థూణాగ్రోత్థితరత్నపుం ఖగణనోద్భూతస్ఫులింగచ్ఛటా
క్షీణజ్వాలధురీణబాణములు వర్షింపంగనీవేలస
ప్రాణత్రాణశరీరులై నిలుతురే బ్రహ్మాదులున్మందటన్॥30

ఆ మహామహు నానతి మూర్ధంబున ధరియించి యెంతటిపనినైన సాధింపంగమకించు పెక్కండ్రు మర్కటోత్తములం దొక్కొక్కఁడ నీ పుత్రమిత్రాదులతో నిప్పురవరంబు భస్మంబు గావింపంజాలుదురు. సుగ్రీవాది శాఖామృగశేఖరులం దొక్కని యంగుళినైన నోంపఁజాలని నిన్ను మార్తాండనందను మందిరంబున కభ్యాగతుం జేయ నే నొక్కండన చాలుదు. అయినను భానువంశదీపకుండు భానునందనాది వానరయోధుల సమక్షమంబున నిన్నుఁ దానఁ బోరి గొనువాఁడై యాడిన ప్రతిజ్ఞావచనంబుల కంతరాయంబు ఘటిల్లు నను భీతి నంతపనికిఁ దొడరనైతి. నీవు వనజాసనుచే వడసిన వరంబులు దేవాసురాదులచేఁ జావకుండగాని, నరవానరులచేఁ జావకుండఁగాదు. భాస్కరాత్మజుం డగచరవీరుఁడు. జానకీపతి నరకంఠీరవుఁడు. వీరిరువురిచే నీవు మృత్యువాతం బడుట నిక్కువము. తప్పదు. నీవు జీవితాపేక్షివైతివేని జానకిని భక్తిపురస్సరంబుగా రామచంద్రునకర్పించి శరణనుము.

అతఁడు శరణాగతవత్సలుఁడు. కావున నిన్నుం బరమాప్తుని గతి భావించు. వేఱొండు వెరవు గోచరముకాదు. నామాట నమ్ముము. విశ్రవోబ్రహ్మ పుత్రుండవై వేదవిద్యాసంపన్నుండవగు నీకీ దురాచారము చెల్లదు."

## రావణుఁడు రక్కసులచే హనుమంతుని తోఁకఁ గాల్పించుట.

అను మారుతాత్మజుం దిలకించి, రావణుం డతిరౌద్రంబునఁ బండ్లు పటపటగీటుచుఁ గుటిలభ్రూకుటియుగళుండై "వీనిం జంపి యాఁకలిదీర మెసవుఁడు" అని రక్కసుల కాజ్ఞాపించిన విని శేముషీప్రావీణ్యతమెఱయ విభీషణుం డగ్రజున కెఱఁగి, "రాక్షసోత్తమా! నీయాగ్రహమగపరుప నీతఁడు శాఖామృగమాత్రుఁడుగాని, ఇంద్రాగ్ని యమవరుణాది దిక్పాలురయుం దాఁకండునుగాఁడు, హర్యక్ష మతిక్షుధం బరితపించుచున్నను మదద్విరద కుంభస్థలాంతర్గత మస్తిష్క మన్వేషించుచుండుగాని, దరి నేగు శ్వానజంబుకాది క్షుద్రజంతుసంతానమాంసమున కాసించునా? దేవ దానవ యక్ష గంధర్వ కిన్నరకింపురుషాదులమీఁదనో వాసవాది దిక్పాలురమీఁదనో జూపఁదగిన నీ యాగ్రహము నీ శాఖామృగమాత్రునిపైఁ జూపఁ బరిహాసాస్పదము కాదా? అంతియకాక యాతఁడు దూత; దూత తన యేలిక చెప్పినచొప్పునఁ జెప్పునే గాని యాతనికి స్వతంత్రమెక్కడిది? 'దూత కశా ప్రహరణ శిరోముండనాదులచే దండనార్హుఁడు గాని, వధార్హుఁడు గాఁడను' నార్యోక్తి నీవెఱుఁగనిదా? స్వామీ! దయచేసి వీనిం జంపిదుర్యశముం జెందక మన్నించి సత్కీర్తినొందుము" అని ప్రార్థించిన విభీషణు



వాక్యంబుల ననుసరించి యాంజనేయుని తోఁకం గాల్చి యూరివాడల నూరేగింపఁ భటుల కాజ్ఞాపించి, రావణుఁ డతఃపురంబున కరిగె. అంతట రక్కసులుక్కుమిగిలి, పవననందను బంధించి, వాల కాయంబులఁ బెంచిన వాతూలనందను వాలంబున కసంఖ్యాకములగు చేలంబులఁ జుట్టి, తైలంబునఁ దడిపి, మంటదరికొల్పి, శకటంబుపయిం బెట్టి శంఖ కాహళ భేరీ మృదంగాది వాద్య ఘోషలు చెలంగ, తర్జన భర్జ నాట్టహాసంబులఁ జేయుచు, వీథులం ద్రిప్పుచున్నంత, రాక్షసాంగన లవనినందన కడ కరిగి, హనుమంతుని యాపన్నత నెఱింగించిన, నాసతీతిలక మత్యంత చింతాకులమానసయై, సామీరికి శీతకరుండవు గమ్మని వీతిహోత్రుం బ్రార్థింప, నమ్మహీతనూజ వాక్యంబుల నతిక్రమింప నోడి ధనంజయుం డంజనీతనయున కత్యంతశీతకరుఁడయ్యె.

## హనుమంతుఁడు లంకఁ గాల్చుట.

హనుమంతుఁడు "రాముని యనుగ్రహముననో, జానకి పాతివ్రత్యమహిమాతిశయంబుననో మదీయ జనకుని యందలి మిత్రభావంబుననో యగ్నిదేవుండు నామేనుఁగాల్పడయ్యె"నని యత్యుత్సాహంబునఁ దన దేహంబు సంకుచితంబుఁ జేసి, బంధంబులూడ్చిపుచ్చి, చెంగునఁ దోరణస్తంభంబున కరిగి, మున్ను తాఁ బెట్టిన పరిఘంబుఁ గేల నందికొని, దిక్కులు మారుమ్రోయ సింహనాదంబులు చేయుచుఁ దన్ను గట్టిన రక్కసుల మోది, యింటింటిని దరికొల్పుచు, పట్టణం బశేషంబు దిమ్మరుచు, మాఱ్కొనిన రక్కసుల నేడ్తెఱనుక్కడంచుచు, వీర

విహారంబు సలుపుసమయంబున నక్తంచరులంగంబులుకాలిపల వించువారును, తాముకట్టిన పుట్టంబు లనలావృతంబైన విడిచి దిగంబరులై పఱచువారును, గృహావతరణంబుచేసి పఱువం బోవ ధూమజాలంబులు గతికవరోధముఁగల్పింప మ్రగ్గువారును, గృహోపకరణంబు లెటకేని దవ్వునకుంగొంపోవ నుంకించి గేహాంతరాళంబునకుం జన నగ్నింబడి పొరలువారును, డమపట్టణంబున కిట్టి రటితముఁ దెచ్చెనని పవనుపట్టిఁ బట్టం జని జఱుపట్టంబు మెట్టింపఁ బడువారును, రావణుఁ డవనినం దన నేల మ్రిచ్చిలెనని శపించి పలవించుచుఁ జచ్చువారును, దానవానీకంబునెల్ల నుక్కడంచినవాఁ డొక్క సామాన్యమర్కటుఁడే యని యొక్కింతయు నక్కజపడక తోఁకఁగాల్చిన నింతగా దేయని వాపోవుచు మరణించువారును, మన కిన్ని యిక్కట్టులఁదెచ్చిపెట్టిన దశకంధరుండు కాంతాజనపరివృతుండై ప్రాణంబులఁ దక్కించుకొనఁ బయలునకుం బాఱకున్న నిందుఁబడి మ్రగ్గరాదే యని యుగ్గడించి ప్రగ్గువారును, ఇంతకును మూలము శూర్పణఖయని దాని శపియించువారును, లంక కంత్యకాలమిదియ యని దుఃఖించువారును నై లెక్కకు మిక్కిలియగు రక్కసులు వీతిహోత్రునకాహుతులైరి.

అప్పుడు కాలిన దంతావళంబులు, కమలిన యశ్వంబులు కరఁగిన యాభరణంబులు, కగ్గువెనయరదంబులు, కాకవారినతరురాజంబులు, కాటుకపట్టినకుడ్యంబులు నై శ్మశానపుమాలవాటికలంబోలి కళావిహీనంబై పాడువడియున్న లంకానగరంబున, వాయస పరివృతమైన మరాళంబుమాడ్కిం



బాషాణావృతంబైన పద్మరాగంబుభంగి నభ్రచ్ఛన్నమగు మధ్యందిన మార్తాండుపగిదిం బాషాణపర్వత మాలావృతంబైన కాంచననగంబుచందంబునఁ బ్రస్ఫూర్తినొందు విభీషణ మందిరంబునుండి వెలువడి యశోకవనిం జేరి పావనికై పలవించు పుడమిపడదనం గని నమస్కరించి, సరమ యిట్లనియె.

అమ్మా! జనకనందనా! వాతూలనందనునికై వగవకుము. ఆతండు రక్కసకృతంబైన బందంబులూడ్చిపుచ్చి,గంతులిడుచు, నింటింటికరిగి, ద్వారంబులకడ నగ్నిందరికొల్పి, వేడుక జూచుచుండం గరి రథాశ్వశాలలు కాలిపోయె. ధాన్యశాలలు దగ్ధంబులయ్యె. కాంచన ప్రాసాదంబులుకరఁగిగడ్డకట్టె. పూలతోఁటలుబూదియయ్యె. తప్పఁదాఁగి మత్తిల్లిన దంపతులు తగులఁబడిరి. దైతేయాంగనలు నిజాంబరంబు లంటుకొన వీడి దిగంబరులై దిక్కువిక్కులకుం బఱువులిడిరి.రావణుఁడు రాక్షసభటపరివృతుండై పలవించుచు, దహనకీలలకోడి, గేహంబు వీడి, బయలునకేగి, నిశ్చేష్టుఁడై నిలిచి చూచుచుండె. అదె చూడు రెండవ దహనునిచందంబునఁ బ్రకాశించు పవనసూనుదరిఁ జేరనోడి, రాక్షసవీరులు గోపురతోరణస్తంభంబుల నారోహించి, బెదరి బెదరి చూచుచున్నవారు. ఆంజనేయుండత్యుత్సాహంబునఁ గిలకిలారావంబు లొనరించుచునుండె, అను విభీషణు కాంత వాక్యంబులాలించి రోమహర్షమై సీత సంతసించుచు నుండె.

వాయునందనుండు వారిధి కరిగి వాలానలంబు నార్పి వసుధాత్మజం దలఁచి "కోపంబున కాయంబుమఱచి లంకఁగాల్చితి ధరణీనందన సేమంబుఁ దలఁపనైతిని.

క॥ కోపులు గురువధకోడరు
కోపులు పరనింద సేయఁ గొంకరు కోపం।
బాపదలకెల్ల మూలము
కోపము పాపములపొత్తు కోపానలముల్॥ 31

క॥ విపులక్షమాజలంబుల
నుపశమొందింతురార్యు లుత్తమబుద్ధిన్
వ్యపగతమతినయి నేనీ
విపరీతక్రమముఁ జేసి వెంగలినైతిన్." 32

అని చింతించుచు పవనసూనుండు ధైర్యంబవలంబించి "సీతారాములదూతనగు నాకణుమాత్రమైన బాధఁగలుగ నీయని వైశ్వానరుండు, పరమపావనియగు పుడమినందన కపకారంబుదలంచునా?" యని యూహించుతఱి నంబరవీథిం జను సిద్ధచారణులు రాజసీతనయ నుపలక్షించి "బళా! పవనతనయు పరాక్రమంబునకుఁ బరిమితియెక్కడిది? తానెక్కండ వననిధిలంఘించి, లంకంజొచ్చి, సీతంజూచి, వనంబు నిర్మూలనంబొనరించి, పలువురుదనుజులఁబరిమార్చి, లంకంగాల్చె. ఇంతజరిగిన నవనినందన కొకించుకయు నాపదజనింపదు. ఆ సతీమణి మాహాత్మ్య మెంతనికొనియాడఁగలము?" అని తమలోఁ దా మనుకొను వాక్యంబుల నాకర్ణించి, సీతాకౌశల్యంబునకానందించి, యాంజనేయుండు జెప్పుననశోకవనింజేరి,



మహీసుత నుపలక్షించి, మ్రొక్కి ఫాలఘటితహస్తుండై నిలిచిన నా లోకపావని పావనింజూచి "మారుతాత్మజా! నీవును, వైనతేయుండును, నీజనకుండును, దక్క నెరులీ లవణోదధి లంఘింపఁగలరా? ఈ దైతేయనగర మీలాగున వైశ్వానరున కాహుతిఁజేయ నమరులకయిన నలవియగునా? తండ్రీ! నీ వీయెడ నుండునంతకాలమును నాదుఃఖము లేడ కరిగెనో యెఱుఁగరాదు. నిన్నుంజూచుచుండిన నాదుఃఖంబులు కడముట్టినట్లు గనుపట్టుచుండును. కావున నీ దివిస మిటనుండి జేపు పోఁజాలవా?" అనిన భూనందన వాక్యంబులకు జాలినొందియు సమీరసూనుండు "అమ్మా! అంగదాదియగచరవీరు లంబుధి కావలిదరి నారాకం బ్రతీక్షించుచుందురు. నేనిటఁ దడవుండుట తగవుగాదు. ఈ కుశలవార్త వినినతక్షణంబ రాఘవుండు సుగ్రీవపురస్సరు వనచరానీకంబుతో వనధిఁగడచి యిటకరుదెంచి యాలంబున నాకర్ణాంతకోదండముక్తామోఘ శిలీముఖంబుల దశకంధరుం దెగటార్చి, నిన్నయోధ్యకుంగొనిచన, భర్తంగూడి శాశ్వతసౌఖ్యంబుల నందఁగలవు. విచారంబునొందకుము" అని యోదార్చి వసుమతీసుతను వీడ్కొనియె.

## —•ఐదవ ప్రకరణము.•—

హనుమంతుండు సాల హింతాల తమాలాది భూరుహనిబిడితంబును, సింహశార్దూలాది మృగఘోషాసంకులంబును, యక్ష కిన్నర సిద్ధ విద్యాధ రోరగ మునిగణ నివాసకందరంబును, వింశతి యోజనదీర్ఘంబును, దశయోజన విస్తృ

తంబును, గల యొక్క భూధరం బెక్కి సీతారాముల నంతరంగంబున సంస్మరించి, లవణోదధి లంఘింప నూకించి, కుప్పించి, గగనంబున కెగసిన నయ్యద్రిరాజంబు భూమిమట్టమునకుం గ్రుంగ నాదిశేషుని ఫణములు చెదరె. మఱియు నా గ్రావ కందరంబుల నివసించు సర్పంబులు వక్త్రంబులు దెఱచి, నాలుకలఁ జాచి, గరళంబు నుమిసె. ఆసమయంబునం దదంగజనిత ఝంఝూమారుతవేగంబున నాభూధరస్థ భూరుహంబు లెగసి, మహావాయుపథంబున నల్లలనాడుచుండె. మేఘంబులు చెదరె. అంతియ కాక నా మహీధరవాసులగు గరుడ గంధర్వ కిన్నర కింపురుషాదుల కాంతల వలువలువీడి, నిలయంబుల నిలువఁ జాలక, కొట్టుకొని పోవుసమయంబున వారియాభరణంబులు రాలె. మారుతాత్మజోత్సాహకృత సింహనాదంబులచే బ్రహ్మాండభాండంబు బ్రద్దలయ్యె నన నయ్యద్రి గుహాలంగాపురముండు సింహశార్దూలాది వన్యమృగంబు లడలి బాఱుచుంట వింతగాదు. ఇత్తెఱంగునఁ బక్షధరంబగు పర్వతంబుభంగి, నభశ్చరుండై యేతెంచు కేసరీతనయుని కేకలాలించి, మహేంద్రాద్రిపై నివసించు వనచరవరులగు జాంబవదాంగదాదులు భూధర పాదపాగ్రంబుల నారోహించి, నిక్కినిక్కి చూచుచుఁ గరతాళధ్వను లంబరంబు ముట్టఁజేయుచు, మారుతసూతిం గానక, సింహనాద శ్రవణానందావిష్టులై యున్న శాఖామృగ పుంగవుల నవలోకించి జాంబవంతుఁడు,



"క॥ జనకజఁ బొడగన నోపుచు
హనుమంతుఁడు గానకున్న నతిగంభీర
ధ్వని యేలగల్గు మోదం
బున వచ్చుచునున్న వాఁడు భూరిధ్వనితోఁ ॥ 33

అను నవసరంబునఁ, దనకూఱుటగా జనుదెంచిన మైనాకుని హస్తస్పర్శ నతిసంతుష్టుం జేసి, శూరాగ్రేసరు ధనుర్విముక్త నారాచంబు చందంబున వనచరబృందమధ్యంబున దుమికి, అంగద జాంబవంతులకు వందనం బొనరించి, వారిచే నాలింగితుండై, మైందద్వివిదాది యోధవరుల నీక్షించి, పరమానందసూచక మందహాసవదనుండై, హరిణబృందపరివృతంబైన హస్తిచందంబునఁ దరుచర సమాజపరివృతుండై, యంగదుకరంబుఁ దనకరంబునం బట్టి చని, యొక్క విపుల విశాల శిల నాసీనుండై, నిజసహచరశ్రోత్రపర్వంబుగ వక్కాణించిన మహీనందన కుశలవార్త నాలించి యంగదుండు,

—♦ హనుమంతుఁడంగదాదులఁ గలసి సీతావృత్తాంతము చెప్పుట ♦—

"ఉ॥ క్షోణిఁ బయోధి దాఁటి యిటు చూడఁగ నెవ్వఁడు వచ్చు నీకుఁ గీ
ర్వాణులు సాటిగారు రఘురాముఁడు రాగిల సీతఁ గంటి మా
ప్రాణములెల్లఁ గాచితి నృపాలశిఖామణి పాలికిన్ జగ
త్ప్రాణతనూజ నీవు తగు ప్రాపుగఁ బోయెద మిప్డు నెమ్మదిన్ ॥

అనిన విని జాంబవంతుండు పయోరుహబంధునందను సచివున నవలోకించి ప్రియంబార

"ఉ॥ శరనిధి నెట్లు దాఁటితి నిశాచరుపట్టణ మెట్లు చొచ్చితే
వెరవున సీతఁ గంటి పృథివీసుత యేమనెఁ గ్రూరరాక్షసో

త్కారముల నేగతిఁ జెలఁగి క్రమ్మఱవచ్చితి పోలఁ జెప్పుమా
తరుచరవీర! నావుడు ముదంబున వారలకాతఁ డిట్లనున్॥" ౨౫

అను వాక్యంబుల కుత్తరంబుగాఁ దన గమనవృత్తాంత మాద్యంతము నివేదించిన నత్యుత్సాహంబున నంగదుండు కపివరేణ్యులమధ్య, మధ్యందినమార్తాండుం బోలి నిలిచి, విజృంభించి, బాహువు లప్పళించి "మనయాంజనేయుం డగణితదైత్యానీకంబుఁ గడతేర్పఁజాలిన శూరుండు. గజ గవయ గవాక్ష గంధమాదన మైంద ద్వివిదాది యోధు లసమాన పరాక్రమసంపన్నులు. జాంబవంతు నెదుర్కొనఁజాలిన వీరుఁడీ రేడులోకంబులం గనరాఁడు. మన మందఱ మొక్కుమ్మడి లంక కరిగి బవరంబునఁ బంక్తికంధరాది యాతుధానయోధులఁ బొరిగొని, భూనందనం గొని, భూపతికి సమర్పించి యాతని మన్ననవడయుదము. అటు గాదేని నేనొక్కండన చని రావణికృత ప్రయోగ పాశుపతాది దివ్యాస్త్రజాలంబుల నిరసించి, లంకానగరవాస్తవ్య దానవానీకంబున కజేయుండనై జానకిం గొని తెచ్చి, రామమూర్తిపాదారవిందంబుల కర్పింతు. ఇందు కర్తవ్యం బెద్ది?" అనిన వాసవపౌత్రుం దిలకించి జాంబవంతుండు "తారానందనా! సుగ్రీవుఁడు మనల నవనిజాన్వేషణార్థము పుత్తెంచెం గాని నాయమనిచ్చుటకిఁ దోడి తెచ్చుటకుఁ గాదు. అక్కార్యం బిప్పావనికృతంబుగఁ దీఱె. మన మింక భానునందనాదులకడ కరిగి మహీతనయ కుశలవార్త నివేదించుట కర్తవ్యము. సుగ్రీవాదుల సమక్షంబున లోకవిద్రావణుండగు రావణు నంతకుగృహంబున కభ్యాగతుం జేయఁ



బట్టిన ప్రీతినఁ దీర్ప నర్కకులదీపకుండగు రామచంద్రుండు తరుణాపేక్షుఁడై యున్నవాఁడు. కావున మనము పోవుదము. లెండు" అనిన జాంబవంతుని వచనంబులకలరి, మేరుమందర మహీధరంబులం బోలిన మహోన్నతకాయులై కేకలిడుచు, గంతులువైచుచు, భూరుహంబుల కెగఁబ్రాకి దుముకుచు, ఫలంబుల భక్షింపుచు, మధువు నాస్వాదించుచు, ఋశ్యమూకాభిముఖులై యేతెంచు వనచరగణంబు, కుసుమదళఫల భరితంబై, నందనారామంబు కరణిం జెలువారుచు, నర్కనందన మాతుల పాలితంబగుచు నున్న మధువనంబుం జొచ్చి, యంగదానుమతంబున నఖిలవనచరులు నందలిఫలంబుల నాహారంబుగఁ గొనునవసరంబున, వారి నదలించిన దధిముఖాది వనపాలకులపయిం గవిసి యాంజనేయుండు నొప్పించిన, నిజసహచరపరివృతుండై, దధిముఖుండు, తనభాగినేయుండగు వనచరరాజ్యపట్టభద్రుం జేర నరిగి, పవననందను దుండగంబులు నివేదించిన నాతండు "మారుతాత్మజుండు మహీనందనాన్వేషణజనిత జయోత్సాహుండై చనుదెంచి యుండనోపు" నని యూహించి వారిం దోడ్కొని తేర నాదధిముఖున కేముదల సీయ నతఁడును రామలక్ష్మణులకు నమస్కరించి, రవినందను వీడ్కొని, యాంజనేయాది శాఖామృగశేఖరుల కడ కేగి, భాస్కరసూనునాజ్ఞ నివేదించిన నఖిల వనచర పరివృతుండై యనిలతనయుండు రామ లక్ష్మణ సుగ్రీవుల సమక్షంబున కేతెంచి, వందనం బాచరించి, యఖిలవానరానుమతంబున నాంజనేయుండు రాఘవునవలోకించి యిట్లనియె,

హనుమంతుఁడు రామునకు సీతావృత్తాంతము, లంకావృత్తాంతము చెప్పుట.

"క॥ కనుఁగొంటి సీత నేమఁ
బుననున్నది మిమ్ము భావముననిడుకొని వా
కున రామరామ నృపయం
చును వెసమీరాక కెదురుచూచుచు నెపుడున్॥ 36

ఆ॥ వఱపు దాఁకియున్న వల్లికై వడివాడి
బాలచంద్రరేఖపగిది డస్సి
మధుపకలితపుష్పమాలికగతి మాసి
వసుమతీతనూజ వగలఁ బొగులు"॥ 37

దేవా! దేవరదేవి రావణునశోకవనంబున శార్దూలాంతర్గత మృగశాబకంబుచందంబున దైత్యాంగనాధీనయై నిరాహారవ్రతంబున భవదీయమంగళవిగ్రహంబు నాత్మను ధ్యానించుచు ననిమిషత్వంబు నొంది "దశకంధరదత్త మాసద్వయావధి నెవ్విధినైన నుసురులఁ బిగఁబట్టెద, నటుమీఁద రామచంద్రుఁడు రాకతామసించిన బ్రదుకంజాల" నని చెప్పి మీకు నమస్కరించి లక్ష్మణ సుగ్రీవాదుల కుశలం బడిగి, మున్ను కానం గడచిన కాకాసురవృత్తాంతంబువినిపించి నిజచేలాంచలంబున భద్రబంధీకృతంబగు చూడామణిని నాకొసంగె"నని యమ్మాణిక్యం బర్కకులమాణిక్యంబున కొసఁగ నవనితనయం దలఁచి వాపోవుచు నర్కనందనాదులచే నోదార్పంబడిన రామచంద్రుం గని పవననందనుండు,



"క॥ అర్ణవము దాఁటి బహుభుజ
పూర్ణుండగు పంక్తికంఠుఁ బోరి గొని జగముల్
వర్ణన సేయఁగ నీవర
వర్ణిని గొని తేరఁ బోవవలయు నరేంద్రా॥ 38

అనిన జగత్ప్రాణనందనుం దిలకించి జనకనందనాప్రాణనాయకుండు "సహోదరా! వినతానందనుండును, వాయుదేవుండును దక్క నితరుల కవిలంఘనీయంబగు లవణోదధి లంఘించి సీతం గని యాయమకుశలవార్త శ్రోత్రపర్వంబుగావించి నాశోకంబున కుపశాంతిఁ గావించిన నీ యుపకారమునకే నేమి ప్రతిసేయఁగలను? నా యనుజన్ములయం దొకనిఁగా భావించెదను. ఇంతకధికం బొనరింపఁజాల"నని యాదరపూర్వకంబుగ నాలింగనం బొనరించి "సమీరకుమారా! నీచే నివేదింపఁబడిన జనకనందనాకుశలవార్తకామోదంబునొందుచుంటిం గాని, వారిధిని వారావధిలేక నే తెఱంగున గడవఁగలనా యను విచారంబునకుం గొఱంత గోచరముకాదు. అయినను రావణు నగరవృత్తాంతం బెఱింగింపుము" అనిన రఘునందను నాలోకించి వాయునందనుండు "స్వామీ! భూగర్భంబుననుండి వెలువడిన పచ్చికనైన లెక్కింప ననువగుఁ గాని లంకానగరంబునం గల రక్కసుల లెక్కింప నాదిశేషునకయిన నలవిగాదు. మఱియును,

"శా॥ ప్రాకారంబుల గత్తలట్టడలు యంత్రవ్రాతముల్వప్రము
ల్వాకిళ్ళాయుధ సంపదల్గజములశ్వంబుల్రథంబుల్భటా

నీకంబుల్బహుకేతనాదులు మదిన్నిర్మించినట్టుండు భూ
నాకంబప్పురమేకొ అంతయును గానంబట్టదెప్పట్టునన్. 39

అంతియ గాక యన్నగర పశ్చిమకవాటంబునఁ గరాళశూలహస్తులగు పౌలస్త్యులయుతంబును, దక్షిణోత్తరమార్గంబులఁ జతురంగ బలసంయుక్తులగు రక్కసులొక్కొక్కలక్షయు, ప్రాగ్దిశాద్వారంబునఁ గృపాణపాణులగు నక్తంచరవీరులు దశలక్షయు, మధ్యస్కంధంబున నతిదృఢపరాక్రములగు దానవుల నేకయర్బుదంబులును గలిగి సుస్థిరపరిరక్షణంబగు లంకాపట్టణంబు, నతిరథ మహారథులగు మహోన్నతకాయులైన యసంఖ్యానీక యాతుధానపరివేష్టితుండై, దశకంధరుండు దేవదానవుల కభేద్యుండై నిశ్శంకం బరిపాలించుచున్నవాఁడు” అను వచనంబుల నాలకించి యిట్టిదెట్టిదం బగు పట్టణ మెట్లుఁ బట్టంగలనని మానంబున శంకించుచున్న రామచంద్రుని మనోవిచార మాతని ముఖావలోకనంబున గ్రహించి యాతని శంకావర్జితుం జేయఁబూని యాంజనేయుండు “అయినను మన యంగద మైందద్వివిద గజ గవయ గవాక్ష గంధమాదన జాంబవత్ప్రముఖ వానరవీరులొక్కొక్కఁడ లంకం ద్రికూటాచలసమేతంబుగఁ బెకిలి వేఁటాడం జాలుదురు. దేవర పరాక్రమం బతిశ్లాఘాపాత్రము. తగిన సుముహూర్తంబునం బయనంబు సల్పుఁడు” అను పావనివాక్యంబుల కలరి రాఘవుండు సుగ్రీవపురస్సర వనచరానీకంబు తన్నుం బరివేష్టింపఁ దాను నైరావతారూఢుండగు జంభారిం బోలి యనిలనందనుభుజంబుల నధిష్ఠించి, యంగదభుజంబుల



నారోహించిన సౌమిత్రి సార్వభౌమారోహితుండగు ఘననాఘంబోలి ఘోడరాఁ బ్రయాణభేరి ప్రయోగించి లంకాభిముఖుండై చని సాగరసమీపంబున విడిసె.

## ఆఱవ ప్రకరణము.

### ~ విభీషణుఁడు రాముని శరణుజొచ్చుట. ~

రావణుండు వేగులవారివలన వైదేహీపతిగమనం బెఱింగి, మంత్రులతో మంత్రాలోచనంబు సల్పుతఱి, నాతని యనుంగుసోదరుండగు విభీషణుం డగ్రజుదరిఁ జేరనరిగి, రామచంద్రుపరాక్రమంబును పృథివీనందన పాతివ్రత్యంబును నెంతయు సగ్గించి, జనకనందన నొసంగి దశరథనందను దరిఁ జేరి మనిన నమితంబగు లగ్గగునని యుపదేశించిన నీతివాక్యములు వ్యాధిబాధితునకు భక్ష్యభోజ్యంబుం బోలి గరళప్రాయంబై సభాస్థానంబునఁ బాదతాడంబునం బరిభవింప నతఁడవధింగనని వృథోదధితీరంబుఁ జేర ననువగు నొక రామచంద్రు పాదకమలసేవయ యని నిశ్చయించి, జననియనుమతిం గొని, తన యనుచరచతుష్కపరివృతుండై, రామచంద్రు దండం జేర నంబరవీథిం జనుదెంచి, గోధస్ఫురత్కరుండై నిలిచి శరణన్న నాకర్ణించి, లక్ష్మణసుగ్రీవాదుల యుపదేశవాక్యభావంబు నంగీకరింపక, వానరవీరుల వీరాలాపములాలించి, రఘునందనుఁ డనిలనందను నుపలక్షించి “పవననందనా! గగనవీథిం జనుదెంచిన నీ యాతుధానుని యుదంతం బెట్టిది? వినింజెకొన

జెల్లునా?" యని యడిగెను. వాయునందనుండు విభీషణుం దలఁచి రాఘవున కంజలి ఘటించి "దేవా! మున్ను నే నీతని యగ్రజన్మునితనయునిచే లంకానగరంబునఁ బట్టువడి రాజాస్థానంబున కనుపఁబడిన యవసరంబున దశగ్రీవుండు నన్నుఁ బొరిగొన నక్తంచరుల కాజ్ఞాపింప నాలకించి యీపుణ్యుండు రావణున కనేకరాజనీతుల నుపదేశించి, దూత యవధ్యుండని నమ్మించి, నన్ను విడిపించిన కతంబున, జానకియుదంతంబు దేవరకు నివేదించు భాగ్యంబు నాకబ్బుటం జేసి నాకృతజ్ఞత కీతఁడు పాత్రుండయ్యె. అప్పటిచర్యల నవలోకింప నీతఁడసురయోనిజనితుండను కళంకమాత్రావశిష్టుఁడగాని, తద్వృత్తియణుమాత్రమైన నీతనియందు నాకుఁ గోచరము కాదయ్యె. అది కారణంబుగా నీతఁడత్యంత సుగుణఖనియని విన్నవించుట కావంతయేని నామనంబు జంకునొందకున్నయది. మఱియు, నీతండు, దేవరవా రమరేంద్రనందనుఁ దెగటార్చి యాతని యైశ్వర్య మర్కనందనున కొసంగిన వార్త నాలకించి, రావణుతో బవరంబొనరింప నేతెంచిన దేవరవలన లంకారాజ్యశ్రీనందఁగోరి, యగ్రజుం బాసి తమచరణంబుల సన్నిధానంబున కేతెంచియుండనోపు. అట్లుగాక మాయావియై పయోముఖవిషకలశముంబోలెనేని, మనమర్కటాగ్రేసరుల యెదుర నీతఁడనెంత? నిమిషమాత్రంబున నీతని పీచంబడఁచి భాస్కరనందను పట్టణంబున కతిథిగఁ జేయంజాలుదురు. ఇంతయేల, నీ యసురశేఖరుఁడు దేవరవారి కరుణాకటాక్షవీక్షణంబుల కర్హుండు గాని యనర్హుండు గాఁడు. శరణాగతత్రాణుఁ



డను దేవరబిరుదు నీతనియెడంగూడ సార్థకపఱుపందగు" అని విన్నవించిన యంజనీసూను వాక్యంబులకలరి రామచంద్రుండు రావణానుజు నంగీకరించి యప్పుడ లంకాభిషిక్తుం జేసి కీర్తింగాంచె.

పిమ్మట రఘునందనుండు వానరులచే వననిధిబంధింపించి లంకంజొచ్చిన యనంతరంబు వానర దానవ చక్రవర్తుల మల్లయుద్ధంబయినపిదప, వానరరాక్షస సంకుల సమరానంతరంబున, రావణి మాయాయుద్ధంబొనరించి, రామలక్ష్మణుల బంధించిన నాగపాశంబుల వినతానందనుండు వదల్చె.

అంత దశవదనుండు ధూమ్రాక్షుం డనుదానవునకు దళవాయితనంబొసంగి రామలక్ష్మణులపయింబనుప నతఁడపరిమిత రక్షస్సేనాపరివృతుండై వనచరసేనం గవియ, ననయనిలనందనుండు రోషతామ్రాక్షుండై

హనుమంతుఁడు ధూమ్రాక్షాది దానవులజంపుట.

శా॥ ఆమ్రంబొక్కటిపూని మారుతసుతుండంకించివీకన్నమి
త్సామ్రాజ్యోచితజైత్రఘోషమమరం జండాట్టహాసంబుతో
ధూమ్రాక్షుంగని వైచె వైచుటయు నద్దోషాచరుండల్కనా
తామ్రాక్షుండయి దానిఁద్రుంచెనడుమం దా దాలభల్లంబులన్ ॥ 40

అమ్మహాకపియు మహారోషంబున నొక్కమహాపర్వతశృంగం బవలీల కేలంగీలించి, ధూమ్రాక్షుపయి నేయ నాతని శతాంగంబు హయసారథియుక్తంబుగఁ జూర్ణంబయ్యె. ధూమ్రాక్షుం డత్యుగ్రంబున గదాధరుండై ధరణికు

ఱికి, క్షీరసాగరమథనసమయ మందరనగంబుచందంబున, గదాదండంబుద్రిప్పుచు వీరవిహారుండై యున్న సమయంబున సమీరనందనుండు మహాభూరుహమూల మొక్కండు కరంబునధరియించి, మార్కొనిన నక్తంచరుల మృత్యువు వాతంబడనేసి, యొక్కప్రేటున ధూమ్రాక్షుంబరిమార్చి దిక్సింధురములచెవులువగుల సింహనాదంబుఁ జేసె.

హతశేషులగు నక్తంచరాధములు రావణున కిత్తెఱం గెఱింగింప నతఁడదరిపడి ప్రబలయుద్ధాకంపనుండగు నకంపనునకు సేనాధిపత్యంబొసంగి, రాఘవుపయిం బనుప నాతండును విజృంభించి వానరులం జీకాకునొందించుచున్నతఱిం బఱచు వలీముఖులం గేకలమఱల్చి, పావని యొక్క పాషాణంబకంపనునిపయి నేయ నతఁడతిచతురత్వంబున ననేక నిశిత మార్గణంబుల నాశిలంజూర్ణమొనర్చి, యెద్దెఱ ననిలనందనుంగవియ నతఁడత్యుగ్రత నొక్కసాలమహీజంబు పెఱికి, రక్కసుల నుక్కడంచుచు జనుదెంచుట నవలోకించి, యకంపనుం డీరేడునారాచంబుల వాయునందనునొప్పింప, నతఁడతి కుపితుండై తనహస్తపద్మంబుననున్న సాలభూరుహంబు జక్కంబట్టి, యొక్కప్రేటున నకంపను నంతకాలయంబునకనిపె.

పిమ్మట మహాకాయాదిమహాయోధులు రావణప్రేరితులై రణరంగంబునకేతెంచి హతులైరి. తదనంతరంబ, పంక్తిగ్రీవుండు పట్టఁజాలనిమహారోషంబున, మందోదరి నీతివాక్యంబులనైన లెక్కింపక, తాన సమరోత్సుకుండై చనుదేర,



రాఘవానుమంతబున రావణుపయిం జను సుమిత్రానందను గతి కవరోధుండై యాతని వారించి, పావనిముందునడిచి.

~ హనుమంతునిచే రావణుఁడు మూర్ఛిల్లుట. ~

క॥ రక్షోనాథున కెదురై
దక్షిణభుజమెత్తి కొనుచు ధరణిచలింపన్
వృక్షచరులార్వ నశనిస
దృక్షత్వర బాఱు దెంచి తెంపున బలికెన్॥ 41

దోషాచరాధమా! ఇదిగో ముష్టిబంధము. మున్ను సురాసురులజయించితినని పల్కిన బీరంబులు చెల్లవు; ఇది పరాంగనలంగాంచి యానందించుటయుఁ గాదు. ఇదె చూడు, నా యుద్దండభుజాదండంబు నీకొఱకు నిర్మింపఁబడిన కాలదండమ్మని నమ్ముము. నీవు వెఱచి పఱుగిడిన నీప్రభంజననందనుండు నిన్ను వెంటనంటి యడుగంటఁ జేయుం గాని విడువఁడు. ఓరీ దానవాధమా! నీవు అరణ్యంబున నొంటిమెయినున్న జనకనందనను ప్రుచ్చిలిన పోటుబంటవని యేనెఱుంగనా? నీ కుమారు నక్షకుఁబరిమార్చిన మహావీరుండనని నీవు నన్ను మఱచితివా? ” యని మహాబలనందనుండు మహావేగంబున, నరదంబుపయికి దుమికి, దశకంధరు పెన్నురంబున నిజముష్టిం బొడువ, విసంజ్ఞుండై పడియె. అంతం దరుచరు లిలాతలంబునను, నంబరంబున నమరగణంబును జేసిన సింహనాద కరతాళధ్వను లేకమై దిక్కులు ప్రతిధ్వనించె.

“ తే॥ అంత నద్దశకంధరుండంతలోన
తెలిసి హనుమంతుఁ జూచి నీబలము మెచ్చ

వచ్చునీదు వేటున బంక్తివదనుఁ డమర
వైరి ప్రేతలోకముఁ జూచి వచ్చెనౌర॥" 42

అనినం బవనసూనుండు మందహాసంబున రావణు నవలోకించి, "రావణా! నా దెబ్బకు నీవు బ్రదికియుండుటకంటె నాకు వేరొక పరాభవము గలదా? ఇసీ! ఇది యొక మహాఘాతంబని తలంపకుము" అని కదియంజను సందర్భంబున నీలుం డమరవైరిం దలపడి పోరుచుండె.

ఆవల దశకంధరుతో సమరంబు సల్పి మూర్ఛం జెందిన లక్ష్మణుం గొనిపోవ నుద్యమించిన దశవదను నదలించి, యాంజనేయుండు సౌమిత్రిం గొనిపోయి, రాఘవు దరిం జేర్చి మూర్ఛం దేర్చె. రావణుండు రామచంద్రునిచేఁ బరాజితుఁ డగుటం జేసి సమరవిముఖుండై నిజనగరంబున కేగి, నిద్రించు కుంభకర్ణుని వేగించి, రాఘవుపయిం బనుప నతఁ డతిరౌద్రంబునం జనుదెంచి, వనచరసేనం గవిసి, బ్రహ్మవరదత్త నిద్రామత్తతచే వానర రాక్షస భేదంబు గనిపెట్టఁజాలక, దొరకినవారిం గబళించుచు, మహోగ్రంబగు సమరంబు సల్పుతఱి నాంజనేయుం డమితోత్సాహంబునం దరుపాషాణంబుల వాని నొప్పించి, కుంభకర్ణుని చేనున్న శూలంబు నొడిసి, కొని, తునియలు గావించె.

కుంభకర్ణుండు రాఘవాస్త్రానలంబున కాహుతియైన యనంతరంబ, రావణప్రేరితులై యంబరచరదక్షులు, మాయావిశారదులు, నానాస్త్రప్రయోగోపసంహార ప్రవీణులు, మహాబలసంపన్నులు, దేవదర్పఘ్నులు, విజయగర్వితులు,



లబ్ధవరులు, రణోత్సాహులు, మహోన్నతకాయులు, వికృతాకారులు, సార్థకనామములునగు దేవాంతక నరాంతక కాతికాయ త్రిశిర మహోదర మహాపార్శ్వులను రక్షోనాయకు లనంతసైన్యయుక్తంబుగ రణరంగంబున కేతెంచి, వనచరులం గలంచుసమయంబున, మనకథానాయకుండు మహావీరులగు త్రిశిర త్రిదశాంతకులం దలపడి, పాషాణపాదపంబుల నయ్యసురశేఖరుల నొప్పించియు, రథ్యంబులం జంపియు, సారథుల నడంచియు, శస్త్రంబులు విఱిచియు ఘోరంబగు పోరొనరించి, యెంముజూచినం దాననయై వీరవిహారంబు సల్పి, త్రిశిర త్రిదశాంతకులను రావణనందనుల సమరలోకంబున కనిచి, సింహనాదంబుఁ జేయుచు రాఘవసుగ్రీవాదులచే నాలింగితుండయ్యె.

తదనంతరంబున నతిరథశ్రేష్ఠుండగు సౌమిత్రిచేతిశరజాలంబున నతికాయుండు పరమపదంబున కేగినపిదప నమరవైరిశోకంబుపసంహరింపనింద్రజిత్తుఁడు ద్వితీయయుద్ధంబున కేతెంచి యదృశ్యుండై, బ్రహ్మాస్త్రంబున నఖిలవానరవీరులతోడ దశరథాత్మజుల ధరం బడనేయ నందు జతురాననవరకారణంబున, హనుమ ద్విభీషణు లయ్యస్త్రపాతంబుఁ జెందక, జాంబవంతుం బొడగనుకుతూహలంబున నన్నిశాసమయంబున నొక కొఱవిం జేపట్టి, నెమకుచు, నొక్కయెడ నొడ లెఱుంగక పడియున్న పరమేష్ఠినందనుం దిలకించి, సంతసవిచారంబులు పెనఁగొనఁ గైకసీనందనుండు గోత్రనామంబులు సెప్పి, నమస్కరించిన నాలకించి, జాంబవంతుం డుస్సురనుచు నల్లన నిట్లనియె. కైకసీనందనా! మన యాంజనేయుండు బ్రదికియుండెనో, రావణికృతమ

హాస్త్రానలజ్వాలాముఖంబునంబడిమ్రగ్గనో. వినిపింపుమనవుడు విభీషణుండు భల్లూకనాయకునాననంబునం జూడ్కి నిలిపి "అయ్యా! రామలక్ష్మణ సుగ్రీవాంగదాది మహావీరులనేకులుండ, వారలనేమంబరయక నాంజనేయుని కుశలంబడుగుటకుం గతమెయ్యది?" అనిన జాంబవంతుండు.

"చ॥ రజనిచరేంద్రకయ్యమున రావణనందను బాణవృష్టిన
క్కజముగనందఱుం దెగినఁ గ్రమ్మఱఁ బ్రాణము లెత్తునంజనా
త్మజుఁడతఁ డొక్కఁడుం గలుగఁ దక్కిన వీరుల తల్లులెల్లను
ప్రజలు సజీవులు న్మృతులు భానుసుతాదులతండ్రుదప్పినన్॥"

అని పలుక నాంజనేయుండు గోత్రనామంబులు సెప్పి, నమస్కరించిన, నభినందించుచుఁ దన్నుఁ బునర్జీవితుం గాఁదలంచుకొని జాంబవంతుండు.

జాంబవంతుడు హనుమంతుని సంజీవని దేనియోగించుట.

"శా॥ తండ్రింబోలిచరించు నెవ్వఁడు విశుద్ధఖ్యాతివంశోత్తరుం
డండ్రా పుణ్యుఁడు భూతకోటులకు నట్లాధారమై యుండు మీ
తండ్రిం బంకజసంభవాదులు జగత్ప్రాణుండు నాకేమముం
దండ్రీ యెత్తుదుగాక నీవును విభుల్దిక్కెవ్వరిక్కీర్తికిన్॥" 44

ఆంజనేయా! మేఘనాదుని సాయకదళంబుచే నఖిలవానరవీరులతో నరనాథులు రణరంగంబునఁబడిరి. మాపుణ్యవశంబునను జననీజనకుల సుకృతంబునను నీవు జీవించియుండం గంటిని. దివ్యౌషధప్రయోగంబునం దక్క నన్యంబునఁ బడినవారు లేచు నుపాయంబగపడదు. వానిం గొని తెచ్చి, మృతుల



నందఱ నుద్ధరించి కీర్తికాంతం బొంద నీవ యుక్తుండవు. అద్దివ్యౌషధనిలయమార్గం బుపదేశించెద నాకర్ణింపుము. ఈ లవణోదధిం గడచి చక్క నుత్తరాభిముఖంబునం జన నొక్కచో హిమవంతంబు గన్పట్టు. దానిఁ గడచిచనం బహుకూటశోభితంబగు హేమకూటంబు పొడకట్టు; దానికవల ఋషభాచలంబును, దానిం గడవ నద్రిరాజంబగు మేరునగంబును, దానికుత్తరంబునఁ గైలాసంబును, అన్నగంబునకుత్తరోత్తరంబులై నీలశ్వేతకనకాచలంబులును, వాని కావల నుత్తరలవణసముద్రంబును, పిమ్మట శాకద్వీపంబును, దానిం దాఁట క్షీరోదధియుం గలవు. వానిం గడచి యుత్తర తీరంబుం జేర నచ్చోట చంద్రద్రోణంబులనంబరగు గిరిరాజంబులుండు. వాని యామ్యశృంగంబుల నద్దివ్యౌషధంబులు విశల్య సంధాన సావర్ణ్య సంజీవకరణంబులనఁ జతుర్విధంబుల నొప్పుచుండు. అవియుం దెల్లనియాకులును, పచ్చని ఫలంబుల నెఱ్ఱనిపుష్పంబులం గలిగి రాత్రులయం దత్యంత ప్రకాశితంబులై యుండు. అచ్చోటిచ్చటి కేబదిలక్షల యోజనంబులుండు. నీ వనిలజవంబున నేగి భానూదయాత్పూర్వ మిచ్చటికి కవిదేవలయు."

అని చెప్పిన భల్లూకనాయకు వాక్యంబుల కత్యంతము దంబంది, "ఈమాత్రపుగార్యంబున కింత యేల? ఇప్పుడ చని యద్దివ్యౌషధంబులం గొనివత్తు" నని యత్యుత్సాహంబునం బఱచి, సువేలాద్రినధిష్ఠించి, రామకార్యంబు నిర్విఘ్నముగ నెఱవేర్ప నన్నగరాజంబు నాత్మం బ్రార్థించి, వియత్పథచరుండై, భల్లూకాధినాథ నివేదిత మార్గానుసారుండై చనుచు,

మార్గమధ్య గోచరంబులగు హిమాలయాది మహానగంబుల కెఱుఁగుచు, వానియౌన్నత్య సౌందర్యంబుల కచ్చెరువంది మాహాత్మ్యం బభినందించుచుఁ జనిచని, గమ్యస్థానప్రవేశం బొనరించి, దివ్యౌషధాలయ నగంబులం బొడఁగాంచి, గగనమార్గంబున కక్షిగోచరంబులగు పరమౌషధులం గాంచి, పుడమికిడిగ్గి, పరికింప నవి యదృశ్యంబులగుట కాశ్చర్యసంతాపంబులనొంది, కృతాంజలియై యన్నగరాజంబున కిట్లనియె. పర్వతోత్తమా! రాఘవులు రావణిప్రయుక్త బ్రహ్మాస్త్రానలంబునఁ దరుచరావలియుక్తంబుగ విగతజీవులై సమరతలంబునం బడియుండిరి. వారిం దేర్పఁగల భేషజంబులు నీయందుఁ గల్గుటం జేసి మేరు కైలాస ప్రాలేయాద్యద్రిరాజంబుల లెక్కింపక, యింతదవ్వున కేతెంచితి. రావణుఁడు లోకకంటకుండగుట లోకవిదితంబుగదా. అట్టి కట్టిఁడి జెట్టిం దెగటార్ప సమకట్టిన రామమూర్తి యెంత ప్రశంసనీయుఁడో నీవెఱుంగవా? అట్టిమహనీయుని యంగదఁ బాపి సుకృతమందుము. అని ప్రార్థించిన యాంజనేయుని పలుకుల నపహసించి గర్వంబున నప్పర్వతమిట్లనియె. మర్కటాధమా! ఏమీ! మందులా? నీవెవఁడవు? రాముఁడన నెవ్వాఁడు? రాముఁడన నెంత? నాయం దింద్రుఁడు గోప్యపఱిచిన యౌషధంబులు నీకొసంగుట కుమించిన యపరాధమొండుగలదా? నీవన నెంత? మర్కటమాత్రుఁడవు. సహజజాతివైషమ్యంబులగు నిక్కడి శాఖామృగము లవలోకించిన వానివలన నీకేదయిన నంగద జనియించెనేని దొలుత దానిం బాఱఁదోలుట లాఘవముకాదుగదా!



కావున నీవు, శాఖామృగాపేక్షితములగు కాయయో, పండో, మెసవి మెల్లన జారుము. అను పరిహాసవచనంబుల కత్యంత కోపోద్రేకుండై సింహనాదంబుజేసి

~ హనుమంతుడు మొదటిసారి సంజీవని దెచ్చుట. ~

“క॥ ఓరికరినాత్మనన్ను వి
చారింపవు నీవు రామచంద్రు నెఱుఁగక
మేరువవో హిమగిరివో
గౌరీపతినిలయమైన కైలాసమవో॥ 45

క॥ దిట్టతనంబున గర్వ
మ్మిట్లుండగ నిన్నుఁ బెఱికి యేఁగొనిపోదుం
బెట్టుదు రఘుపతిముందటఁ
బెట్టిన నెఱిఁగెదవుగాక ప్రియమున రాముక్ ॥” 46

అని యుదగ్రబాహాదర్పంబున నయ్యద్రిరాజంబుం బొదివిపట్టి, పాదంబులు పుడమినూని, దిక్కులు మ్రోయ హర్యక్షంబుభాతి గర్జించుచు నప్పర్వతంబుం బెకలించి వాలంబునఁ జుట్టి, మూపునం బెట్టి కదలుసమయంబునఁ దొలకరితుషారంబునకు వెలికినిర్గమించు వల్మీకాంతర్గతములైన యుసుళ్ళకరణి నయ్యౌషధంబులం గాచు గంధర్వులు సాయుధులై యాంజనేయునిఁ దలపడి, తద్వాల జనిత జంఝామారుతవేగంబున కోర్వఁజాలక పలాయతులై, పునః పునః పశ్చాద్వీక్షణులగుచు నిజనివాసంబులకరిగి, కవాటంబులు బంధించుకొనిరి. హనుమంతుం డద్దివ్యభేషజంబులు గొని తెచ్చి రామ లక్ష్మణ సుగ్రీవాదుల సేదఁ దీర్చి,

సజీవులఁ జేసి, వారిచే నాలింగితుండై రామచంద్రునాజ్ఞ నయ్యో
ద్రిరాజంబుం గొని చని యథాస్థానంబున నునిచి, మఱలి చను
దెంచి, రామలక్ష్మణ సుగ్రీవాదులకు వందనంబు లొనరించి
సల్లాపంబు సలుపు తఱి నరుణోదయం బయ్యె.

తదుపరి రావణునాజ్ఞం గలనికరుదెంచిన రజనీచరులనే
కులు సుగ్రీవాదులం దలపడి యమసదనంబున కరుగ ననంతరౌ
ద్రంబున నికుంభుండను యాతుధానుం డనిలతనయుం దలపడి
మహాఘోరంబగు పోరొనరించి మృత్యుముఖంబునం బడియె.
పిమ్మట నింద్రజిత్తుండు మఱుమాయను దాశరథుల బలాయను
లం జేయ సమకట్టి, తన మాయచే నొక జానకిని నిర్మించి, వనచ
రార్ణవమధ్యంబునకుం గొని తెచ్చి, వాయునందను సమక్షమం
బున నరదంబుపయి నిలిచి, కైతవజనకజం దలపట్టి యీడ్చి,
ఖడ్గంబునఁ గుత్తుక నుత్తరించి "పవననందనా! ఈ జానకి కతం
బున మాకనేకమైన యిక్కట్టులు సంభవించె. అవి యన్నియు
నేటికిఁ గడముట్టె. జానకీమరణంబు జానకీజాని కెఱింగింపుము.
పొమ్ము" అని దాశకంఠి లంక కరిగె.

పిమ్మట మేఘనాదుని వధాసమయంబున లక్ష్మణునకు
వాహనంబై, యనిలతనయుం డసంఖ్యానీక రాక్షసగణంబున
కకాలమృత్యువై, యనేకవిధంబుల నర్కవంశజుల కృతజ్ఞ
తకుఁ బాత్రుండయ్యె.

**హనుమంతుఁడు రెండవసారి సంజీవిని దేఁబోవుట-కాలనేమివృత్తాంతము.**

తదనంతరము రావణుఁడు మయదత్తం బగు
మహాశక్తిచే మూర్ఛనొందించిన లక్ష్మణునకై వాపోవు



రామచంద్రు నూఱార్చి సుషేణుం డాంజనేయుం దిలకించి,
మున్నతఁడు గొనివచ్చిన సంజీవ సంధాన సౌవర్ణ్య విశల్య
కరణులం దే నియోగించిన నత్యుత్సాహంబున గగనమార్గం
బునం జను మారుతాత్మజుని గతి కవరోధంబు గల్పింపం దల
పెట్టి, రావణప్రేరితుండై యొక్క తపోవనంబు నిర్మించి,
యందు మాయాతపస్వియై యున్న మారీచనందనుండగు
కాలనేమిం గని, మహాతపోధనుండ కాఁ దలంచి, మున్నిమా
ర్గంబునం జనుసమయంబునఁ దానీ యాశ్రమంబుం బొడ
గాననికతంబున మార్గభ్రమణత గల్గెనని భ్రమించి, భూమికి
డిగ్గి మాయాతపస్వి దరిఁ జేరి నమస్కరించి యిట్లనియె.[బయో

"ఉ॥ మారుతసూతి నేను హనుమంతుఁడ రాముఁడు పంపఁగా
వారిధి కేగుచో నొదవె వారిర్యై జలతృష్ణ నాకు నీ
చేరువఁ దోయములలవె చెప్పుము నాపుడు నవ్వి యిట్లనున్
ధీరకమండలూదకము తృష్ణ సనందగఁ ద్రావుమేర్పడన్॥ 47

"అంతియగాక నీవు మదీయ తపోవనజనితఫలామృ
తంబునం దనివొంది, నాకడ నిద్రించి, రేపకడం జననగు మేను
తపోమాహాత్మ్యంబున భూత భవిష్య ద్వర్తమానంబుల
నెఱుంగుదు నెట్లంటివేని రఘుకులచంద్రుండగు రామచం
ద్రుని తరుణిం దస్కరించిన దుర్మదాంధుండగు రావణుం
దెగటార్పఁ బాదోధి బంధించి, వనచరులం గూడి, లంకం జుట్టి
ముట్టి, ఘటకర్ణ మేఘనాదాతికాయాది మహాయోధులం
దెగటార్చిన రాముని కలిగి దశవదనుం డతిఘోరంబగు శక్తిచే
సౌమిత్రిం బడనేయ, నాతని సజీవుం జేయు నౌషధాపేక్షత

నేతెంచితివి. ఏను సామాన్యుల కగోచరుండ. మహాపుణ్యుం
డవగుకతంబున నీకుఁ గోచరుండనైతి. నిన్నత్యంత బలసమే
తుం జేయ సమర్థంబులగు మంత్రంబులుపదేశించెద. నా
యాశ్రమంబునన తదీయౌషధరాజంబులం బొడగాంచనగు.
ఆతురమందకు" మనిన కైతవతపస్వివచనంబులనాకర్ణించి,
మహాబలనందనుండు "మదీయ పాలకుండగు రాఘవునాజ్ఞ
నుల్లంఘించి యేనిట సౌఖ్యంబు లందుచుంట పాడిగాదని
నీవెఱుంగవిది గాకున్న నస్మదీయ పురాకృత పుణ్యాతిరేకం
బునం జనియించిన నవ్యాజానురాగంబుచే నీ వలికిన వాక్యం
బుల కత్యంత ముదంబందితింగాని,

" క॥ కడలేని నీదుకరుణం
గడుపారఁగనీరుఁద్రావికదలెద గడఁకన్
దడవయినఁ బ్రొద్దువోడను
న్నుడియును సౌమిత్రి మఱియుమగుడఁడువిప్రా! 48

కావున నిచ్చటి కనతిదూరంబున వాపీ కూప తటా
కాదులయం దేదేని గలిగినజాడఁ జెప్పుము." అనిన విని య
క్కైతవజటి దరహసితవదనుండై మారుతి నవలోకించి "మదీ
య తపోవనంబునకుం బూర్వభాగంబున నొక్కసరోవరం
బతిరమ్యంబై వెలయు. నీ వందులకేగి నిమీలితనయనుండవై
యమృతతుల్యంబులగు నేతజ్జలంబులఁ గ్రోలి, పిపాసానిర్జితుం
డవు నతిసత్త్వసంపన్నుండవు నై యస్మదీయ నివాసంబున
కేతెంచితేని దివ్యౌషధ సౌలభ్యోపాయం బుపదేశించెద "నని
యాతని కూఱటగా తన కూటశిష్యగణంబుం ద్రోవఁజూపఁ



బనిచిన నమ్మహాబలనందనుండు గరళమిళితంబగు తేనియం
బోలు కాలనేమి వాక్యంబులకలరి శార్దూలగహ్వరంబునకేగు
మృగశాబకంబుచందంబునం జనుచుండ "నీ వీ రీతి మకరీక
బళీకృత కాయుండ వగుదు" వను తెఱంగున నాకస్మికా
యాతమేఘశకలంబుచే శశిబింబంబు గప్పంబడియె. అంత
నతివేగంబున నుద్భూతమైన వాతాతిరేకంబున నయ్యభ్రశ
కలం బుద్ధూతంబగుడుఁ జొక్కపు రజతసళ్ళెరంబుభాతిఁ
దేజరిల్లుచు నిందుబింబంబు బయల్పడ నాతని భావిపమోచ
నంబు సువ్యక్తంబయ్యె. కైతవతాపసుండగు కాలనేమితో
యుద్ధంబుసిద్ధంబనిబోధించుక్రియ మిళిందబృందఝుంకారంబు
లధికంబయ్యె.

కేసరీతనయుం డక్కొలనిదరికరిగి యందు తరుణుల
నయనంబుల సొబగుం గన్పఱచు కైరవములను, పాలిండ్ల
పొందికనగపఱచు చక్రవాకమిథునంబులను, మందగతి యం
దంబుదెల్పు చందంబునను్న యంచగమనంబులును, నేత్ర
పర్వంబుగాఁదిలకించి, యత్యానందనిమగ్నుండై, సరోవరం
బుం బ్రవేశించి, కాలనేమియాజ్ఞానువర్తుండై నేత్రయుగ్మంబు
మూసి, కరకమలంబుల జలమలినంబు నవలంద్రోచి, పుయి
లోడి, దోసిళ్ళం గడుపారజలంబు గ్రోలుతఱి నొక్క మహా
గ్రాహంబు పవననందను పాదంబుఁబట్ట నతఁ డత్యాశ్చర్యం
బునఁ దనవాలంబునఁ దానిదంతంబులూడ్చి, వైనతేయుండు
వాతాశనిం జీల్చుభంగిం దనహస్తయుగ్మంబున నమ్మహామకరి
జిహ్వాంబట్టిపెకలించి, విజృంభింప,

హనుమంతుని మకరిమ్రింగుట, మకరిశాపవిమోచనము, కాలనేమివధ

"చ॥ అదియునునంతఁ బోవక రయంబున గ్రాహిమహాగ్రహం
బునన్
గదలఁగనీక పట్టుకొని భీకరదుస్సహశాపరోగశాం
తిదమగు దివ్యభేషజము తేకువతోఁ గొనుభంగిమ్రింగె దు
ర్మదుఁడగు వాయునందనునమానుషపౌరుషసత్త్వసా
హసున్॥" 49

సీ॥ అది తన్నుమ్రింగుచో నాతఁడిట్లను
నాత్మనేమి సేయుదునింక నెట్టి తెఱఁగొ
జననాథుకార్యంబు చందమింకెట్లొకొ
తెగటాఁగవలసెనో దీనిచేత
వనజాప్తసూనుండు వనచరావలిఁగోడఁ
బొలియునో నాజాడపొలుపు లేక
మేదిఁ దోఁబాయునో మిథిలేంద్రతన
యయు మనువంశకీర్తియు మడియునొకో
తే॥ యనివిచారించి నేర్పుననడరి దీని
కుక్షిలోపల వడిజొచ్చి కూల్తుననుచుఁ
దనువుసన్నముగాఁ జేసి తఱిమి చొచ్చె
నంధకూపములోపల నడఁగునట్లు॥ 50

అమ్మహామకరి, తన కబ్బిన యాహారము కడుపారఁ గల్గెనను యానందంబమితంబుగ ననుభవించుచు జలమధ్యంబున కరిగె.

అంతం బవమానతనయుండు నమ్మహాగ్రాహి గర్భకుహరంబుననుండి చరణ ముష్టి ప్రహారణంబులనొప్పించుచు,



దాని ప్రేవులు నరములు త్రుంచి వదనగహ్వారంబునుండి వెలికిఁద్రోయుచు, మడువెల్ల రక్తమయంబుఁ గావించుచు, సముద్రోదరగతంబగు బడబాగ్ని తెఱంగునను, అమృతప్రవర్ధిత దేహగర్భంబున నున్న హాలాహలంబు చందంబునను, గలంచుచున్న పవననందను హాళాహాళి కోర్వంజాలక, యిది తనకు నఱుగు నాహారంబు గాదని తలంచుచు, దీనం దన మరణంబు సిద్ధంబని చింతిల్లుచు, శోషిల్లుచు, మూర్ఛిల్లుచు, నున్న నమ్మహామకరిం ద్రోచికొని తీరంబునకే తెంచి, దాని యుదరంబు భేదించి రాహువిగళిత సహస్రాంశుంబోలి వెలికిం జనుదెంచి, విజృంభించి నిలిచిన ననిలనందను నేత్రయుగ్మంబు మిఱుమిట్లుగొలుపఁ గాంచనపాంచాలికంబోలు సర్వాంగసుందరియగు నొక్కతరుణి రమణీయ నూపురధ్వనులతోఁ దన కట్టెదుట నిలువం దిలకించి, యాశ్చర్య విభ్రమానందంబులు ముప్పిరిగొన నయ్యువతికిట్లనియె. అమ్మా! నీ వింత దనుక నొక్క మహాగ్రాహివై యిమ్మడువుననుండి యింతలో దివ్యాంగనాకారధారివగుటకుఁ గతం బెఱిఁగింపఁ దగునేని విననపేక్షించి యున్నవాఁడ ననవుడు నయ్యచ్చరలేమ సమీరనందను నవలోకించి మర్కటోత్తమా! నేను ధాన్యమాలిని యను నమరకాంతను. విమానారూఢనై దశదిశలం ద్రిమ్మరుచు నొక్కదివసంబున నిమ్మడువున జలవిహారంబు సలుపు నాకడ కమిత తపోధనుండగు శాండిల్యుం డేతెంచి, మదీయ సౌందర్యంబున కచ్చెరువంది, మదనసాయకపీడితుండై తన మాహాత్మ్యంబు మఱచి, నన్నుం జేరి, తన కోర్కె నీడేర్పఁ

ప్రార్థించిన, నేనును, తపోధను శాపగ్రస్తనగుదునొకో
యను త్రాసంబునఁ దాత్కాలిక నిజ రజస్వలాత్వ కారణ
మెఱుకపఱచి చతుర్థదివసంబున నాతని కోర్కె నీడేర్ప
నియ్యకొని యాతని సమ్మతిపఱచి, గంధమాదనంబున కేగి,
వీణాగానంబు సేయుతఱి, దిగ్విజయార్థంబరిగిన దశకంధరుం
డచ్చటికేతెంచి, యస్మదీయ వీణాగానంబు నాలకించి, నాకడ
కరుదెంచి, మదీయ సంగమంబుఁగోరిన నొడఁబడని నన్నుం జేరి
బలిమింబొందిన, నప్పుడ సద్యోగర్భంబున నవతరించిన యతి
కాయుండను తనూజుం జేకొని యథేచ్ఛం జనియె. అంత వాస
రత్రయావధిగడువ నేను జతుర్థదివసంబున సుస్నాతను సకలా
భరణాలంకృతదేహను నై మదీయ సంగమేచ్ఛం దపంబుడిగి
నా రాకఁ బ్రతీక్షించు శాండిల్యుం జేర, నాతండును నా
యాకారం బుపలక్షించి, నాయుదంతం బెఱింగి, క్రోధ
తామ్రాక్షుండై, యిమ్మడువున ఘోరగ్రాహివై యుండు
మని కరుణారహితాంతఃకరణుండై శపియించి, యంతనిలువక,
తా ననుభవింప నువ్విళ్లూరు సౌఖ్యంబుఁ జూరగొన్న దుర్మ
దాంధుం దలంచి "నిన్ను బలిమింబట్టి భోగించిన దురాత్ముండు
పుత్రమిత్రాదులతో రణరంగంబున శత్రునివహంబుచేఁ
బొలియుంగాక" యనియుం దిట్టె. నేనును సమీరజనిత
వాతవల్లికంబోలి, గజగజవడంకుచు నాతని పాదంబులంబడి,
శాపమోక్షంబుం బ్రసాదింప వేఁడిన, బ్రసన్నాననుండై
"తరుణీ! నా వాక్యం బమోఘంబగుటం జేసి శాపం బనుభ
వింపక తీరదు. అయినను దీర్ఘకాలాతిక్రమణంబున దశరథ



నందనుండగు రామచంద్రుని కార్యార్థమేతెంచిన మహాబల
నందను మహాబలంబున స్వస్వరూపధారిణివై త్రిదశాలయం
బునం ద్రిమ్మర నర్హురాలవగుదు" వని యనుగ్రహించె.
కావున నోమహాత్మా! నీ యనుగ్రహంబున నేటికి నా శాప
దివసంబులు కడముట్టె. నీకాంతరంగికహితంబొక్కటి యుపదే
శించెద. దానిం గైకొమ్ము. ఎద్దియన:—దశకంధరుండు, నీమా
ర్గంబునకవరోధంబుగల్పింప మారీచనందనుం బ్రార్థింప, నాతండు
మార్గమధ్యంబున నిత్తపోవనంబునిర్మించి, మాయాతపస్వియై
యుండి, రావణోపదిష్టిత వచనానుసారుండై నిన్ను నాచే
మడియింపంబూని, యిక్కొలనికనిపె. నీవును దుర్భేద్య
సత్త్వసంపన్నుండవైనకతంబున నన్నుం దెగటార్చి, నాకు
శాపమోక్షంబు గావించితివి. సుకృతంబు సంపాదించితివి.
నీవు మున్ముందు మారీచ నందనుం దెగఁజూడుము. ద్రోణా
ద్రికిదె మార్గము" అని మార్గంబుసూపి యాంజనేయు నాశీర్వ
దించి కార్మెఱుంగుగతి నంతర్హితయయ్యె.

మారుతాత్మజుండు మారీచనందను మాయావనంబున
కేతేర నమ్మాయాతపస్వి, మారుతి నవలోకించి గురుదక్షిణఁ
గోర, నిదె గురుదక్షిణ యని యొక్కముష్టిఘాతం బురంబున
కొసంగె. కాలనేమి కోపాటోపంబున ఖడ్గంబున ననిలతనయు
నేసె. అంతఁ బవమానసూనుం డత్యాగ్రహంబున నసురాధ
ముం బట్టి "నాచేఁజిక్కిన నీ వంతకాలయంబునకుంగాక మఱి
యెటకేఁగఁగల" వని చరణముష్టి ప్రహారంబుల నొప్పింప
దనుజుం డోర్వఁజాలక పక్షిరూపధరుండై నఖ చంచువులం

జీల్చి దేహంబునొప్పించుచు నెఱకల వాతంబుచే వాతాత్మజుఁ బాఱఁదోలఁ గనుకింపుఁడు నమ్మారుతి మహోరగంబుం దుఱుం గలించు వాలపాశంబునం జుట్టి వసుధం గొట్టియు, ముష్టిప్రహారంబుల నొప్పించియు, విగతసత్త్వుం జేయ, నక్తంచరుండు రక్తంబు గ్రక్కుచు, నారూపంబున నిలువంజాలక, హర్యక్షుండై, నఖదంతంబుల నాంజనేయుం జీర నతం డతిరౌద్రంబునఁ దనుజాధము నొప్పింప నోర్వంజాలక మాయచే మోసగింపం దలఁచి సుగ్రీవాకారధరుండై నిలిచి, సామీరిం గని సామంబున నిట్లనియె. మారుతాత్మజా! రఘుకుల శశాంకుండగు రామచంద్రుని యనుజుండు సేదఁదీఱి సుఖంబుననుండె. నీ కీ దైత్యులతోఁ బోరాటమేల? నీ కీ శ్రమయేల? రాఘవుండు రావణ సంహారం బొనరించి ప్రయాణోన్ముఖుండై యుండి, నిన్నుఁ దోడ్కొనితేర బుత్తెంచిన నమ్మహామహుని యానతి నే నిచ్చటికేతెంచితి. వానర రాఘవులు మనరాకకైఁ ప్రతీక్షించుచున్నవారు. ఇఁక నిటఁ దడయనేల? పొలికలనికిం బోవుదము రమ్ము" అనిన వచనంబుల నాకర్ణించి మారుతతనయుండంతరంగంబుననించుక యోచించి "యర్కనందనుండిచ్చటి కేటికేతెంచు? రాఘవుం డింతలో రావణసంహారంబుఁ గావించియుండునా! ఇదియంతయు మారీచనందను మాయగా నుండ నోపు. కామరూపుండగు కతంబున బహురూపంబుల నన్ను మోసగింపం జూచుచున్నవాఁడు" అని యోచించి తపననందనాకారధరుండగుముష్కరరక్కసు నవలోకించి "దురాత్మా! నన్ను వంచింపం బలురూపంబులఁ గైకొనుచున్నవాఁడవు.



ఇదెనిలువు. నీ పీచం బడంచెద"నని యశనిం బోలుముష్టిచే దనుజాధము పేరురముం బొడువ వజ్రపాతంబున వసుధం బ్రదెళ్ళు వసుధాధరంబుచందంబున, వసుధంబడి వదనంబుఁ దెఱచి వనచరాకృతిఁ దిగవిడిచి, రాక్షసాకృతి నవలంబించి, శరాసనంబుఁ గైకొని, శరజాలంబున శర్వాంశసంభవు శరీరంబు శోషింపఁజేయ, మన కథానాయకుం డతిరౌద్రంబున కాలనేమిం బట్టి, కాలం జఱచి, కేలం గీలించి, నేలం గొట్టి మస్తకంబుఁ దునుమఁ గాలునిపట్టణంబున నివసింపం జనియె.

ఇట్లు తపననందనసచివుండు శత్రునిర్మూలనంబుఁ గావించి, గగనంబున కెగసి, ధాన్యమాలిని బోధిత మార్గానుచరుండై, క్షీరసాగరం బుత్తరించి, శ్వేతద్వీపంబు నిర్గమించి, ద్రోణగిరి కరిగి, యందు దేదీప్యమానంబులై తుఱంగలించు నౌషధంబులం బొడఁగని, యమ్మహీధరశృంగంబునకు డిగ్గి, యచ్చట నెమక, యదృశ్యంబులైన యౌషధంబులం బొడఁగన నేరక, తన వేఁడికోలున కియ్యకొని భేషజంబులఁ బొడసూపని భూధరంబునకుం గినిసి, దశయోజనవిస్తారంబును బంచయోజనాయతంబు నగు నమ్మహీధరంబుం బెఱికి, కొని, చనువాఁడై సింహనాదంబుసల్పి, పాదంబులుపుడమినూని పర్వతంబుం బెఱుక.

"చ॥ ఒఱిగె వసుంధరాస్థలి మహోరగనాథుఁడు గుంగెఁ గూర్మముం
దఱిలె నఖంబు మ్రోసె సురదంతులు మ్రొగ్గె దిగంతరంబుల

త్తతఱినదరెన్మరుత్సుతుఁడు దర్పమెలర్పనహార్యముద్ధతిం
బెఱుకఁగ గోత్రశైలములు పెల్లగిలెంగలఁగెంబయోనిధుల్ ॥"

అప్పు డయ్యోషధులంగాచు త్రయోదశకోటిసంఖ్యాకులగు చిత్రసేనాది గంధర్వులు, భిండివాల ముద్గర పరశు కరవాలాద్యాయుధపాణులై "వీఁడు నాఁడు గొనిపోయిన తస్కరుండు; వీనిం బట్టి కొట్టుఁడు. పొడువుఁడు పట్టుఁడు. కట్టుఁడు" అని బెదరించుచు సింహనాదంబులు చేయుచుఁ దలపడినఁ బావని యతిరోషంబున నాగంధర్వ వీరుల వక్షంబులు మోదియు, మర్మంబులు తొలఁగించియుఁ హస్తంబులు విఱిచియు, మూర్ఛలముంచియు బహుభంగులనొప్పింప, వారును వాయునందను విజృంభణంబున కోర్వంజాలక యిమ్మహావానరుండు దుర్భేద్య పరాక్రమ సత్త్వుండని నిశ్చయించి, నిటలఘటితపాణులై "మా యోషధంబు మరల మాకుం జేర్పు"మని మొఱఁబెట్టుచుఁ గోచతనంబునం బలాయితులైరి.

అంతం బవననందనుం డక్కొండం దనవాలపాశంబునం జుట్టి, యాదలధరియించి, డాచేత దానింబట్టి, వియత్పథంబున కెగసి, కేకలిడుచు, మహాసంరంభంబున లంకాభిముఖుండై చనుదెంచుసమయంబున, నందిగ్రామంబున నిద్రించు భరతుం డొక దుస్స్వప్నంబుఁగని, సీతారామలక్ష్మణులు వనవాసంబున కేగి నాఁ డంత్యదినంబుగా జతుర్దశాబ్దంబు లేగినను, వారిజాడ నించుకయు నెఱుంగమికి విచారమునొందుచు, వసుధాసురులంబిలిచి, బయలనిలిచి, యోచించు కైకేయాత్మజునవలోకించి, రాముండని భ్రమసి, యించుకనిలిచి, తెలివొంది,



రామునింబోలు రాజర్షి యని నిశ్చయించి, నిశ్శంకుండై పరతెంచు పవననందనురాక వేగులవారివలన నెఱింగి, రావణుండు పవనునందను గతి కవరోధంబుఁగల్పించి, ద్రోణాద్రిం బయోధిం బడఁ జేయుమని, సురాసురుల కజేయుండును, వైనతేయుం గొట్టిన దిట్టండును, దామోదర తిరస్కార చణ రణ విహారధీరుండునుఁ దనమాతామహుండునగు మాల్యవంతుంబనుప, నాతండును, ఆయుధహస్తుండై, సాగరమధ్యంబున సురవీథిం బరతెంచు సమీరసూనుంగదిసి, యాయుధంబుల నొప్పింప ననిలనందనుం డచలుండై యచలంబుఁ గదలనీక, మాల్యవంతుని పాదంబులఁ దన దక్షిణహస్తంబునంబట్టి, మంచెపై నెక్కి మడికేతెంచు పిట్టలఁబాఱదోలు పొలముకాపుచేతి యొడిసెలంబోలె, గిరగిరం ద్రిప్పివైచిన, బ్రతుకు జీవుఁడా యని మున్నున్న రసాతలమార్గంబు నెమకుచు నచ్చట నివసింపంజనియె.

ఆంజనేయుం డత్యంతసంరంభంబున ద్రోణాద్రింగొనిచనునెడ, నయ్యద్రిప్రభంవిలకించి, యరుణోదయంబని. శంకించి, సౌమిత్రి సజీవుండగుట కల్ల యని తలంచి, వాపోవు రామచంద్రునిమ్రోల నయ్యద్రింబెట్టి, తన్మాహాత్మ్యంబున నాతని యనుంగుసోదరు సజీవుంజేసి, యాతని కత్యంతముదంబుఁగల్పించి, యా పురుషోత్తము ననుగ్రహంబునకును, కపివీరుల స్తోత్రంబులకును బాత్రుండయ్యె. అప్పుడు రఘునందనుం డాంజనేయుందిలకించి మఱల ద్రోణాద్రిం గొని చని యథాస్థానంబున నునిచి రమ్మన నామహాబలనందనుండును వల్లె

యని చనుసమయంబున నంతయు నసురకులసార్వభౌముం డసురులచే విని, స్థూల, జంఘు, మహానాద, మహాదంష్ట్రి, మహాకారస్క, మహావీర్య, చతుర్వక్త్ర, శంఖకర్ణ, హస్తికర్ణ, మేఘవర్ణ, చిత్రాంశులగు సార్థకనామ నక్తంచరయోధులం బిలిచి, వాయునందను నిర్జింపం బుత్తెంచిన, వారును చతురంగబలసమేతులై, దేవాసురరూపంబులం దాల్చి, యద్రిం జుట్టు నీలజీమూతపంక్తిం బోలి యెక్కుమ్మడి దుర్భేద్యపరాక్రముండగు కేసరీతనయుం దలపడి, బవరంబు సలుపం బూననీయు నారాత్రించరులనెల్ల నిమిషమాత్రంబునం దెగటార్చి, వని, ద్రోణశైలంబు యథాస్థానంబున నునిచి, గంధర్వవీరుల స్తోత్రపాఠంబుల నాకర్ణించుచు, మఱలి లంకాభిముఖుండై చనుదెంచి, తన బలగంబుం జేరి, రామలక్ష్మణసుగ్రీవాదులకు నమస్కరించి, వారిచే నాలింగితుండై, తన గమన వృత్తాంతమెల్ల నందఱ కెఱింగించె. ఇంతలో భానుమండలం బుదయగిరి శిఖరి నలంకరించె.

రావణుండు సమరజయకాంక్షితుండై పాతాళహోమం బొనరించు తఱి దానిం జెఱుప మందోదరిం బట్టి తెచ్చిన యంగదునకు మన హనుమంతుండు దక్షిణభుజంబై నిలిచి, రావణుండు తృతీయయుద్ధంబున కించిత్యదానవదళపరివృతుండై చనుదెంచి, వానరసేనం జీకాకునొందించుసమయంబున, హనుమంతుండు సార్థకాభిధానుండగు ఖడ్గరోముం దలపడి, మహాఘోరంబగుపోరొనరించి నద్దోషాచర దేహజనిత రోమఖడ్గంబు లనిలనందనుదేహం బాపాదమస్తకంబుం జీల్ప, తద్గాత్రనిర్గత



రక్తధారలం బాలభానుం బోలియుం జలింపక, మారుతాత్మజుం డయ్యసిరోము పాదంబులొడిసి వలకేలం గీలించి, గిరగిరం ద్రిప్పి, పుడమిం గొట్టి, నక్తంచరు దేహంబు నుగ్గుం జేసి, ప్రతాపంబు మెఱయ విజృంభించి, సింహనాదంబుం జేయుచు తనవారిం జేరి సుఖంబుననుండె.

## ఏడవ ప్రకరణము.

~ హనుమంతుఁడు రాముని విజయము సీతతోఁ జెప్పుట. ~

దశకంధరుండు దశరథనందను బాణజాలంబున కాహుతియై పరమపదంబున కేగిన ననిలజుండు మూర్ధన్యధృతరాఘవానుమతియై యశోకవనంబున కేగి, శింశుపా తరుమూలాసీనయగు జానకింగని, వందనం బొనరించి, యలికస్థలన్యస్త కరుండై నిలిచిన కేసరీతనయుం దిలకించి మహీతనయ యిట్లనియె. "మారుతాత్మజా! పూజ్యంబగు రాజ్యలక్ష్మిం బాసి నైకవరంబున కాననంబున కేతెంచిన కౌసలేయుండును, అగ్రజ సేవా కౌతుకంబున సకలసౌఖ్యదూరుండై యరణ్యంబునకరుదెంచిన ముద్దులమఱందియగు సౌమిత్రియు సుఖంబుననున్నవారె?" అని యడిగిన జానకిం గని భయభక్తి వినయ సంభ్రమోత్సాహంబులు నెమ్మొగంబునం దీపింప రఘునందను పత్నింగని తపననందనసచివుండు "తల్లీ! రామ లక్ష్మణ సుగ్రీ వాదు లత్యంతకుశలురు. స్వర్గమర్త్యపాతాళంబులం గల యఖిలజీవులకు నత్యంతభయదుండగు నక్తంచరచక్రవర్తియు, మహోన్నత

కాయుండు నాతనియనుంగుసోదరుండు నగు ఘటకర్ణుండును, రాఘవాస్త్రానల జ్వాలాముఖ శలభంబులై సమసిరి. అతికాయుండను పౌరుషనామంబునందనరి, సురాసురుల కజేయుండై, దశదిశలం దానయై దారుణ రణకేళులం గడతేరిన దశవదన నందనుండును, మాయాయుద్ధంబులం దత్యంత ప్రవీణుం డన నెగడి నరనాథనందనుల నాగపాశబద్ధులం జేసి విఱ్ఱవీగిన రావణి యగు నింద్రజిత్సార్థకాఖ్యుండగు మేఘనాదుండును సౌమిత్రి శరపరంపరలంబడి ప్రమగ్గిరి. అత్యంత కదనరంగకుశలురు నమితబలులు నగు దోషాచరాధములు భానునందనాది వానరోత్తముల చేతం భానునందన నివాసంబుం జూరఁగొనిరి. ఇత్తెఱంగున రామచంద్రుండు మార్తురం బొరిగొని నిరస్తశత్రుండు, జయశ్రీమోహితుండు నై విభీషణు లంకారాజ్యంబున నభిషిక్తుం జేసి, తన విజయంబు నీకు నివేదింప నన్నుం బుత్తెంచె.

ఉ॥ నీరథిఁగట్టి రామధరణీపతి తమ్ముఁడుఁ దానులంకపై
దారుణకోపుఁడై విడిసి దానవకోటులఁ బఙ్క్తికంఠునిన్
బోరవధించి నిన్నుఁ గొనిపోవఁగలండని మున్న నీకు నే
ధీరతతోడఁ జెప్పిన ప్రతిజ్ఞలు వచ్చెఁ జుమీ మహీసుతా॥"

అనిన నానందాశ్రులు ఱెప్పల నప్పళించుచు మనంబునఁ దననాయకుం దలఁచి యంజనీతనయుం గని యస్మద్వృత్తాంతం బశేషంబు రామచంద్రుఁ డెఱుంగుటయు, సౌమిత్రి పునర్జీవితుండగుటయు, నా యాయుష్కాల మంతమందక నిలుచుటయు, నీమహిమచేత నేకదా, మఱియుఁ బతిహిత ప్రతా



పోపాయ శౌర్య ధైర్య జవ పరాక్రమ వినయ నీతి తేజత్త్వాదులన్నియు నొక్కటఁ గన నెంచిన నీయందకాక వేరొండు చోట గోచరమగుటకల్ల. లోకంబుల నీ కెనయగు మహోపకారు లెందైనంగలరే!

క॥ కపివీర నీవు చేసిన
యుపకారంబునకు సామ్యమొదవంగాఁ బ్ర
త్యుపకృతి సేయఁగఁ దరమే
విపుల త్రిజగత్ప్రదానవిధులును సరియే"॥ 53

అని తన కృతజ్ఞతమెఱయం బలికె.

చదువరులారా! మైథిలీమాటలయం దతిశయోక్తి యొక్కటియైనఁగలదా? అమిత జవ సత్త్వ సంపన్నంబున నీతని కెనయగు వార లేరయినంగలరా? ఈతఁడు జానకి జాడఁగాంచి యితరేతర సమాశ్వాసనంబు గావింపనిచో సీతారాముల జీవంబులు నిలిచియుండునా? లోకకంటకుండగు దశకంధరుండు వీరస్వర్గంబుఁ జూరగొనునా? ఈమహామహుని ధైర్య స్థైర్య గాంభీర్యాదులగుపడఁ జేయనిచో సౌమిత్రి పునర్జీవితుఁడు కాగలఁడా? ఈతని యుపదేశ మంగీకరింపఁడేని రామచంద్రుఁడు విభీషణుని కృతజ్ఞతకుఁ బాత్రుఁడయ్యెడునా? శాశ్వతకీర్తి సంపాదింప శక్యమగునా? ఇం దసత్య మిది యని నిర్ధారణ జేయుఁడు.

ఇట్లయ్యు జానకిపలికిన కృతజ్ఞతావచనంబు లాలించి నిగర్వశిరోమణి యని నెగడఁదగిన పవనతనయుండు.

"శా॥ తల్లీ మీరిటులానతిత్తురె భవద్దాసుండ మీయాజ్ఞఁ
జెల్లింపంగలవాఁడ మీయభిమతశ్రీకింతపాత్రుండను
త్ఫుల్లత్సత్కరుణుండు భూవిభుఁడు నన్బ్రేల్పార మన్నించుచో
దెల్లంబైనబలంబునం బరఁగితిన్ దేశంబునం బేర్చితిన్"॥ 54

అని యుత్తరం బొసంగె. "నిగర్వశిరోమణియెవర" ను పృచ్ఛకునకుఁ దొల్దొల్త యోచనారహితంబుగ "హనుమంతుఁడు" అనియే గదా ప్రత్యుత్తర మీయవలె.

మఱల మరుత్తనయుండు మున్నత్యంతచింతాకులస్వాంతయగు జానకి ననేక తెఱంగుల బాధించిన దానవాంగనలం దెగఁజూచి మైథిలి మఁదల వేఁడిన రోషంబును మహీనందన వాక్యోపసంహారుండై జానకియనుమతిం దాశరథులకడ కరిగి వారికి నాయమ కుశలవార్త నెఱింగించె.

తదనంతరము వైశ్వానరపరిశుద్ధయగు విదేహరాజనందనతోడ నఖిల వానర రాక్షస గణపరివృతులై పుష్పకారోహణంబు గావించి యయోధ్యాభిముఖులై చను రామలక్ష్మణుల పాదపద్మంబులఁ గొలువన మన యాంజనేయుండును వారి పజ్జం జనుచుండె.

~ హనుమంతుఁడు రామునివిజయము భరతునితో చెప్పుట ~

రామచంద్రుండు సకలపరివారసమేతంబుగ భరద్వాజప్రేరితుండై విందారగింప తదాశ్రమంబున విడిసి, తన యాగమనవృత్తాంతంబు గేకయరాజపౌత్రునకుం దెలియఁజేయు తమకంబున నంజనీసూనుం బిలిచి "నీవు నందిగ్రామంబున కరిగి,



నై కేకయాత్మజుం దిలకించి, తదీయేంగితమనోభావచేష్టితవచనంబులెల్ల నెఱింగి, మద్వృత్తాంతంబు నివేదించి రమ్ము. పొమ్ము". అని యానతిచ్చిన నాతండును, కామరూపి యగు కతంబున మానుషరూపధరుండై చని, శృంగిబేరి పురంబుననున్న గుహున కంతయు నెఱింగించి, యాతనిచే నభినందితుండై నందిగ్రామంబున కరిగి, పరమపావన చారిత్రుండగు భరతుం గాంచి మ్రొక్కి నిలిచి దాశరథుల వృత్తాంతంబు వీనులవిందుగా వినిపించిన, భరతుండు నత్యంతసంతుష్ట హృదయుండై చయ్యన నిలిచి వాయునందను గాఢాలింగనంబుఁ జేసికొని, యంతం దనివిసనక గోసహస్రంబును, గ్రామశతంబు నుత్తమతురంగ మత్తదంతావళ సహస్రంబులును, మణిమయ భూరిభూషణాంబరంబులును, రమణీయ లావణ్యాలగు రమణులను, ధనకోట్లను బసదనంబులొసంగ నవియన్నియు నర్థులకొసంగి పరమానందంబు నొందు నాంజనేయుంగని, రాము వనవాసవృత్తాంతంబడిగిన భరతునకిట్లనియె.

అయ్యా! కైకనందనా! రామచంద్రుండు పట్టభద్రవిఘ్నుండై, సోదరకళత్రసహితంబుగ సాకేతంబు దిగవిడిచి, కాననంబుఁ జొచ్చి, విరాధుండను దైత్యాధముం ద్రుంచి, మునిజన నివాసంబుల కరిగి, తత్ప్రార్థనంబున సకల దానవనిర్మూలనశపథుండై, పంచవటిం జేరి, శూర్పణఖ నాసాకర్ణ భగ్నంబు లొనరించి, కైతవ కురంగాకృతిధరుండగు మారీచు వెంటఁజన, రావణాపహృతకళత్రుండై, పలవించుచు నర

ణ్యంబున నెమకుతఱిఁ బ్రాణమాత్రావశిష్టుండై పడియున్న భవజ్జనకుని మిత్రుండగు జటాయువున కతిలోకనివాసంబుఁ గటాక్షించి, కబంధు శాపవిముక్తుం జేసి, తద్వచనానుసారంబుగ ఋశ్యమూకంబున కేతెంచి, రవినందనుతో సఖ్యంబుబఱపి, యాతని యగ్రజుండగు వాలిం దునిమి, కిష్కింధకు భానునందను పట్టభద్రుం జేసి, సీతాన్వేషణంబున కఖిలతరుచరవీరుల నష్టదిక్కులకుం బనుప, నేను సంపాతివచనానుసారినై లంకకరిగి, జానకి నవలోకించి, దాశరథులకుశలం బెఱింగించి, మఱలి రామసుగ్రీవుల సన్నిధికేతెంచి, సీతా కుశలం బెఱింగించి, రావణవధోపాయంబరసి, యఖిలవానర పరివృతుండై పాదోధి పరిసరంబునకేగి, యచ్చటవిడిసి, తల్లంఘనోపాయం బరయుచున్న సమయంబున,

సీ॥ అంత రావణుఁడిగనాడి విభీషణుండ
రక్కసులాధిపునాశ్రయించె
వానరోపేతుఁడై వారాశిబంధించి
వీరుఁడులంకపై విడిసికుంభ
కర్ణాదిదైత్యులకడతేర్చి రావణుఁ
దెగటార్చిజగములఁ దేజమెసఁగ
దైత్యరాజానుజుఁదత్పురాధిపుఁ జేసి
సరసిజగర్భాదిసురలచేతఁ
తే॥ దగినవరములుగొనియట దశరథేశుఁ
గాంచిప్రణమిల్లియగ్నిముఖంబునందు



శుద్ధయగుసీతఁగైకొనిశుభవిమాన
మెక్కి వానరరాక్షసోపేతుఁడగుచు॥ 55

వచ్చి భరద్వాజామంత్రితుండై తదాశ్రమంబున నిలిచి యేతద్వృత్తాంతం బెఱింగింప, నన్ను దేవర సముఖంబున కనిచె. నే నిచ్చటికేతెంచి పౌరులకందఱి కత్యంత ముదంబుఁ గల్పించు. అని విన్నవించిన పావని వాక్యామృతంబుఁ గడుపారఁగ్రోలి భరతుండు ససైన్యంబుగఁ బయనమై రాముని నెదుర్కొని యయోధ్యకుం దోడ్కొనివచ్చి సింహాసనంబుసమర్పించె. రామచంద్రుని యభిషేకోత్సవకాలమున కుదక్పాదోధి కరిగి మన యంజనీసూనుండు తజ్జలంబులం గొనితెచ్చి రామాభిషేకంబున కందిచ్చి, తత్కాలంబున పుడమినందనచే ననర్ఘ్య ముక్తాహారాలంకృతుండై బహూకరింపఁబడియె.

రాముండు పూజ్యంబగు రాజ్యంబును గొని సర్వసమృద్ధుండు చతుష్పద ధర్మయుక్తుండునై బాలమరణరహితంబుగఁ బరిపాలించుచు, నొక్కదివసంబున, నిండు కొలువున్నతఱిఁ బాదోధిఁ బానముఁ జేసిన పావనుండును, వింధ్యాద్రిస్మయభంజనధీరుండును, ఇల్వల వాతాపులను మాయాదానవులం బరిమార్చిన లోకరక్షణుండును, కుంభసంభవుండును, మహాతపోధనార్జితుండు నగు నగస్త్యుండు రామచంద్రునవలోకించి వనచరవీరుల జన్మపరాక్రమాదు లుగ్గడించి యాంజనేయుం గూర్చి యిట్లనియె. [చెఱిం

"మ॥ అకలంకాత్ముఁడపాయశూన్యుఁడఖిలోపాయాధికుండం
గికదా యెవ్వరిలెక్కసేయక లతాంగింజూచిరమ్మంచు ము-

ద్రికయీమారుతిచేతికిచ్చితివి భూరిస్తోత్రపాత్రంబుగా
సకలజ్ఞుండవు రామనీవెఱుఁగవే సామీరిమాహాత్మ్యముల్ ॥

—♦ శ్రీరామాంజనేయులసల్లాపము. రాముఁడు ఆంజనేయునకు వరంబులొసంగుట. ♦—

మఱియు నీతఁడు కదలనికఠినవిగ్రహుఁడని మైనాకుఁడును, వీరశేఖరుఁడని సురసయు, భూరిగాంభీర్యనిధి యని పాథోధియు, దేహదార్ఢ్యంబున మహాబలుం బురుడించు నని లంకిణియు, జీవదాయకుఁడని జనకనందనయు, రాక్షసాంతకుఁడని యక్షుఁడును, నెఱుంగుదురు. అంతియగాక జానకీ మనఃశోకాంధకారము నడంప శాఖామృగాకృతి నవతరించిన సహస్రాంశుం డని చెప్పనొప్పు. రావణోద్యాన తరురాజంబులఁ బడనేయ దేహధారియగు ఝంఝామారుతుం డనఁదగినవాఁడు. సేనానాయకపంచక మంత్రితనూజసప్తకంబులనెడియహార్యములం బగుల్పఁ బ్రాణంబుల ధరియించిన వజ్రాయుధము. దనుజపుంగవుల కకాలమునఁ దోఁచు మృత్యుదేవత. సకల కపిలోచన చకోరములకు శశాంకుండు." అని ప్రశంసించిన కుంభసంభవుని వాక్యామృతంబుఁ గ్రోలియుఁ దనియనిమనంబున రామచంద్రుండు, మునికులశశాంకా! తాము పలికిన వాక్యంబులయం దావంతయు నతిశయోక్తిఁ గానను. నే నీ మారుతాత్మజుఁ డను తెప్పంబడసినభాగ్యంబునఁగదా విపదంబునిధి నిర్గమింపఁ గల్గితిని. ఈతఁడు నిష్కారణభక్తిం జేసి నాకొఱకై యొనరించిన మహాకార్యంబుల కొలఁది నుగ్గడింపఁ జతురాననునకైన నలవిగాదన్న నే నెంతవాఁడ.



ఇంతే కాక యీ సమీరకుమారుండు తేనెలొలుకు తన పలుకులచే జానకీజీవంబునిలిపి, నా మనోవ్యథఁ దీర్చిన పుణ్యపురుషుండు. పరిపంథి యనుంగుసోదరుండగు విభీషణుం జేకొమ్మని బోధించి, న న్నాచంద్రార్కముగ యశోవంతుం జేసిన నీతిశాలి. మయదత్తంబగు రావణామోఘశక్తిచే మడిసిన మత్సహోదరుం బ్రతికించి, మనుప్రవంగడంబు మహీతలంబున నిలిపిన మహాపుణ్యుండు. ఈతఁడు నా కొనరించిన యుపకారంబు లచింత్యములు నమేయములు గాన నెన్నియని వేవేఱఁబరిగణింపఁగల? నేను బంధు మిత్ర భ్రాత జననీ కళత్రాదులంగూడి, మగుడ నీయయోధ్యం జేరి, సకల సుఖంబుల నందుట కీ కేసరీసుతుసాహాయ్యంబకర్జంబనిననుడువులయం దతిశయోక్తి లేదు.

ఇట్లు తన యేలికపొగడ్తంగన్న సచివుం డీచతుర్దశభువనంబుల నద్వితీయుండగు మారుతాత్మజుండు, రామచంద్రు నవలోకించి నిటల ఘటిత కరకమలుండై యాతని ననేక తెఱంగులనుతించి స్వామీ! యెల్లప్పుడును నీ యందు భక్తియుండునట్లును, యీరేడుజగంబుల నీకథ నిలుచునంతకాల మీదేహంబున మదీయ జీవంబునిలిచి యుండునట్లును, వరంబొసంగుము. మఱియు సర్వకాల సర్వావస్థలయందును నీకథలాలించుచు, నీపదపద్మ మృదుభాష విలాస ప్రభావంబు లగ్గించుచు నున్న నే కాక మర్కటాకారజనితునిఁ జిరాయు వేమి యుపయోగను? మఱియు నో రామచంద్రా! నీకథామృ

తమును శ్రోత్రంబులఁ గ్రోలు ధన్యు లమరత్వము నైన నపేక్షింతురా? జననమరణాది దారుణ రుజలం దాఱుదురా?

మ॥ నావిని సంతసించి రఘునాథుఁడు గద్దియడిగ్గి గ్రక్కునం
బావని చేతులం గదియఁబట్టి కవుంగిటనుంచి పల్కెన
న్నీవిపుడిచ్ఛయించినవి యిచ్చితిభూమి గలంతకాలముం
దావక కీర్తి యున్నిలుచుఁ దండ్రి చరింపు చిరాయురున్నతిన్॥

శివ కేశవుల కభేదము. వైకుంఠధాముండగు నారాయణాంశసంభూతుండు శ్రీరాముండు. శర్వాంశ సంజనితుండంజనీతనయుండగు హనుమంతుండు. ఇట్లుండ రూపభేదులై నరవానరాకారంబుల నవనీతలంబున లోకోపకారార్థ ముదయించిన మాత్రంబున, రామాంజనేయుల కభేదము గాక భేద మెట్లు చేకూరు. ఆ కారణంబుననే దశరథనందనజ్యేష్ఠుండు పవననందనుం దిలకించి

మ॥ నినుఁ బూజించునతండు నాహితుఁడగుం నీలోననే నెప్పుడుం
గనిపింతున్ వినిపింతు గచ్చరలు వేడ్కం దత్కథల్ ఖ్యాతితో
మనుమంచుం హనుమంతుఁ బల్కె రఘురామస్వామి సు[గ్రీవబా
యని వైడూర్యపుతాళిఁ గైకొని తదీయగ్రీవనుం చెంగ్రుపన్॥

అని పరమానందంబున నెయ్యంబు మీఱఁ బల్కి తమ యేకత్వమును వెల్లడిఁ జేసి, రామచంద్రుం డేకాదశ సహస్రాబ్దంబు లిల నేలి పరమపదంబున కేగుసమయంబున



మన సమీరకుమారుండు మహీతలంబున నిలిచి దివారాత్రములు తనస్వామిం గొలుచుచుండె.

ఇందునకుఁ దార్కాణంబుగ నిక్కలికాలంబున సయిత మెచ్చట విష్ణ్వాలయముండునో యద్దాని యెట్టయెదుట మున్ముందు మన కథానాయకుండు మనకు నేత్రపర్వంబు గావించుచుండుట మనము నేటికినిఁ గనుచున్నారము.

## * ఎనిమిదవ ప్రకరణము. *

ద్వాపరయుగాంతంబున హస్తినాపుర పరిపాలకుండగు ధృతరాష్ట్రుని తనయులగు దుర్యోధనాది సోదరశతకంబునకును, పాండురాజపుత్రులగు యుధిష్ఠిర భీమార్జున నకుల సహదేవు లను కౌంతేయ మాద్రేయ సోదరపంచకంబుపైఁ గల యీర్ష్యాసూయలచేత, కైతవద్యూతంబున, నింద్రప్రస్థ పాలకుండగు ధర్మనందనునివిభవంబపహరింప నాతండు దారాసోదరయుక్తంబుగ వల్కలాజినంబులు ధరియించి కాననంబునఁ గ్రుమ్మరుచు, నొక్కతఱి గంధమాదనశైలంబున నున్న సమయంబున ద్రుపదనందనేచ్ఛాసిద్ధి చికీర్షువగు వాయునందనుండయిన భీమసేనుండు సౌగంధిక పుష్పాపహరణార్థ మేకతమ చనుచు, గిరిగహ్వరంబులు మార్మ్రోయ శంఖంబుపూరించి సింహనాదంబుఁ జేసె.

~ భీమసేనుఁడు సౌగంధికహరణార్థము పోవుచు హనుమంతుని గాంచి గర్వోక్తులాడుట-భీముని గర్వభంగము ~

తత్కాలంబున నన్నగకందరాంతరాళంబునఁ దన స్వామియగు రామమూర్తిం దలఁచుచు సుఖసుషుప్తి నున్న హనుమంతుం డా నాదంబున కులికిపడి సుషుప్తిం బాసి, తదీయానుజుండగు కౌంతేయు సింహనాదంబుగాఁ గ్రహించి, యత్యంత సంతుష్టమానసంబున భీమసేనునకుఁ దన్నెఱింగింపఁ దలఁచి, గిరిగహ్వరంబు వెలువడి యాతనికి మార్గనిరోధంబుగా వైచిన లాంగూలంబు చాలనంబుఁ జేసి, కైతవనిద్రాపరత్వంబున నిమీలితనేత్రుఁడై యుండె. భీమసేనుండును, ఆంజనేయుని లాంగూలచాలన ధ్వానంబున కడలి పర్వతగుహాలనిర్గమించి పఱచు పలుమెకంబుల నవలోకించి, యత్యాశ్చర్య నిమగ్నుండై చన నొక్కెడ కదళీషండమధ్యంబున నొక్క విశాలశిలాతలంబునశయనించియున్న వృద్ధవానరుండగు పవననందనుం దిలకించి, నిజాగ్రజుండని యెఱుంగక యాతని నిద్రాభంగంబుసేయ నుంకించి, సమీపంబున కేగి, తన సత్వాతిరేకంబెల్ల బయల్పడ సింహనాదంబుఁ జేసె. హనుమంతుం డదివిని మేల్కనిన వానిచందంబున నల్లనల్లన నేత్రంబులు దెఱచి యనాదరంబున మెల్లనఁ గుంతీమధ్యమున కిట్లనియె.

"అయ్యా, మానవోత్తమా! అతి జరారోగ జనితభీతి నలసి సుఖనిద్రం జెందుచుంట నెఱింగియుఁ గరుణారహితాంతఃకరణుండవై యత్యంత మదోద్రిక్తుండవగు కతంబున



నిద్రాభంగంబుఁ గావించితివి. అంతియకాక సర్వభూతదయాస్వరూపంబగు ధర్మమెఱుంగఁ దగిన మానవదేహంబున నవతరించియు, వృద్ధోపసేవ సేయని కతంబున ధర్మవిహీనాంతరంగుండవు, వీతదయుండవు, నై మాబోటి మృగవృద్ధంబుల కడలు గలిగించుటచేత ధర్మమెఱుంగని తిర్యగ్జాతులకంటె నధముండవనఁజను నీవెవ్వండవు? మనుష్యుల కగోచరంబగు నియ్యరణ్యంబున కేతెంచుటకుఁ గతమెయ్యది? సిద్ధగతిలేనివారలకీతెన్ను నరుగ నశక్యంబు. అమృతతుల్యంబులగు నిచ్చటి పాదపఫలంబులు మెసవి క్రమ్మఱి యథాస్థానంబున కరుగ మఱలుము. నీయందు బద్ధసఖ్యుండనగుటం జేసి చెప్పిన నాపలుకులంగైకొనుము." అనిన కేసరితనయునకు యుధిష్ఠిరావరజుం డిట్లనియె. కపివరేణ్యా! నేనుత్తమ క్షత్రియ వంశజాతుండ. ప్రసిద్ధ బలపరాక్రమసమన్వితుండ. వాయువరంబునఁ గుంతీగర్భంబున జనియించిన పాండురాజునకు ద్వితీయతనయుండ. భీమసేనాహ్వయంబునఁ భూజనులచేఁ బిలువఁబడువాఁడ. నే నీ తెన్నున నొక్క కార్యార్థమై యేగుచున్నవాఁడ. నాగతి కవరోధముఁ గల్పింపక దెఱువొసంగుము. అట్లు సేయవైతేని, మదీయ జ్యేష్ఠభ్రాతయగు హనుమంతుండు, తొల్లి శతయోజనవిస్తీర్ణంబగు శరనిధి నతిలాఘవంబున లంఘించిన తెఱంగున, నిన్ను, నీపర్వతంబు, లంఘించి పోయెద. బుద్ధిమంతుండవై మార్గావరోధంబు మానుము. నాచే పరాభవింపఁబడకుము." అను పాండునందను బెదరింపుల కులుకక మనకథానాయకుం డల్లన ననిలనందను నవలోకించి

యెఱుఁగనివానిచందంబున “పాండవోత్తమా! హనుమంతుఁ డన నెవ్వఁడు? సాగరలంఘనంబునకుఁ గతమెయ్యది? ఇక్కథ నెఱుంగుదేని మదీయ శ్రోత్రపర్వంబుఁ గావింపుము” అనిన నాంజనేయునకుఁ బార్థుం డిట్లనియె.

తొల్లి త్రేతాయుగంబున నయోధ్యానగరనివసితుండై కోసలదేశంబుఁ బరిపాలించు దశరథుండనునరనాథున కగ్రమహిషియం దుద్భవించిన రామచంద్రుండను మహావీరుండు, కైకవరంబునఁ బితృవాక్యపరిపాలనాంతఃకరణుండై జటివేషం బుధరించి, పీటిం దిగవిడిచి, సోదరకళత్రసహితుండై, దండకారణ్యాంతర్గత జనస్థానంబునఁ ద్రిమ్మరుచుండ నొక్కదివసంబున రావణుండను రక్కసులఱేడు, రామలక్ష్మణ రహితంబగు తత్పర్ణశాలకేతెంచి, యేకాకిని యగు జనకతనయం దస్కరించికొనిచని తన నగరంబుననునిచె. అంతం దాశరథులు తపననందనుతో సఖ్యం బాచరించి, జానకి నన్వేషింపఁ బంపిన తరుచరవీరులలో, మదీయజ్యేష్ఠసహోదరుండగు హనుమంతుండు జటాయువున కగ్రజుండగు సంపాతిచే బోధితంబగు మార్గంబు ననువర్తించి, శతయోజనవిస్తారంబగు శరనిధి నవలీలం గడచి, లంకం బ్రవేశించి, సీతంగని స్వామికార్యధురంధరుండన నెగడె నని వింటిని. నేనును హనుమంతునంత జవసత్త్వసంపన్నుండ. నాపరాక్రమం బగపఱుపుమనియెదవా?” అనిన భీమసేనుపలుకుల నాలకించి యవ్యక్తహాసవదనుండగుచు నాంజనేయుండు “పాండవోత్తమా! నేను వృద్ధమర్కటుఁడను. లేవఁజాల. నీ కిటు బోఁదలంపుఁగలదేని నా వాలం



బుఁద్రోచిపుచ్చి పొమ్ము” అనిన భీముం డవ్యక్తాట్టహాసంబుఁ జేసి యాతని వాలంబుఁ దనవామకరంబున నెత్తం గమకింప నించుకంతయుఁ గదలకున్నం గినిసి యాడుగఱచి, విజృంభించి మగుడ హస్తయుగ్మంబునం దన సహజసత్త్వం బెల్ల బయల్పడ నవ్వాలంబు బిగియంబట్టి, కదల్పనుంకించి, లేశంబును గదల్పఁజాలక, సర్వాంగ ఘర్మకణుండై మొగ్గతిలంబడి, ముఖంబు మహీతలంబునమోదుకొనిన నత్యంత లజ్జాభరంబున వివర్ణవదనుండై, శిరంబు నెత్తఁజాలక యవనతముఖుండై విషాదసాగరంబున మునింగి, స్మయవిసర్జితుండై, యెట్టకేలకు నించుక శిరంబు నెత్తి వాయునందన వదనాంబుజేక్షణుండు, కృతప్రణాముండు, కరఘటితఫాలభాగుండు నై “స్వామీ! జ్ఞానశూన్యుండనగుకతంబున నిన్నెఱుంగక నాపలికిన స్మయకలితోక్తులు సహింపుము. నీవు శాఖామృగదేహంబున జనియించిన సిద్ధుండవో, గంధర్వుండవో, అంతకఘకంబగుతపంబున నవనీతలంబున నవతరించిన యేమహానీయుండవో, నాకెఱింగించి కృతార్థుం జేయు”మని ప్రార్థించిన హనుమంతుఁడు భీమసేను నవలోకించి నగుచు నిట్లనియె. కుంతీనందనా! నేనంజన యను మర్కటాంగనకు వాయుదేవు ననుగ్రహంబునఁ గేసరికి క్షేత్రజుండనై జనియించితి, హనుమన్నామధేయంబున నెగడుచున్నాఁడ. నీవు నా యనుజుండవు. తొల్లి త్రేతాయుగంబున రఘుకులదీపకుండగు రామదేవుండు రావణాపహృతభార్యుండై, తపననందనుండగు సుగ్రీవునితో సఖ్యం బాచరించి, యాతని యభిమతంబుఁదీర్చి యవ్వానరసార్వభౌము ననుజ్ఞ

నసంఖ్యానీక వనచరదళ సాహాయ్యంబునఁ బారావారంబు బంధించి, లంకం జొచ్చి, యనేక దానవసహితంబుగఁ బవరంబునఁ బంక్తిగ్రీవుం బరిమార్చి, యందు నాకెలసమున కత్యంత సంతుష్టాంతరంగుండై

మధ్యాక్కర— అ॥ నరసురస్తుత్యమై యెంతకాలంబు - నాకీర్తినిలుచు
నిరతంబుగా నంతకాలమున్నిఁవు - నిత్యుండవగుచు
బరఁగుమని వరముఁ దగదయం జేసి - ప్రభుఁడుర్వియెల్ల
సరిపదునొక్కండు వేలయేండ్లేలి - చనియెనుదివికి॥" 59

అనిన విని భీమసేనుం డతనిఁ దన యగ్రజుండగు హనుమంతుండని యెఱింగి యత్యంతముదంబున రోమహర్షుండై యానందాశ్రువు లక్షికమలంబుల కవరోధంబుఁ గల్పింప సర్వాంగాలింగితధరణీతలప్రణతుండై, నిలిచి, కరంబులుఁ జోడించి, వినయభయసంభ్రమంబులు ముప్పిరిఁగొన, నాంజనేయుంగని "అన్నా, ఆంజనేయా! భవద్దర్శనంబునం గృతార్థుండ నైతి. నాయందుఁ గరుణాపూరితాంతఃకరణుండ

~ భీముఁడు హనుమంతుని పూర్వరూపము జూడఁగోరుట. ~

చతుర్యుగధర్మములు.

వై తేని మున్ను లవణోదధి లంఘించిననాటి నీ యాకారంబు నగపఱచి కృతార్థుం జేయుము" అనిన వృకోదరుంగని హనుమంతుండు,

"క॥ అక్కాలంబున రూపం
బిక్కాలమునందు జూపనెట్లగుఁ గాలం
బొక్కవిధంబున నుండక
వెక్కువిధంబులను వచ్చుభిన్నావస్థ॥ 60



అదికారణంబుగా కృత త్రేతా ద్వాపర కలియుగంబుల సంఖ్య భేదంబై యందుల చరాచరభూతప్రకారంబులు భిన్నభావంబులై వర్తిల్లు" ననినవిని పాండవుండు తన యగ్రజు నవలోకించి యయ్యాయుగంబుల యాచారవర్తనంబులు వర్ణాశ్రమధర్మంబులు నాకేర్పడఁ జెప్పవే యని ప్రార్థించిన సోదరునకు హనుమంతుండిట్లనియె. సహోదరా! కృతయుగంబునందుఁ గృతమకాని కర్తవ్యంబు నడుచు. ధర్మంబు నాలుగు పాదంబులుఁ గలిగియుండు. ఆయుగంబున నారాయణుండు శ్వేతవర్ణశరీరుండై ప్రకాశించుచుఁ బ్రజలం గాచుచుండు. మఱియు నయ్యుగంబు సనాతనధర్మసనాథంబు; అందుల బ్రాహ్మ క్షత్రియ వైశ్య లేకవేద క్రియా యోగ సంయోగంబునఁ బుణ్యలోకంబు వడయుదురు. అదియునుంగాక నయ్యుగంబున నసూయాభిచార దర్ప కార్పణ్య పైశున్య విగ్రహ క్రోధ మద మత్సర భయ సంతాప వ్యాధి ప్రజాక్షయంబులు లేక పదియేడులక్షల యిరువదియెనిమిది వేల సంవత్సరంబులై యుండు. మఱియుం బండ్రెండులక్షల తొంబదియాఱువేల హాయనంబుల పరిమితిగల త్రేతాయుగంబునందు ధర్మంబు పాదత్రయంబై వర్తిల్లు. అక్కాలంబున జనులు నిత్యసత్యవ్రతులై యజ్ఞ తపో దానాది క్రియలం బ్రవర్తింతురు. మఱియు నాయుగంబున విష్ణుభట్టారకుండు రక్తవర్ణగాత్రుండై ప్రజారక్షణంబు సేయుచుండు. అది చన నెనిమిదిలక్షల చతుర్వింశతిసహ

ప్రాబ్ద పరిమితిగల ద్వాపరయుగంబు ప్రవేశించు. ఆయుగంబున ధర్మంబు పాదద్వయంబై యుండు. విష్ణుండు కృష్ణదేహుండై జనలోకంబుఁగాచుచుండు. వేదంబు చతుర్విధంబుల విభజింపఁబడు. ధర్మకామములు వేదశాస్త్రార్థచోదితంబులై ప్రవర్తిల్లు. జనులు సత్యాశమహీనులు కామకర్ములు నై యనేకసుఖంబులాచరింతురు. దాని యనంతరంబు కలియుగంబు ప్రవేశించు. అది చతుర్లక్ష ద్వాత్రింశత్సహస్ర వర్షప్రమాణంబు. అందు ధర్మం బేకపాద మాత్రావశిష్టంబై యుండు. జను లధర్మపరులు తమోగుణయుక్తులు నై కామక్రోధాదులం దమ్మెఱుంగక యధర్మవర్తనులగుదురు. అయ్యుగంబునం జేసిన తపో దాన ధర్మంబు లత్యంత ఫలప్రదంబులై యుండు. అందు పరమేశ్వరుండు పీతవర్ణశరీరుండై జగంబులం గాచుచుండు. అని మఱియు సంక్షేపంబుగా వర్ణాశ్రమాచారంబు లెఱింగించువాఁడై యాంజనేయుండిట్లనియె.

### ~ వర్ణాశ్రమ ధర్మములు. ~

భీమసేనా! లోకంబున జనులు బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రులను నాలుగువర్ణంబులు గలిగియుందురు. అందు బ్రాహ్మణులు ప్రజాపతిముఖంబునంజనియించిరి. యజన యాజనాధ్యయన దాన ప్రతిగ్రహ ప్రశాంతి తప స్సత్య శౌచంబులును, అగ్నికార్య శూద్రాన్నవర్జన నిజదారసంగమ నియమంబులును, యిరుప్రొద్దుగుడుపును, అహింసయు, గృహపరిశుద్ధియు అతిథిప్రియత్వంబును, మహీసురధర్మంబులు. ఆపదలం దక్క



సస్యంబున బ్రాహ్మణుండు బేహారంబు జరుపంజనదు. అంతియ కాక భూదేవులు తపంబునకు సాధనము, ధర్మమునకు మూలము.

చతుర్ముఖ బాహుజనితులగు క్షత్రియులకు విప్రసంరక్షణయ ముఖ్యకర్తవ్యము. వారి నత్యంతసౌఖ్యంబున నుండునట్లు గాపాడుచుంట భూనాధున కత్యంతశుభప్రదంబు; మఱియు అధ్యయన యజన దాన సాధుపోషణము లొనరించుచు, దుర్జనులదండించుచు, ధైర్యముగలిగియుండుటయు నృపధర్మములు. ఇంతియకాక రాష్ట్రంబునఁ బండిన పంటయం దాఱవపాలు ప్రజలవలని పన్నుగాఁగైకొనుచు, నిష్పక్షపాతాంతఃకరణుండై ప్రజావిజ్ఞాపనములాలకించుచు, జనానురంజకుండై రాజ్యపాలనం బొనరించుట రాజధర్మము. మఱియు నీ క్షత్రధర్మంబులన్నిట జన్యం బత్యుత్తమము.

వ్యవసాయము, పసులనభివృద్ధినొందించుటయు పలుదెఱంగులగు వాణిజ్యమును, హిరణ్యగర్భుని యూరువులందుద్భవించిన వైశ్యుల కర్హకృత్యములు. దానంజేసి వైశ్యులు లోకవర్తనంబులకెల్ల నత్యంతోపకారులు. అయినను వారికి తిల రస గంధ విక్రయ మత్యంత నింద్యము. మఱియు యజనాధ్యయనదానంబులును అతిథిసత్కారంబును, విహిత కర్మంబులు.

పైఁజెప్పంబడిన జాతిత్రయంబునకు శుశ్రూషఁజేయుచు విప్రవందనాహింసాపినయంబులు గలిగి యుంట పితామహు పాదకమలంబుల జనియించిన శూద్రున కుత్తమ

ధర్మంబులు. దానపరతం దక్క నృపునానతిం బడయక శూద్రుండు ధనధాన్యంబులు సేకరింపంజనదు. భీమసేనా! ఇవి వర్ణధర్మప్రకారంబు. ఇఁక నాశ్రమధర్మంబు లెఱిఁగించెద నాలకింపుము.

ఆశ్రమంబులు బ్రహ్మచర్య గార్హస్థ్య వానప్రస్థ సన్యాసంబు లని చతుర్విధంబులు. అందు బ్రహ్మచారికి గురుశుశ్రూషయు, వేదాధ్యయనమును, గోష్ఠీనిరాసంబును, ఆత్మహత్యఁ జేసికొనఁదలంపకుండుటయు, భిక్షోపజీవనంబును, షట్కర్మంబులం దత్యంత రాగద్వేష రాహిత్యంబును, అర్హకృత్యంబులు.

ఋతుకాలంబున స్వభార్యాసంగమైకతృప్తియు, సర్వభూతదయాళుత్వమును, సూనృతవాక్యపరిపాలనంబును శాంతచిత్తతయు, సజ్జనస్నేహంబును, దేవపిత్రతిథిపూజనంబును, వైశ్వానరార్చితుఁడై యాతపిఁ దనివొందించుటయు, సకలాశ్రమస్థుల మిగులఁ బ్రీతితోఁ బ్రోచుటయు, *పంచమహాయజ్ఞంబులఁ జేయుటయు, గృహస్థునకు వలయుధర్మంబులు. సకలాశ్రమస్థులకును గృహస్థుఁ డాధారుండు.

గృహస్థాశ్రమంబునం దనిసిన మనుజుఁడు దారాయుతుండుగనో యేకాకిగనో వల్కలాజినధరుండై మానాహంకారంబులు విడిచి, యింద్రియంబుల జయించి, సాంద్రారణ్యంబున కేఁగి, మునిగణోపేతుండై సద్గోష్ఠిం దివసంబులు గడుపుచు,

* పంచమహాయజ్ఞములు. వేదాధ్యయనము, అగ్నిహోత్రము, అతిథిపూజ, తర్పణము, వైశ్వదేవము,



బ్రహ్మచర్యవ్రతనిష్ఠుండై మెలంగుట వానప్రస్థాశ్రమ ధర్మంబులు.

మఱియుం బరివ్రాజకుండు శిఖా యజ్ఞోపవీత భోగవర్జితుండు, కాషాయాంబర దండ కమండల ధరుండు, శాంతిదాంతి యుతుండు, వేదాంతశాస్త్ర విచారణుండు, భిక్షాశనుండు, స్వదేశవిముఖుండు, భూతల శయనుండు, సర్వభూతదయాళుండు నై మెలంగవలయు.

భీమసేనా! ఇప్పుడు నీకెఱింగించిన చతురాశ్రమస్వీకారార్హుండు బ్రాహ్మణుండకాని తదితరుండు కాఁడు. క్షత్రియవైశ్యు లంతఃకరణపరిశుద్ధులై పృథ్వీసురుల నారాధించుటయే వారికి ముఖ్యమగు నాశ్రమము. శూద్రుండు ద్విజశుశ్రూషాపరుండై రాజానుమతంబున వానప్రస్థుండు గాఁజనుఁ గాని యత్యాశ్రమ స్వీకారంబు సేయంజనదు. అని చెప్పి నీ కిష్టావాప్తి యగు నరుగుమనిన హనుమంతు నవలోకించి భీమసేనుండు "కపివరేణ్యా! నీ పూర్వాకారంబుపలక్షింప నువ్విళ్లూరుచున్నవాఁడ. అయ్యాకారంబుఁ జూచినంగాని యన్యాలఁ బోనోప. కావున నాయభిమతం బీడేర్పు" మనిన వేఁడికోలున కియ్యకొని హనుమంతుం డతులితంబైన

—♦ హనుమంతుఁడు తనపూర్వరూపముజూపుట. ♦—

ద్వితీయ కాంచననగంబనఁ భ్రమించుపగిది గాత్రాభివృద్ధినొందించి, దిగంతము లందుచున్న వాలంబుతో విజృంభించి యుండ నా శాఖామృగశేఖరునవలోకించి కుంతీనందనుం

డత్యంత భయ సంభ్రమ విస్మయంబుల నభయంకరాకృతి నవలోకింపనోడి నిమీలితాక్షుండై హనుమంతునితో నిట్లనియె. ఓహో చాలుంజాలు. అతిభయంకరము నత్యద్భుతము నై దశదిశలనావరించిన నీరూపం బుపలక్షింపఁజాల. స్వామీ! పరమదయాంతరంగుఁడవై నీయాకారంబుపసంహరింపుము. అనిన దరహసితవదనుండగుచు వృకోదరుంగని, మార్తుర మార్కొను తరుణంబున నా యాకారం బింతకు నినుమడుంగు లగునని తన మహోన్నతాకారం బుపసంహరించి, యెప్పటిరూపంబుఁగైకొనినం గని పాండునందనుండు,

"ఉ॥ ఉన్నతిఁబూనినీవుబలియుండగు రావణు నశ్రమంబునన్
బన్నగఁజంపనోపుపటు బాహుబలాఢ్యుఁడవిట్టియున్న తు
న్నిన్ను సహాయుగాబడసినిర్మలకీర్తియుతుండు రాఘవుం
డన్నరభోజనాన్వయము నాజివధించుట కేమిచోద్యమో॥"

అనిన భీముని కతిప్రీతుండై యంజనీనందనుండిట్లనియె. పాండునందనా! అమరోపయోగియైన సౌగంధికసరోవరంబసురేశసురక్షితంబు. దేవతలు బలి హోమ ప్రణతుల భక్తి సాధ్యులగుదురు, కాని సాహసక్రియాసాధ్యులు కారు. కావున నీవందులకేగెదేని పరధర్మంబు లెఱింగి నిజధర్మ నిష్ఠితుండవై సాహసంబు సేయకుండుము. ఎందేని నల్పజ్ఞులు విమోహితులగుదురు. నీవు ధర్మాధర్మవివేకులగు శాస్త్రజ్ఞుల నుపాసించి వాని నెఱుంగుము. మఱియు ధర్మంబు శీలజనితంబు. అట్టిధర్మంబువలన నిగమప్రతిష్ఠయగు. దానంజేసి మఖంబులు ప్రవర్తిల్లు. యజ్ఞంబులవలన విబుధులు సంతుష్టి



నొందుదురు. కావున నిన్నిటికి మూలమగు నాచారంబు నడిపి శుభాచారుండవు గమ్ము. బుద్ధిమంతుఁడగువాఁడు దేశకాలంబులనెఱింగి సాహసవర్జితుండై నిరంతరము సామ దాన భేద దండోపాయంబుల యుక్తంబగుదాని నుపయోగించి సఫలీకృత కార్యుండగు. అంతియకాక సమస్తకార్యంబులు, మంత్రమూలంబు. కాఁబట్టి విద్వాంసులై ప్రబుద్ధులగు వారలతో మత్రంబుసేయవలయు; బాలకులతోడనధికశ్రీదర్పితులై హీనబలులైన యల్పులతోడను మంత్రంబుసేయంజనదు. జనులు నిగ్రహానుగ్రహ సమర్థుండగు రాజాజ్ఞాతిక్రమణభీతిం జేసి వారివారికృత్యముల నొకప్పుడును విడువరు. నీవును నిగ్రహానుగ్రహసమర్థుండవగుకతంబున నీకెల్లరు వశ్యులగుదురు. నిన్నుఁ గనుగొన్నందున నా నయనంబులు సఫలతనొందె. నీ యభీప్సితంబు నెఱవేర్చెద. ఎట్లన:— భీమసేనా! చిరకాలము నుండియు మీ కనేకమైన యిక్కట్టులఁగలిగించుచున్న ధార్తరాష్ట్రసోదరశతకంబును, సహచరయుక్తంబుగ నాహవముఖంబున నొక్కక్షణంబునఁ దెగటార్చి సంయమనీనగరంబున కనిచి మీకు మేలొనరించెద. అనిన కపివీరు నీక్షించి భీమసేనుండు "శాఖామృగశేఖరా! నీ కిప్పని యన నెంత? నా యందు నీకుఁ గల ప్రేమాతిశయంబున కత్యంత సంతుష్టమనస్కుండనైతి. మాపరిపంథిబలంబున మమ్ము నిర్జించువాఁడు లేఁడు. నీ కటాక్షవీక్షణముండినఁ జాలును. అందఱి మేము నిర్జింపఁజాలుదుము." అనిన వృకోదరుం గని హనుమంతుఁడు "ప్రియసోదరా! నన్ను రణరంగంబునఁ దలంచితేని నీయం

డుఁగల సౌహార్దభావంబున నతిరథోత్తముఁడగు సవ్యసాచి కేతనంబున నిలిచి మీబలపరాక్రమంబుల నవలోకించి యానందింతు." నని భీమసేను నాలింగనముజేసికొని యాతనికి సౌగంధికసరోవరమార్గంబుఁ జూపి యంతర్హితుండయ్యె.

భీమసేనుండును దదాలింగితశరీరుండగుకారణంబున శ్రమపరిహారుండును విపుల జవశక్తిసంపన్నుండు నయి యాంజనేయుం దలంచుచు నాతని యాశీర్వచనఫలంబున నిర్విఘ్నంబుగ సౌగంధికసరోవరంబున కరిగి, యచ్చటి యక్షరాక్షసగణంబుల నిర్జించి, యందు కుసుమాపహరణం బొనరించి ద్రుపదాత్మజ కొసంగి కృతకార్యుండయ్యె.

కావున నో విద్యార్థులారా! మనకథానాయకుండగు హనుమంతుని చరిత్రంబుఁ జదువు పామరులకేని శౌర్యధైర్యాది గుణయుక్తియు, గురుదేవాదిభక్తియు, స్వామ్యనురక్తియు, కార్యనిర్వహణశక్తియు, నలవడి సుకృతంబును సుసాధ్యంబైయుండుననఁ బ్రాజ్ఞులమాట వేఱె చెప్పనేల?

గద్య:—ఇది శ్రీమచ్ఛిష్టాన్వయక్షీరోదధిశశాంక వేంకటరమణ
యజ్వపౌత్ర వేదవిద్యాపవిత్ర నరసింహావధానిపుత్ర
బుధవిధేయ వేంకటసుబ్రహ్మణ్య నామధేయ
ప్రణీతంబైన హనుమజ్జీవితంబను
వచనకావ్యము సంపూర్ణము.
ఓంతత్సత్
శ్రీరామచంద్రార్పణమస్తు.

# ఇందలి పద్యములకు లఘుటీక.

1. లలితము = మనోజ్ఞము. సౌదామిని = మెఱపు. తులితము = సమానము. అంబుజము = తామరపువ్వు. ఆస్యము=ముఖము. భాసురము= ప్రకాశించునది. కపోలము = చెక్కిలి. పిశంగము = కపిలవర్ణము. మంజువు = మనోజ్ఞము. రుచి = కాంతి. పుంజి = సమూహము. హొన్ను = బంగారము. ముంజి = ముంజ. వాసవుఁడు=ఇంద్రుఁడు. నేత్రము=కన్ను. 2 యాజకులు=యజ్ఞము చేయించువారు. వహ్ని=అగ్నిహోత్రము. హవ్యము=హోమముచేయు అన్నము మొదలయినవి. తోయము=ఉదకము. ముఖ=మొదలయిన. ఉర్వి = భూమి. భానుమండలము = సూర్యబింబము. బాహ్యము=బయట. అభ్యంతరము=లోపల. 3. వజ్రి=ఇంద్రుఁడు. శతారము=వజ్రాయుధము. హనువు = చెక్కిలిమీది భాగము. 4. ఆకృతి — ఆకారము. ఊర్ధ్వకర్పరము=ఆకాశము. 5. నీరేయహబంధుఁడు = నీటిలోఁబుట్టిన కమలములకు స్నేహితుఁడగు సూర్యుఁడు. తేరు=రథము. వడి= తొందర. శ్రుతులు=వేదములు. పఠించుట=చదువుట. పరిజ్ఞానము=అధికమగు తెలివి. చండాంశుఁడు = సూర్యుఁడు. ఉప్పొంగుట=మిక్కిలిసంతోషించుట. 6. వడుగు=బ్రహ్మచారి. ధర = భూమి. నిరశనుఁడు=ఆహారము లేనివాఁడు. నింగి=ఆకాశము. 7. శాసించు=శిక్షించు. సద్బుద్ధి = మంచిబుద్ధి. భూతి = ఐశ్వర్యము. 9. ప్రేక్షణము = నేత్రము. ఆతతము=విశాలమైనది. భూరి=విస్తారమైనది. స్కంధము=నడుము. పురుషసింహుఁడు=పురుషశ్రేష్ఠుఁడు. 10. ఆదట=తర్వాత. మారుతపుత్రుఁడు= హనుమంతుఁడు. 11. మానుగ = చక్కఁగా. పుత్తెంచుట=పంపుట. 13. క్షోణి=భూమి. జ=పుట్టిన. జగత్ప్రాణుఁడు = వాయుదేవుఁడు 14. అరుదు=ఆశ్చర్యము. యోజనము = ఆమడ. (ఇప్పటికాలపుముప్పది మైళ్ళు) ధరణి = భూమి. పుష్కరము = ఆకాశము. దంభోళి = వజ్రాయుధము. వీర్యము=ప్రభావము. కరయుగ్మము=రెండుచేతులు. సత్వరము =

మిక్కిలి తొందర. 15. శరనిధి = సముద్రము. భుజంగము = పాము. ఉరుగతి = తొందర. ఉరువడి = తొందర. మహీజ = సీత. 16 ఘన = గొప్పది. సాల = ఇల్లు, ప్రాకారము, కోట మొదలైనవి. సౌధము = మేడ. కూటము = శిఖరము (లేక) సమూహము. ప్రాసాదము = దేవాలయము. ఆపణము—అంగడి. వాపి = కోనేరు. కూపము = బావి. వేడ్క = సంతోషము. 17. అలిగి = కోపించి. భావించుట = తలంచుట. పౌలస్త్యుఁడు = రావణుఁడు. అంభోనిధి = సముద్రము. స్రగ్గుట = చచ్చుట. ఎడగా = దూరముగా. 18. వనధి = సముద్రము. కనలి = కోపించి సమయుట = చచ్చుట. 19. రామా = స్త్రీ. నరేంద్రుఁడు = రాజు. ఎనఁగ = సమానము 21. కోదండము = విల్లు. విఖండనుఁడు = విఱిచినవాఁడు. క్ష్మాధీశుఁడు = రాజు. జామాత = అల్లుఁడు. భాస్కరుఁడు = సూర్యుఁడు. అహితుఁడు = శత్రువు. అసురుఁడు = రాక్షసుఁడు. సంహారి = చంపినవాఁడు. కాలుఁడు = యముఁడు (చంపువాఁడు) ప్రమద = స్త్రీ. పరాఙ్ముఖుఁడు = ఇష్టములేనివాఁడు. 22. నిరీక్షుఁడు = భర్త. ఈక్షణము = చూపు. (కన్ను) సౌష్టవము = చక్కదనము. పోలఁగ = చక్కగా. నెమ్మది = మనస్సు. 23. రవి = సూర్యుఁడు. రోచిష్ణుఁడు = ప్రకాశించువాఁడు. ప్రస్ఫారము = మిగుల అధికము. ఆహవము = యుద్ధము. ప్రాభవము = ప్రభుత్వము. గణ = సమూహము. భ్రాజిష్ణుఁడు = ప్రకాశించువాఁడు. జిష్ణుఁడు = జయశీలుఁడు. 24 నరపతి = రాజు. పరిణయము = వివాహము. ఇరవారు = స్థిరపడు. 25. భాతి = ప్రకాశము. గ్రైవేయకము = మెడను బెట్టెడు సొమ్ము. (కంటె). కంకణము = మురుగు. కేయూరము = దండకడియము. 26. ఓపుదురు = చాలుదురు. అబ్ధి = సముద్రము. 27. నామము = పేరు. తపనుఁడు = సూర్యుఁడు. నందనుఁడు = కొడుకు సచివుఁడు = స్నేహితుఁడు, మంత్రి 28. దివిజారి = రాక్షసుఁడు. బవరము = యుద్ధము. 29. చరణాగ్రము = పాదముచివర (వ్రేలు) దర్పము = బలము ధూర్జటి = శివుఁడు. లీల = ఆట, సులభము. వాలము = తోఁక.



తోఁక. అమ్ము = బాణము. అని = యుద్ధము. పొరిగొను = చంపు. ఆజి = యుద్ధము. కడిమి = పరాక్రమము. ధనుర్ధరుఁడు = విల్లునుధరించినవాడు (విలువిద్యానిపుణుఁడు). ఎగ్గు = అపకారము. శక్రుఁడు = ఇంద్రుఁడు. భయద = భయంకరము. నిర్ఘాతము = పిడుగు, గాలివాన. సంఘాతము = పుట్టుట, సమూహము. వాతము = వాయువు. శాత = వాడి. ఘాతము = దెబ్బ 30. శ్రేణీభూతములు = పంక్తులుకట్టినవి. అధిక్షేపించుట = దాఁటుట దోస్స్థూణ = స్తంభములవంటి చేతులు. (బలిష్ఠమైనబాహువులు). పుంఖము = పిడి. ఉద్భూత = పుట్టిన. స్ఫులింగచ్ఛటా = అగ్నికణముల సమూహము. క్షురీణబాణములు = కుశలములగు బాణములు. త్రాణ = రక్షణము. 31. కొంచరు = సందేహింపరు. 32. విపులము = విస్తారము. క్షమ = ఓర్పు. ఉపవశము = ఉపశాంతి. వ్యపగతము = నశించినది. మతి = మనస్సు. వెంగలి = తెలివిహీనుఁడు. 33. జనకజ = సీత. మోదము = సంతోషము. భూరి = విస్తారము. 34. క్షోణి = భూమి. పయోధి = సముద్రము. గీర్వాణులు = దేవతలు. సాటి = సమానము. రాగిలు = సంతోషించు. నృపాలశిఖామణి = రాజశ్రేష్ఠుఁడు. జగత్ప్రాణుఁడు = వాయుదేవుఁడు. తనూజుఁడు = కొడుకు. ప్రాపు = సహాయము. 35. శరనిధి = సముద్రము. నిశాచరుఁడు = రాక్షసుఁడు. వెరవు = ఉపాయము. పృధివి = భూమి. 37. వఱపు = వానలేకుండుట. వల్లి = తీఁగ. మధుపము = తుమ్మెద. వసుమతి = భూమి. తనూజ = కూతురు. పొగులు = పరితపించు. 38. అర్ణవము = సముద్రము. పొరిగొని = చంపి. వరవర్ణిని = భర్తయందు ప్రేమగల ఉత్తమస్త్రీ. 39. అట్టడ = కోటబురుజుమీది యిల్లు. వ్రాతము = సమూహము. వప్రము = కోట. భటానీకము = భటసమూహము. కేతనము = టెక్కెము. 40 ఆమ్రము = మామిడిచెట్టు. అంకించి = మీదికెత్తి, జళిపించి, త్రిప్పి. వీఁక = ఉత్సాహము, పరాక్రమము. సమిత్ = యుద్ధము. జైత్రఘోషము = జయశీలుని నాదము. చండాట్టహాసము = విపరీతపునవ్వు. దోషాచరుఁడు = రాక్షసుఁడు.

అలుక = కోపము త్ర్యంబకుండు = ఎఱ్ఱనికన్నులుగలవాఁడు. భల్లము = బాణము. 41 దక్షిణభుజము = కుడిచెయ్యి. ధరణి = భూమి. చలించుట = కదలుట. వృక్షచరులు = వానరులు. అఱ్చుట = అఱచుట. అశనిసదృశత్వర = పిడుగుతో సమానమైన వేగము. తెంపు = ధైర్యము. 43. రజనీచరేంద్రుఁడు = రాక్షసుఁడు. కయ్యము = యుద్ధము. వృష్టి = వర్షము. అక్కజము = ఆశ్చర్యము. క్రమ్మర = తిరిగి. అంజనాత్మజుఁడు = ఆంజనేయుఁడు. 44. చరించు = తిరుగు. విశుద్ధ = పరిశుద్ధమైన. ఖ్యాతి = కీర్తి. పంకజసంభవుడు = బ్రహ్మ. 47. పయోవారిథి = పాలసముద్రము. ఒదవు = కలుగు. తృష్ణ = దాహము. చేరువ = సమీపము. తోయము = నీరు. 48. కడలేని = మితిలేని. కడుపారగ = కడుపునిండుగ. కడక = యత్నము. తడవు = ఆలస్యము. మడియుట = చచ్చుట. సౌమిత్రి = లక్ష్మణుఁడు. మగుడడు = తిరుగడు (బ్రదుకడు) విప్రుఁడు = బ్రాహ్మణుఁడు 49 రయము = తొందర. గ్రాహి = మకరి. భీకర = భయంకరము. దుస్సహము = సహింపగూడనిది. భేషజము = ఔషధము. తేఁకువ = ధైర్యము. 50. తెఱఁగు = విధము. తెగటారుట = చచ్చుట. వనజాప్తుడు = సూర్యుడు. ప్రాలియుట = చచ్చుట. మేను = శరీరము. మడియుట = చచ్చుట (నశించుట) 51. వసుంధర = భూమి. దంతి = ఏనుఁగు. అహార్యము = కొండ. 52. నీరధి = సముద్రము. విడిసి = దిగి. మున్ను = మునుపు. 55. ఉపేతుఁడు = కూడినవాడు, కడతేర్చి. తెగటార్చి = చంపి. తేజము = పరాక్రమము. 56. అకలంకము = కళంక రహితము. సామీరి = హనుమంతుఁడు. 57. సంతసించి = సంతోషించి. పావని = ఆంజనేయులు. తావక = నీయొక్క. 58. ఖ్యాతి = కీర్తి. సుగ్రీవము = మంచికంఠము. తాళి = పతకము, హార విశేషము. గ్రీవము = కంఠము. కృప = దయ. 59. స్తుత్యము = స్తుతింపదగినది. నిరతము = ఎల్లప్పుడు. దివి = స్వర్గము. 60. పెక్కు = అనేకము. భిన్నము = భేదము. 61 ఉన్నతి = వృద్ధి అశ్రమము = తేలిక. పడసి = పొంది. నరభోజనుఁడు = రాక్షసుఁడు. అన్వయము = వంశము. ఆజి = యుద్ధము. చోద్యము = ఆశ్చర్యము.

# పద్యములలోని కొన్ని పదములకు

# నానార్థములు.

అంబుజము = తామర, గన్నేరు చెట్టు.
అబ్ధి = కొలను, సముద్రము.
అగ్రము = చివర, ముఖ్యము, సమీపము, ఎదురుమొదలైనవి.
అహార్యము = కొండ, దోఁచఁదగినది, స్థిరమైనది.
ఆస్యము = ముఖము, నోరు, ముఖమునఁబుట్టినది.
ఆహవము = యుద్ధము, యాగము.
ఆజి = యుద్ధము, సమభూమి.
ఆపణము = అంగడివీధి, వర్తకము.
కర = వడగండ్లు, హస్తము, ఏనుఁగు తొండము, మొ
కూపము = గుంట, ఓడకంబము, పిఱుఁదిమీఁదిగుంత, మొ.
కోదండము = విల్లు, కనుబొమ, వెదురువిల్లు, మొ.
కాలుఁడు = యముఁడు, శివుఁడు, శనైశ్చరుఁడు.
కంకణము = శిఖరము, జలబిందువు.
కేతనము = టెక్కెము, గుఱుతు, ఇల్లు.
క్షోణి = భూమి, బ్రహ్మచారిమొలత్రాఁడు, సంఖ్యావిశేషము.
ఖ్యాతి = ప్రసిద్ధి, కీర్తి, స్తుతి
గణము = సమూహము, ప్రమథగణము, సేనావిశేషము, జాతి, మొ.
గ్రాహము = మకరి, గ్రహించుట, చెఱ, మొ.
ఘన = మబ్బు, దట్టమైనది, గొప్పది, చోరశక్యముకానిది, కఠినము, సమూహము, మొ.
ఘాతము = దెబ్బ, బాణము, హత్య, శక్తి, మొ.
చరణము = మూలము, కులము, పాదము, ముంగిలి, మొ.
జిష్ణుఁడు = గెలుచు స్వభావము గలవాఁడు, అర్జునుఁడు, ఇంద్రుఁడు.
తపనుఁడు = గ్రీష్మర్తువు, జీడిమ్రాను, నరకవిశేషము, సూర్యుఁడు
తృష్ణ = ఇచ్ఛ, దప్పి.
తోయము = నీరు, విధము, తెగ. సమయము, పరివారము, మొ,
తేఁకువ = ధైర్యము, భయము, తెలివి, మొ.
తేజము = ప్రకాశము, ప్రభావము, పదను, జ్వాలలయొక్క కొన, పంచభూతములలో నొకటి

అందము, అగ్ని, అశ్వగమన
వేగము, బంగారు, మొ.

దివి = ఆకాశము, స్వర్గము, పాలపిట్ట.

దంభోళి = వజ్రాయుధము, జాతివాలు, పిడుగు

దర్పము = అహంకారము, కస్తూరి.

దంతి = ఒక దినుసు చెట్టు, ఏనుఁగు, కొండ, కోఱపంటివాఁడు.

నేత్రము = కన్ను, తరిత్రాడు, వేరు, ఏఱు, పట్టువస్త్రము, నక్షత్రము.

నామము = పేరు, నొసట పెట్టుకొను బొట్టు, మొ.

నందన = ఇంద్రుని యుద్యానవనము, పుత్త్రుఁడు.

ప్రేక్షణము = నేత్రము, ఈక్షణము.

పుష్కరము = ఆకాశము, ఉదకము, తామర, ఒక ద్వీపము, యుద్ధము, బాణము, మొ.

ప్రాసాదము = దేవాలయము, రాజగృహము.

పౌలస్త్యుఁడు = రావణుఁడు, కుబేరుఁడు.

ప్రమద = సంతోషము, మత్తుఁడు, స్త్రీ, మొ.

భాసురము = పటికపుఱాయి, ప్రకాశించునది.

భూతి = ఐశ్వర్యము, సంపద, భస్మము, పుట్టుక.

భూరి = బంగారు, అధికము, ఒక సంఖ్యావిశేషము

భుజంగము = పాము, విటుఁడు.

భాస్కరుఁడు—సూర్యుఁడు, అగ్ని.

భల్లము = బల్లెము, ఎలుఁగుబంటి, బాణము.

భాతి = కాంతి, విధము, వలె.

ముఖము = ప్రధానము, ఆరంభము, ముఖము. మొ

యోజనము = ఆమడ, సూది, కూర్పు, గొంటువక్క.

రయము = వేగము, ప్రవాహము.

రవి = సూర్యుఁడు, జీవుఁడు.

రుచి = కిరణము, కాంతి, అత్యాసక్తి, ఇచ్ఛ.

రామ = పశువు, నలుపు, సుందరమయినది, మొ.

రామా = స్త్రీ

లలితము = స్త్రీల శృంగారచేష్టాది విశేషము, ఈప్సితము, మనోజ్ఞము మొ.

వరవర్ణిని = భర్తయందనురాగముఁ గల స్త్రీ, పసుపు, గోరోజనము మొ.

వప్రము = సీసము, కోట, వరిమడి, తీరము, మొ.

వృష్ణి = వర్షము, పొట్టేలు, కృష్ణుఁడు, ఇంద్రుఁడు, అగ్ని, మొ.

వాలము = తలవెండ్రుక, తోఁక, కురువేరు.



వహ్ని = కన్ను, గుఱ్ఱము, అగ్ని.

వజ్రి = ఆకుచెముడు, ఇంద్రుఁడు.

వీర్యము = పరాక్రమము, ప్రభావము, మొ.

వాపి = వడబావి, దీర్ఘిక, కోనేరు.

శక్రుఁడు = ఇంద్రుఁడు, కొడిసెచెట్టు.

శాత = సుఖము, తీక్ష్ణము, కృశించినది.

శ్రుతి = వేదము, వార్త, చెవి, వినుట.

శరనిధి = సముద్రము, అమ్ములపొది.

సచివుఁడు = మంత్రి, తోడైనవాఁడు. మొ

సంఘాతము = సమూహము, నరకభేదము, గట్టిదెబ్బ, మొ.

సాల = వృక్షము, ఇల్లు, ప్రాకారము. కోట. మొ.

సౌధము = రాజగృహము, మేడ, నగరు.

సౌదామినీ = అప్సరస, మెఱపు.

స్కంధము = చెట్టు, బోదె, యుద్ధము, సమూహము, విషము, పాపము, మొ.

సమిత్ = యుద్ధము, కట్టె.

హొన్ను = పొన్ను, బంగారు.

